
ఆంధ్రసచిత్రవారపత్రిక



8-9-72

50 పైస



"యార్ మెరా"లో రాఖి


పచ్చని సంసారంలో చిచ్చురేపి పొగ ఊదేవాడు చివరకు తానే
చిచ్చుపాలై పోతాడన్న సత్యాన్ని నిరూపించే చక్కని చిత్రం
శక్తి మూవీస్
ఇన్‌స్పెక్టర్ భార్య
THARAKA RAMA
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకపర్యవేక్షణ
నిర్మాత: కె. జయశేఖర్ ఎ.సి. త్రిలోకచందర్ M.A.
ఆంధ్ర: తారకరామ,
నైజాం: శ్రీ తారకరామ, సీడెడ్: నవభారత్
దర్శకత్వం: పి.వి. సత్యనారాయణరావు

ఉత్తరాలు

కథలు

రచన రచయిత గురించి జి. వి. శారదగారు వ్రాసినది చదివాను. రచయిత ప్రస్తుతం తాను జీవిస్తున్న సమాజానికి అతి సమీపంగా వచ్చి వ్యక్తుల జీవితాలను తన రచనల ప్రభావం ద్వారా మార్చాలని ప్రయత్నిస్తే అతని నిజజీవితంలోని నిజాయితీకోసం పాఠకులు చూస్తారు. అది బ్రతికున్నంత కాలమే. తెలుగులో చలం, విశ్వనాథ, శ్రీశ్రీ వంటి ప్రతిభ గల రచయితలే ఆలా పాఠకులను ఆకట్టుకోగలిగారు. వారి రచనలలోని ఆశయ దీప్తిని, ఆవేదనలోని అంతరార్థాన్ని అర్థం చేసుకో గలిగిన పాఠకులు వారి జీవితాలలోని వైవిధ్యాన్ని, స్వల్ప లోపాలను క్షమించ గలుగుతారు. ఆవిషయం విస్మరించ బడింది.

—జయసూర్య, (కొవ్వూరు)

* * *

'మంత్రిగారొస్తున్నారు' చదివినప్పటినుంచి ఉత్తరము వ్రాసి, రచయిత శ్రీ మాష్టరు రవిగారిని అభినందించవలెనని యున్నది. ఆకథ పూర్తి అయిన టప్పటికి కన్నీళ్లు ధారగా కారిపోయినవి. ఇప్పటి కయినా మంత్రులు వాళ్ల పర్యటనలు,నిరాడంబర ముగా చేసికొని చిన్న పిల్లలను సహితము బాధపెట్ట కుండా చేసికొంటే బాగుంటుంది. ఇవతల జన సామాన్యము యొక్క విలువైన కాలము తనుగురించి ఎంత వృథా అగుచున్నదో తెలిసికొని, పంక్చువల్ గా వుండటము, గ్యాపరు తగ్గించుకొనుట చాలా అవసరము.

—కె, శాంత, (కాకినాడ)

* * *


ఈసంచికలోనే మధుసూదనరావు(హైదరాబాద్) గారి ఉత్తరము చదివాను. ఉత్తరము వ్రాయడం ఒక కళే. ఒప్పుకుంటాను— 'ఆ కథ బాగుంది—రచయిత్రికి అభినందనాలు' లాంటి, ఉత్తరాలు ప్రచురించడం దండగ' అని వ్రాశారు. ఒకకథ బాగుంటే, బాగుందని—బాగులేనిచో బాగులేదు, అని వ్రాయటంలో తప్పేముంది?

వి. కె. స్వామి (భువనేశ్వర్)

* * *

ఆహా! అనామధేయా! నీ ఉత్తరకథ సొగసుగా చాలా సీరియస్‌గా వ్రాస్తున్నావు. నీ పద్యాలు వాటి తాత్పర్యాలు బ్రహ్మాండం. వారు వ్రాసిన 'ప్రబంధసుందరి', 'కుచేల సంతానం', 'ద్రవ్యభక్తి', 'ఇంటిపోరు', 'మంచె కింద మనవారం', 'కలికాలం మహాత్మ్యం' మొదలగు చిత్రాలన్ని శతదినోత్సవాలు రజితోత్సవాలు జరుపుకున్నవేనుకుంటా అన్ని ఉత్తమ చిత్రాలను చూసిన వారు ఆయా చిత్రాల నామధేయములను మరలా గుప్తంచేసి ఆయా చిత్రాలకు పేర్లు దొరకని నిర్మాతలకు చాలా సహాయం చేశారు. అనామధేయా, నీ నామం నాకు అనవసరం, నీ కథ చాలా అవసరం.

జె. పార్థిప్రసాద్, (మద్రాస్)



రేడియోపైన మహత్తర క్షణాల కోసం
ఎస్ట్రెలా యొక్క
శక్తివంతమైన రేడియో బ్యాటరీలు



ఎస్ట్రెలాయొక్క శక్తివంతమైన రేడియో బ్యాటరీలు రేడియోపైన ప్రపంచ వ్యాయామ క్రీడల వార్తలు అధిక-శక్తి వంతమైన ఎస్ట్రెలా బ్యాటరీలను ఉపయోగించుట వల్ల ప్రసారమగు సంపూర్ణమైన, విస్పష్టమగు ధ్వనితో అత్యంత ఉల్లాసకరంగా నుండును. కాగితపు ప్లాస్టిక్ మరియు లోహపు జాకెట్లలో అమర్చబడియున్న బ్యాటరీలలో కావలసినవి ఎంచుకోండి, అవి లీక్-ప్రూఫ్ మరియు చాలా ఎక్కువ కాలం ఉపయోగపడతాయి. అతి కాంతిగల వెలుగును, నమ్మకముగా పనిచేయుటకు టార్చీలకు కూడ సరియైన ఎన్నికైనవి.

ఎస్ట్రెలా
బ్యాటరీస్

అధిక శక్తి-అధిక ఉపయుక్తి

ఎస్ట్రెలా బ్యాటరీస్ లి. బొంబాయి

సీరియల్

ఈవారం (11—8—72) పత్రికలో తేజోవతి గారి 'విద్యార్థి' చదివాక యీ ఉత్తరం రాయకుండా వుండలేకపోతున్నాను. రచయిత్రి, విద్యార్థి చదివే కాలేజీలో జరిగిన ఫంక్షన్ గురించి చెపుతూ గవర్నరు శ్రీ పట్టంధాను పిళ్ళే ప్రారంభోత్సవం చేశారని, వైస్ ఛాన్సలర్ శ్రీ శ్రీనివాస అయ్యంగార్ వుపన్యసించారని రాశారు. బాగానే వుంది. కాని నాదొక సూచన—రాజకీయ నాయకులను, విద్యావేత్తలను గురించి చెప్పినప్పుడు వాళ్ళ 'హోదా' పేర్కొంటే చాలని నా ఉద్దేశ్యం పేర్లు చెప్ప నక్కర లేదు. అస్తమానూ రాజకీయ, విద్యారంగాల్లో వ్యక్తులు మారుతూ వుంటారు. ఉదా: శ్రీ తాను పిళ్ళే, శ్రీ అయ్యంగార్‌లు తమ పదవులను విడిచి కొన్ని సంవత్సరాలు గడిచి పోయింది శ్రీ పిళ్ళే మరణించారు., శ్రీ అయ్యంగార్ వైస్‌ఛాన్సలర్ పదవికి రాజీనామా ఇచ్చిన తరువాత ఆస్ట్రేలియా వెళ్ళిపోయారు (తిరిగి వచ్చారో లేదో అది వేరు విషయం) ప్రస్తుతానికి వస్తే కథలో వారి పేర్ల ప్రస్తావనను కొందరు రాంగ్ ఇన్ఫర్‌మేషన్ యిచ్చినట్లు భావించవచ్చుకదా? కనుక పేర్లను పేర్కొనటం అనవసరమని రచయిత్రికి గుర్తు చేస్తున్నాను.

—ఎ. యస్. చక్రవర్తి,
(పమిడి ముక్కల)

వ్యాసాలు

శ్రీమతి కె. రామలక్ష్మిగారి 'అనుకున్నదీ—అన్నదీ' చదివాక నవ్వుకోకుండా ఉండలేక పోయాను.

—సత్యవోలు సుబ్బారావు, (విశాఖపట్నం)

*

విన్నాళ్ళకో మళ్ళీ ముళ్ళపూడి పత్రికలో కనబడడం ఆయన తన అయ్యవారికి తెలుగు వెలుగులో నివాళు లివ్వడం ముళ్ళపూడి సందర్భ సముయోచితలకు ఆనందం కలిగింది.

నిజానిజాలను లు చ. తప్పక తూనిక వేస్తూ సునిశిత వ్యక్తి పరిశీలన చేస్తూ, రసస్ఫూర్తితో నిష్పక్ష ధోరణితో ధారా వాహికంగా పత్రికలో ఆరోజుల్లో వెలిడిన తెలుగు వెలుగుకు అయ్యవారు పూజ్య శ్రీ స్వర్గీయ శివలెంక శంభూ ప్రసాద్ గారని తెలిసి, అంతటి భావ గర్భిత వరవడి, మేధా మథన చేసే శైలి నందించే ఒక తరం ద్రష్ట జాతీయ మరణం ధ్రువం సూక్తికి తలవంచవలసి వచ్చినందుకే ముళ్ళపూడితో పాటు యెందరో అజ్ఞాత పాఠకులు అశ్రువులు విడుస్తూనే వుంటారు. ఇది సత్యం.

—చెరుకుమిల్లి సత్యనారాయణ, (దరిశి)

* * *

ఈవారం 21—7—1972 సంచికలో ఉత్తరాల శీర్షికయందు ఆకివీడు పాఠకులు శ్రీ ఎం. డి. యిసాహాక్ మదనిగారు వ్రాస్తూ, సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో తెలుగు పాటలు ప్రపంచములోని రేడియో కేంద్రంనుండీ రావని, ఒకవేళ వస్తే తెల్పినచో ఆనందిస్తామని వ్రాశారు. వారి కొరకై యీ ఉత్తరం వ్రాస్తున్నాను.

1) సాయంకాలం గం. 5—45 ని. నుండి హైదరాబాద్ బి. కేంద్రంవారు వారములో మూడు నాలుగు దినములు తెనుగు పాటల ప్రసారము చేస్తారు. ఈ కార్యక్రమము గం. 6—5 ని.వరకు యుంటుంది. అటువంటి సమయమున కథలో జయ విన్న పాత పాటలు (తెనుగు) వి కారాదా?

2) ఆకాశవాణి కడప కేంద్రంవారు ప్రతి గురువారము సాయంకాలం గం. 5—55 ని. వరకు వారి కేంద్రం ప్రారంభంనుండి అనగా సాయంత్రం గం. 5—30 ని. నుండి గం. 5—55 ని. వరకు తెలుగు పాటలను ప్రసారము చేస్తారు కథలో జయ విన్న పాటలు ఇవి కాకూడదా?

3) రేడియో మలేషియావారు కౌలాలంపూర్ కేంద్రంనుండి [illegible] ది, మంగళ, గురువారములందు సా. గం. 5—30 ని. నుండి 6—00 గంటల వరకు తెనుగు పాటలు ప్రసారము చేయుదురు. పై రెండు తప్పినచో నాయకి (కథలో) విన్న తెలుగ పాటలు వి కారాదా?

ఇవన్నియు తెలిసి సదరు పాఠకుల కిట్టి ఉత్తరము వ్రాశారో లేక రచయితను తప్పు పట్టి ప్రశ్నించటం ధ్యేయంగా యెంచుకొని యీ ఉత్తరము వ్రాశారో దురహ్యాము.

ఏది ఏమైన సదరు పాఠకుడు సాయంకాలం ఆరు గంటల ప్రాంతంలో తెనుగ పాటలు ప్రసారమవుతాయని, అవి పాత పాటలు కారాదని అంకలేదని గుర్తిస్తారని ఆశిస్తాను.

ఎస్. ఎ. ముబారక్ (హైదరాబాద్)

పైవారమే!

వినాయకచవితి సంచిక

వెల మామూలే!

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశినాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 - 1972)

శుక్రవారం 8-9-72

శ్రీపరీధావినామ సం॥ భాద్రపద మాసం॥ శు పాడ్యమి

సంపుటము : 65 సంచిక : 55

స్థాపితము 1908

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
[illegible] తంబుచెట్టి వీథి, మద్రాసు - 1

విడి ప్రతి వెల 50 పైసలు

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నటుడు కృష్ణ
(శ్రీ జి. అరుణరావు)

మూడవ అట్టపేజీలో - వెంకన్నా'స్ కోల్డు
(కార్టూన్ సీరియల్)

కథలు :

చచ్చేందుకు వైరేదు — 17
అసమర్థుడు — 52

సీరియల్ నవలలు :

విద్యార్థి — 22
ఆకాశదీపాలు — 42

వ్యాసాలు, శీర్షికలు, సినిమా:

ఉత్తరాలు — 2, ఈవారం కార్టూన్ 5, ఆధునిక తెలుగు సాహిత్యంలో మత నిరపేక్ష, ప్రజాస్వామ్య — సమాజవాద ప్రవృత్తులు — 6, ఆంధ్రకేసరి—8, నామ [illegible] త్మకథ - 10 హరిదాసు (కార్టూన్)—14 ప్రశ్నావళి - 16, సముద్రఘోష (గేయం)—24, సినిమా - 29, సినిమాడ్స్ 30, నాకు తెలుసా? 32, వారఫలం 38, 'ప్రస్తుతం దేశానికి కావలసినది గుండె మార్పిడికాదు'—40, ధర్మపథం 48, ఒకవారం విపరీతం — 50, అవీ...ఇవీ — 51, భారతీయ చిత్రకారులు — 54, కొన్ని సామాన్య వ్యాధులకుపథ్యా పథ్యములు—56, పుస్తకాలు—64.


కాంగ్రెస్ కోళ్ల పెంపకం కేంద్రం
మీ కోళ్ల పెంపకం కేంద్రంలో ఒకడ్నిగా ఉండాలనుకుంటున్నాను.
భుట్టో
ఈ ఊసరవెల్లి మళ్లీ రంగు మారుస్తుందనుకుంటాను
నేను మరోలా అనుకుంటే తప్ప బంగ్లాదేశ్‌కి ప్రవేశం లేదు
ఐక్యరాజ్య సమితి
ఉగాండా నల్లవారి జాతి విచక్షణ
తెల్లపులికంటే ఈ నల్ల పులి క్రూరమైందిలా ఉందే!
ఉగాండాలోని ఆసియా ప్రజలు

ఆధునిక తెలుగు సాహిత్యంలో మతనిరపేక్ష, ప్రజాస్వామ్య-సమాజవాద ప్రవృత్తులు

-ప్రొ॥ జి. సుందర రెడ్డి

(గత సంచిక తరువాయి)

తెలుగు కథాసాహిత్యంలో కూడా యీ ప్రవృత్తి ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని, కన్పిస్తూనే వుంది. అంధవిశ్వాసంతో అగ్రవర్ణస్థులైన హిందువులు సమాజంలో హరిజనుల నేవిధంగా క్రూరంగా అణగద్రొక్కిండీ, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ తమ 'మాలపల్లి' నవలలో చిత్రించారు. ఈ నవల లక్ష్యం కేవలం హరిజనోద్ధరణయే. ఆ నవలలో ఒకచోట వారు ఈ విధంగా అన్నారు—'మానవుని అహంకారమునకు ప్రతిరూపమే ఈ ఉన్నత జాతి; అదే అగ్రవర్ణంగా చలామణి అవుతున్నది. అందుచేత యీ అగ్రవర్ణస్థులు భగవంతునికి చాలా దూరమైపోతున్నారు. నిమ్న జాతుల వారియందు వినయము చాలా స్వాభావికముగా ఉంటుంది; అందుచేతనే వారికి మోక్షము సులభముగా లభిస్తుంది.' రచయిత హరిజనులను సమాజంలో ఉన్నతస్థాయికి తీసుకొని పోవలెనని ప్రయత్నించారు. స్వాతంత్ర్యానంతరం హరిజన సమస్య, వర్ణాంతరవివాహ సమస్యలను తీసుకొని వ్రాయబడిన నవలల్లో ముప్పాళ్ళ రంగనాయకమ్మ రచించిన 'బలిపీఠం' అత్యంత ప్రసిద్ధమైనది. ఈ నవలలో రచయిత్రి వర్ణాంతరవివాహం చేసుకున్న రెండు జంటల దాంపత్య జీవితాన్ని చిత్రించింది. 'అరుణ—భాస్కర్'ల వివాహం విఫలం కావడానికి కారణం అరుణ సంకుచిత ప్రవర్తనే, రెండవ జంట విమల—జేమ్సుల జీవితం సుఖమయం కావడానికి కారణం వారి విశాలదృక్పథమే. ఈ నవలలో జాతి, మత విద్వేషాలను గూర్చి యోచించి అగ్రజాతి లేక అగ్రవర్ణమనే సిద్ధాంతము నిస్సారమైనదని నిరూపించుటయే రచయిత్రి ముఖ్యలక్ష్యం.

స్వాతంత్ర్యానంతరం తెలుగు నాటక సాహిత్యంలో మతసామరస్యతనే ప్రధానంగా గ్రహించి నాటకం వ్రాసిన వారిలో కొడాలి సుబ్బారావు, ఆత్రేయ ముఖ్యులు. సుబ్బారావుగారి 'ఆహుతి', ఆత్రేయగారి 'ఈనాడు' నాటకాలలో హిందూ—ముస్లిమ్ మత సామరస్యతయే ప్రధానముగా చూపబడింది. 'ఈనాడు'లో హిందూ—ముస్లింల సంఘర్షణ సందర్భంలో యిద్దరు మిత్రులు (ఒకరు హిందువు—మరొకరు ముస్లిమ్) ఒకరొకరికి సహాయం చేసుకుంటూ, తమ ప్రాణాలను సైతం అర్పించుటకు సిద్ధం కావడమే ఈ నాటక యితివృత్తం—ఈ సమస్యనే తీసుకొని అనేకులు అనేక నాటకాలు వ్రాశారు. అయితే అవంతగా పేర్కొనదగినవి కావు. అస్పృశ్యతను తొలగించుటకై నాటకరచన చేసినవారిలో శ్రీ బోయి భీమన్న ప్రసిద్ధులు. భీమన్నగారు వ్రాసిన 'పాలేరు'. 'పడిపోతున్న అడ్డుగోడలు' అను రెండు నాటకాలు చాలా ప్రసిద్ధమైనవి. ఆ రెండింటిలోనూ రచయిత అస్పృశ్యతను సమూలాగ్రంగా తొలగించాలని నొక్కి వక్కాణించారు. ఇదే అంశంపై వ్రాయబడిన నార్ల వెంకటేశ్వరరావుగారి 'కొత్తగడ్డ' పేర్కొనదగినది. అంతేకాక కుటుంబరావు అదిగాగల ఆధునిక తెలుగు రచయితలు మతనిరపేక్ష సమాజ నిర్మాణముకై తమ రచనలద్వారా కృషి చేశారు.

ప్రజాస్వామ్య ప్రవృత్తి

ప్రజలచేగాని ప్రజాప్రతినిధులచేగానీ నిర్వహించబడు పరిపాలనను ప్రజాస్వామ్య మంటారు. అబ్రహాము లింకన్ నిర్వచించినట్లుగా ప్రజాపాలన, ప్రజలద్వారా, ప్రజల కొరకై నిర్వహింపబడునదే ప్రజాస్వామ్యం (The Government of the people, by the people, for the people) భారతదేశంలో సామ్రాజ్యవాదులైన బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమం, అర్ధశతాబ్దంపాటు సాగింది. తిలక్, గాంధి, నెహ్రూ వంటి మహానాయకులు ఈ పోరాటానికి నేతృత్వం వహించారు. ఈ నాయకుల అవిరళ కృషివలన చివరకు 1947 వ సంవత్సరములో భారతదేశం స్వతంత్ర్యం పొందింది. సామ్రాజ్యవాదుల స్థానంలో ప్రజాస్వామ్య ప్రభుత్వస్థాపన జరిగింది. అయితే ఆ ప్రజాస్వామ్య ఫలితాన్ని యే కొద్దిమందో గుత్తకు పుచ్చుకొని అనుభవిస్తున్నారు. ఆర్థికరంగంలో భారతదేశం కొంత ప్రగతి సాధించినా, మన ఆర్థికాభివృద్ధిలో పెట్టుబడిదారీ సమాజంలోవలె అనేక లోటుపాట్లు కనిపించసాగాయి. ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వము సాధారణ ప్రజానీకానికంతగా ఉపయోగపడలేదు. వారు నిత్య జీవితానికి అవసరమయిన వస్తువులను కూడా పొందలేకపోయారు. ఈ ప్రజాస్వామ్యపు ముసుగులో రాజకీయ నాయకులు, మంత్రులు, పెట్టుబడిదారులు బ్లాక్ మార్కెటింగ్ వ్యాపారస్థులు దేశంలోని సుఖసాధన—సంపత్తులను తమ స్వాధీనం చేసుకున్నారు. వీరు ప్రజల అజ్ఞానం; నిస్సహాయతవలన లాభం పొందుతూ ఎన్నికలలో అర్థబలంద్వారా ప్రజాప్రతినిధులుగా ఎన్నుకొనబడి ఇటు దేశాన్ని, అటు ప్రజలను దోచుకుంటున్నారు. ఈ వ్యవస్థకు ప్రతిక్రియగా స్వాతంత్ర్యానంతర తెలుగు సాహిత్యంలో కొన్నిరీతులు నెలకొనినవి. శ్రీశ్రీ, ఆరుద్ర, బైరాగి, తిలక్, నారాయణరెడ్డి, నరవరరావు, సి. విజయలక్ష్మి, దిగంబరకవులు ఆదిగాగల కవులు తమ కావ్యరచనలో గడచిన పాతికేండ్ల ప్రజాస్వామ్య ప్రభుత్వపుతీరును, వ్యంగ్యంగా వర్ణించి, తమ శక్త్యనుసారము అన్యాయమును, దాని నిరూపాన్ని వ్యతిరేకించి, ఖండించారు. ఆరుద్ర, నరవరరావు, సి. విజయలక్ష్మి పాలకుల అధికారుల పిచ్చుకవిడిలనాప్పి; నైతిక

పతనాన్ని తీవ్రంగా విమర్శించారు. స్త్రీ కవులలో తన ప్రత్యేకశైలి దృష్ట్యా కటువ్యంగ్య ప్రదర్శన దృష్ట్యా విజయలక్ష్మి స్థానము అత్యంత ఉన్నతమైనది. మనదేశంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వ విశ్వరూపాన్ని పి. విజయలక్ష్మి ఈ విధంగా వర్ణించారు—

'బొట్టు రక్తంబొట్టు గూడా చిందకుండా
అహింసా మంత్రజపంవల్లనే అమాంతం
జాతికి స్వాతంత్ర్యం రాగా
తెల్లదొర సీట్లో నల్లదొర భేషుగ్గా
ఆసీనుడయ్యాడు
పరమాత్మ సృష్టి ప్రజాతంత్ర
రాజ్యాంగ చట్టం
ప్రసాదించింది ఆడా మగా తేడా లేకుండా
అందరికీ రైట్ టు వోట్
అయిదు సంవత్సరాలు గిర్రున తిరిగాయి
తిరిగి జనరల్ ఎన్నికలొచ్చాయి
గత ఎలక్షన్‌లో గెల్చి అంతటితోనే
పత్తాలేకుండా అదృశ్యమైన ప్రజా
సేవకులంతా
వాన వెలిసింతర్వాత నేలలోంచి పుట్టు
కొచ్చే పుట్టగొక్కుల్లా
పుట్టల్లోంచి వచ్చి పడగలువిప్పే ఆడ
నాగుబాముల్లా
ఒక్కొక్కళ్ళే బైటికొచ్చి
సర్వాన్ని నిర్ణయించే సావరిన్ ప్రజల్ని
తిరిగి సందర్శించేందుకు, విసుగు
విరామం లేకుండా
రంగు రంగుల కళ్ళద్దాలతో సంగనాచి
కబుర్లతో
చెంగలించే తురంగల్లా టూర్
చేసేస్తున్నారు
దేశనాయకులూ దేశభక్తి యూనియన్లు
సేవకులు
సినీరంగం హీరోలూ, చిత్రజగత్తులోని
అగ్రతారలు
ధర్మోపదేశకులు, బాబాలు, బిషప్పులు
సాములోర్లు పూజ్య గురూజీలూ
మహిళామండలి లీడర్లు, మందిని
ముంచే స్పీడర్లు
నియోజకవర్గాలచుట్టూ రంకుల
రాట్నాల్లా గిరగిరా తిరిగేస్తున్నారు.'

జమీందార్లనుండి, పెట్టుబడిదార్లనుండి ప్రత్యేక రాజకీయ దళంవారు లాభం తీసు

ఆంధ్రకేసరి

(శతజయంతి సంస్మృతి)

ఆపదల తుపాను అలల
మూపులపైన ఎనభయ్యేళ్ళు
సవిలాసంగా స్వారి చేసిన
అసహాయ శూరుడు

అక్రమ మెక్కడ జరిగినా
అక్కడ తానై అడ్డుపడి
ప్రవాహాన్ని ముంజాలు
పట్టి లొంగదీసిన
ఆబాల్య వీరుడు

ముష్కర బ్రిటిష్ సైనికు లెత్తిన
మొండరి గండు తుపాకులకు
గుండె చూపి వాకట్టు
చేసిన గండర గండడు
పర్వతాలు వచ్చి ఢీ కొంటున్నా,
జంకు కొంకులేక నిలబడ్డ
రణ పెంకి సరదారు

అంతవాడు
అంతవాడు
పుడతాడా మళ్ళీ
తెలుగు తల్లి కడుపున

పది వాక్యాల్లో సభలో
వలవల కన్నీరు కురిపించి
పది మాటల్లో మళ్ళీ శ్రోతల్ని
జ్వాలాముఖుల్ని చేసిన మహావక్త

అల్లరికె సభకు వచ్చిన
దుండగీళ్ళను కూడా
ఐదు నిముషాల్లో ఆకట్టు
కొన్న మహా మంత్రవేత్త

'ప్రజాస్వామ్యంలో
పరమోన్నత న్యాయస్థానం
ప్రజా న్యాయస్థానం
అని ప్రవచించి
ప్రజలు తీర్పరులైన
అన్ని ఎన్నికల్లోను
నేర్పుగా తనవాదమే
నెగ్గించుకొన్న
ప్రజా న్యాయవాది

అంతవాడు
అంతవాడు
పుడతాడా మళ్ళీ....
తెలుగు తల్లి కడుపున

ప్రబుద్ధాంధ్ర జాతిపితగా
విశాలాంధ్ర ప్రదేశ స్థపతిగా
చరిత్రలో స్వర్ణాక్షరాల్లో
ప్రకాశించే పురుషసింహుడు

ఆంధ్ర రాష్ట్రావతరణ
శుభ తరుణంలో
ఖైదీలందరికీ మూక ఉమ్మడి
విముక్తి ప్రసాదించి
అతిరథ నాయకులు నాల్కలు
కొరుక్కునేట్టు చేసిన
ఆదర్శ విమోచనోద్యమ నాయకుడు
అంతవాడు
అంతవాడు
పుడతాడా మళ్ళీ....
తెలుగు తల్లి కడుపున
పట్టేది జరగదు ఒరగదు
ఇదే మనకి తగిన శాస్తి
మన పాపాలకి తగిన శాపం

ఆ త్యాగ రాజుని మనవాళ్ళు
అడుగడుగునా పెట్టిన హింసలు
కట్టి కుడపక మానతాయా మనల్ని
అయినా ఓ ప్రజాహిత కాముకా
ఓ ఉదాత్త ధీర నాయకా
నీ దేశ దాస్య విమోచనంకోసం
నీ రాజ భోగాలన్నీ విసర్జించి
నీ కుటుంబ క్షేమాన్నే విస్మరించి
కేవలం ప్రజల శ్రేయస్సుకోరి
బికారివై పరిభ్రమించిన
రాజ పరివ్రాజకా

నీ ప్రజల్ని నువు శపించవు
నువ్వు ఎవ్వరినీ హింసించవు
హింస అనుభవించడమే గాని
ప్రతి హింసా వీరం వదిలేశావు గద
ఏ పాప మెరుగని పాపలు తండ్రీ
రేపటి తరాల తెలుగు పాపలు
కాపాడగలవు నువ్వెల్లాగూ
ఆశీర్వదిస్తావు వాళ్ళని
నీలాగ ఎత్తుగా ఎదగాలని
నీ కష్టాలేవీ వాళ్ళకు
ఎదురు రాకూడదని
నువ్వు విహరించిన దేశం
నిన్ను స్మరించి గర్వించే ప్రజ
శాంతి దాంతి సౌజన్యాలతో
ధర్మ వీరసత్త్వంతో వర్ధిల్లాలని
నీ ప్రభా దివ్య కాయంతో
మా ప్రభాతాల పరిమళిస్తూ
నీ ప్రియ ధరిత్రి వందించవే
చిరంజీవి
తెలుగు వెలుగ!

—బి. వి. సింగరాచార్య

ఆధునిక తెలుగుసాహిత్యంలో..

కొని ఎన్నికల్లో గెలవాలని తమ వాక్బాణాలను ఏ విధంగా ప్రయోగించేదీ, కవి సమగ్రంగా చిత్రించాడు. రాజకీయ నాయకులు మతం—జాతి—వర్ణం—ధనం మొదలగు వాటిని తమ స్వార్థానికి అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారు. చివరలో విజయలక్ష్మిగారు ఆచరణకు యోగ్యముకాని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని గూర్చి ఈ విధంగా వర్ణించారు. :—

'ఆధునిక ప్రజాస్వామ్యమంటే
అందరినీ నొప్పించి మెప్పించే వెలయాలేగా ?
ఏ మిండగాడికి వ్యతిరేకంగా ప్రవర్తించినా
పడుపుకత్తెకి పైస రాల్దు
ఎన్నికలముందు ఎవరి మనస్సు చివుక్కుమనిపించినా
బ్యాలెట్ పెట్టెలో ఒక్క వోటుగూడా పడదు'

దిగంబరకవులు గూడా తమ కావ్య సంకలనాలలో ప్రజాస్వామ్యం పేరిట జరిగే అత్యాచారాలను అన్యాయాలను ఖండించారు. ప్రజలు యిటువంటి గోముఖ వ్యాఘ్రాల బారినుండి తమ్ము తాము రక్షించుకోవాలని ప్రబోధించారు. దిగంబర కవులలో ఒకడైన మహాస్వప్న ప్రజాస్వామ్యం పేరిట ప్రజలను పీడించే శాసకులను సంబోధించి ఈ విధంగా అన్నాడు :—

'నాకు తెలుసు అసలిక్కడ మనుషులు లేనే లేరని
నాకు తెలుసు మీరంతా మనుషులు కానే కారని
మీరంతా చీకట్లో తిరుగుతున్న గజ దొంగలు
మీరంతా ముసుగుల్లో నటిస్తున్న వంచకులు
మీరంతా! మీరంతా!
నల్లులరా! నల్లులు! బల్లులరా! బల్లులు!
రక్తంపీల్చే జలగలు! పిశాచాలు!
నిశాచరులు!'

ఈ విధంగా అత్యాధునిక తెలుగు కవిత్వం రాజకీయ చైతన్యంతో నిండి ఉంది.

(ముగింపు పైవారం)



ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు

అనామధేయుడి ఆత్మకథ

ఆర్వీయ

సీరియల్ హాస్యరచన

6

ఉత్తరాల మీద ఉత్తరాలు రాయడం...

కొన్నిటికి తలా తోకా వుండవు. ఫైళ్లెప్పుడూ టేబుల్ మీదా, పక్కా, వెనక్కీ, ముందూ — తగలడ్తూ ఉండవలసిందే! ఆ ఫైళ్ల జెయిల్లో ఏక్‌దమ్ మగ్గిపోయి, ఆ కాగితాల సముద్రంలో మునిగిపోయి ఊపిరి సలపకుండా పోయింది. అలా ఏవేవో ఉత్తరాలు రాస్తూ, ఆఫీసర్ల చేత సంతకాలు పెట్టిస్తూ, ఫైళ్లలో 'మునగాం, తేలాం' అని తేల్చి, మినిస్టీరియల్ కేటగిరీలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకొన్నందుకు నన్ను నేను (మరెవరూ ముందుకి రాకపోవడం చేత) అభినందించుకొంటూ, తద్వారా దేశానికి యథోచిత — ఉడతాభక్తి సహాయం చేస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నాను.

'ఆఫీసర్స్ మే కమ్ అండ్ ఆఫీసర్స్ మే గో, బట్ ఐ రిమెయిన్ ఫరెవర్' (ఆఫీసర్లు రావొచ్చు, పోవచ్చు — నేను మాత్రం స్థిరోభవ!) అన్నట్లు మన హయాంలో ఎందరో ఆఫీసర్లు రావడం, పోవడం జరిగింది.

అందులోనూ ఒక్కొక్క అధికారిది ఒక్కొక్క విడ్డూరమైన మనస్తత్వం! అప్పట్లో ఒక అధికారి వచ్చేడు. పించను పుచ్చుకొన్న అధికారిని మళ్లా వేశారు. చాలా సమర్థుడట. ఉద్యోగంలో మాటకేమిగాని, సనాతనాచార పరాయణ చిత్తవృత్తిలో అతి సమర్థుడని అందరూ ఏకగ్రీవంగా, ఏకోన్ముఖంగా, నిరభ్యంతరంగా అంగీకరించవలసిన విషయం. అందులో ఎవ్వరికీ భేదాభిప్రాయాలుండక్కర్లేదు. గోష్పాదమంత — అతి నాజూకైన — చిన్న పిలక, నుదుట సాక్షాత్ పరమేశ్వరుడే ప్రత్యక్షమైనాడా అన్నట్లు దివ్యంగా విభూతి, పింజెపోసి కట్టిన గ్లాస్కో మల్లు పంచె, 'టక్' చేసిన కంటెమెడ చొక్కా, లాంగ్ కోటూ, జరీతలపాగా ...మూడుముచ్చటగా వుండేది వారి అవతారం. అక్కడితో ఆగితే బాగుండేది. ఏవరి అభిరుచులు వారివి!


ఆయన సిద్ధాంతాలను మా మీద రుద్దడానికి ప్రయత్నించేవాడు. పంచలో వున్న సుగుణాలనూ, పాగాలోవున్న శోభనీ, విభూతి పెట్టుకోడంలోవున్న సైంటిఫిక్ థియరీ (విభూతి — క్రిమి కీటక సంహారి అట)నీ విశదీకరిస్తూ, మమ్మల్ని — గుమాస్తాల్ని — తన సిద్ధాంతాలకి సుముఖులుగా చేసుకోడం ఉత్తమ మార్గం. రాజమార్గం కూడా! ఆ రాజమార్గాన్ని ఒదిలి పందుల్లో పడ్డాడు. పంచ కట్టుకున్న వాళ్లను అతి ఆదరంగా, కడు మర్యాదగా చూస్తూ, ప్యాంటువాలాల మీద 'ఖార్' మంటుండేవాడు. అన్ని ప్రమోషన్లూ పంచవాలాలకే; అన్ని సిఫార్సులూ ధోతీదార్లకే! ప్యాంటువాలాలకి అక్షింతల గింజలూ, జీతం కోతలూ! అంతేల గుమాస్తా లందరం ఒకరోజు హైకోర్టు పక్కనున్న కజా మీద సమావేశమై, 'ఈ అత్యవసర పరిస్థితుల్లో పంచెను ధరించటమే పరమౌషధమ్!' అనే తీర్మానానికి వొచ్చి, పంచెలు కట్టు



మాంసకృత్తుల లోపం వలన జుట్టు ఊడుటకు దారి తీస్తుంది



ప్యూర్ సిల్వెక్రిన్ 17 అత్యవసరమైన మాంస కృత్తుల అనుబంధములు కలిగియున్నది...జుట్టు మొదళ్ళకు అత్యవసర పోషణ కలుగజేసి జుట్టు ఊడిపోకుండ సహాయపడునని నోబుల్ ప్రైజ్ టెక్నిక్‌చే నిరూపించబడినది





ప్యూర్ సిల్వెక్రిన్ ఊడిపోయేజుట్టును అరికట్టుటకు నిరూపణ


1. జుట్టు మొదళ్ళలో ప్రధానమైన ఎమినో-ఏసిడ్‌ల కొరత వలన జుట్టు పెరుగుదల బలువబడి, అనారోగ్య వంతముగా ఉండును. ఈ పరిస్థితి అరికట్టక పోతే, జుట్టు బలుపబడి, ఊడిపోవుటకు దారి తీయగలదు.

2. ప్యూర్ సిల్వెక్రిన్ (పేగ్నిపైడ్) ప్రతిబంధవు 17 ఎమినో-ఏసిడ్‌ల రూపంలో ప్రకృతి సిద్ధమైన మాంస కృత్తులు గలిగి అత్యవసర, ఆరోగ్య మైన జుట్టు పెరుగుదలకు ఉపకరిస్తుంది. ప్యూర్ సిల్వెక్రిన్ త్వరితంగా జుట్టు మొదళ్ళలోనికి చొచ్చుకొనిపోవును.

3 నోబుల్ బహుమతి విజయ పరిశోధన వలన ప్యూర్ సిల్వెక్రిన్ లోపించిన మాంస కృత్తులను భర్తీ చేసి మరల మీ జుట్టు దట్టంగా పెంచి, ఆరోగ్యకరంగా వుండునట్లు చేస్తుంది.

నేడే ప్యూర్ సిల్వెక్రిన్ వాడుటకు ఆరంభించండి;

మంచి ఫలితాన్ని పొందటానికి ప్యూర్ సిల్వెక్రిన్ క్రమంగా వాడండి. ప్యూర్ సిల్వెక్రిన్ ప్రతిరోజూ రోజుకు రెండుసార్లు తలకు మర్దించండి. మీ జుట్టు పెరుగుట ఆరోగ్యవంతముగా వుండుట కనుగొన గలరు. కొద్ది కాలంలోనే, విచిత్రమైన ప్యూర్ సిల్వెక్రిన్‌వాడకం మీ జుట్టు ఇదివరకటి ఆరోగ్యాన్ని చేకూర్చి దట్టంగా పెరుగుదల నిస్తుంది.



ప్యూర్ సిల్వెక్రిన్ వాడుట ఆరంభించండి

mcm/s/9 tl

అనామధేయుడు ...

దానికి ప్రారంభించేం.

మొదలు పెట్టిన వారానికే ఈ ఆఫీసర్ బదిలీ అయి పోయేడు.

మరొక ఆఫీసరు గారు వచ్చేరు. ఈ యన రోజుకో సూటు వేసేవాడు. అతనికి 365 (అక్షరాలా మూడువందల అరవై అయిదు) సూట్లు ఉన్నాయట. ఒకసారి వేసిన సూటు మళ్లీ సంవత్సరం ఈ తరీఖున తప్ప వేసుకోరట. 'లీపియర్లో' ఒకరోజు ఎక్కువ కదండీ! ఆ రోజుకోసం ప్రత్యేకంగా ఒక ఎక్స్‌ట్రా, స్పెషల్ సూటుకూడా వుందట! ఇదెంతవరకూ నిజమో కాని, ఒకరోజు వేసిన సూటు మళ్లీ కన్పించేది కాదు.

ఈయన పంచలు కట్టుకున్న గుమాస్తాలను పంచముల లాగే చూసేవాడు. పంచలు కట్టుకొన్నవాళ్ళు పాతరాతి యుగం లోని వారనిన్నీ, సీళ్లాంటివాళ్లు ఈ నవ నిర్మాణమైన అడుగడుక్కీ పురోగమిస్తున్న ప్రపంచంలో పనికేరారనిన్నీ, వసుధైక కుటుంబంలా ప్రపంచం రూపొందాలంటే సూటులు ధరించడమే విద్యుక్తధర్మమనీ, తద్వారా ప్రపంచ ప్రజానీకాన్ని అతిసన్నిహితంగా చేయవచ్చునని అతని నిశ్చితమైన, అతి ఖచ్చితమైన అమూల్యాభిప్రాయం! వినడానికి అభిప్రాయాలు బాగానే. కాని తంటా ఎక్కడ వస్తుందంటే—ఆ అభిప్రాయాల్ని బలవంతంగా ఇతరులమీద రుద్దటానికి ప్రయత్నించినప్పుడే! విశ్వమానవ సౌభ్రాత్రానికి మొదటిమెట్టుగా మమ్మల్ని, సూటులు వేసుకోమని నిరంతరం వేధించేవాడు. అక్కడికీ పంచల్ని కట్టుకోడం మానలేని గుమాస్తాల మీద కారాలు మిరియాలు నూరుతూ, కాన్ఫిడెన్షియల్ రిపోర్టుల్లో వాళ్ళ జాతకాల్ని తారుమారు చేసి, ఉద్యోగ జీవితాభివృద్ధి నిరోధకుడై, జీవితానందాన్ని ఖూనీచేసి మన్ను చేస్తుండే వాడు. దాంతో పంచల్ని పారేసి మళ్లీ పేంటుల్ని కుట్టించుకోవడం ప్రారంభించేను. అంతలో ఈ ఆఫీసర్ గారికి 'బదిలీ' అని కబురు తెలిపింది. అది విని కొంతసేపు సంతోషించేం; మరి కొంతసేపు ఏడ్చేం. సంతోష మెందుకయ్యా అంటే: పీడ పీడ ఇంతటితో విరగడ అయ్యింది కదా అని! ఏడుపెందుకయ్యా అంటే: ఈ సూట్లన్నీ ఏం చేసుకోవాలా అని! పర్యవసానం ఏమిటంటే: ఒక గాడిద మోయలేనన్ని పంచెలూ సూట్లూ— ఒక మనిషి భరించలేనంత అప్పూ!... ఇక—'అలో లక్షణా' అని ఒకటే ఏడుపూ.

ఇంతలో ఆ యన జాగాలో మరొక ఆఫీసర్ గారు వస్తున్నారని విశ్వసనీయ వర్గాలద్వారా ఒక ధ్రువపడని వార్త వచ్చింది!

ఊహాగానాలు ప్రారంభించేం. ఆ వార్త ధ్రువపడింది. మా ఊహాగానాలు ఉద్రిక్తంగా పరుగెత్తాయి. 'ఇతడు పంచధరుడా? సూటుధరుడా?' అని ఎడతెగకుండా వితర్కించేం. వాగ్వాదాలతో నోళ్ళు తాళాలు పడ్డాయి. ఏదీ తెగక గుద్దులాడుకున్నాం. పందేలుకూడా వేసుకున్నాం. దాంతో గుమాస్తా లందరమూ రెండు పార్టీలై విడిపోయేం. ఒకటి సూటు పార్టీ. రెండు పంచపార్టీ. నేను ఏ పార్టీలోనూ చేరలేకపోయేను. కారణం: బుష్‌కోటు ధరుణ్ణి కనక! నాకేపార్టీలోనూ ప్రవేశం కలగలేదు. నేనూ ప్రమేయం కల్పించుకో లేదు. ఇంక ఏ పార్టీవారు ఆ పార్టీకి ఒక నాయకుణ్ణి, ఒక జెండాని, ఒక నినాదాన్ని వెతుక్కోవడంలో గాఢంగా నిమగ్నులై పోయేరు. పరిస్థితులింకా విషమించి చెయ్యి జారకముందే అదృష్టవశాత్తూ ఈ కొత్త ఆఫీసరుగారు ఆఫీసు చార్జి పుచ్చుకున్నారు.

ఇతడు మితభాషి; బహునెమ్మదైన వాడు. మా పనిలో దేనిలోనూ పురస్కరించుకొనేవాడు కాదు. ఎవర్నీ ఒక్కపల్లెత్తు మాటు అనేవాడు కాదు. అంతా బాగానే వుంది. కాని, ముఖ్యంగా గుమాస్తాలు వేసుకున్న వేషం — ఏమిటా అని చూసేవాడే కాదు. పంచె కట్టుకున్నా ఒకేవిధమైన నిర్లక్ష్యం; సూటు వేసుకున్నా అంతే నిర్లక్ష్యం. 'ఇతనికి మనం ఏమి కట్టుకున్నా అవసరంలేనిదే!' అని స్పష్టంగా మాకు తెలిసివచ్చేటప్పటికి మేమంతా ఖిన్నులమై, హతశులమై, తేలుకుట్టిన దొంగల్లా వుండిపోయేము. ఇంతకీ 'క్షణ క్షణముల్ అధికార్ల చిత్తముల్' అని నున్నుల్ని మేమే ఓదార్చుకున్నాము. అంతకంటే మరేం చేస్తాం? ఇతని దగ్గర అతి ఆప్యాయతా లేదు. అంత అహంకారమూ లేదు, కేవలం నిర్లక్ష్యం నిర్లిప్తత. ఆప్యాయమూ లేదు—విసర్జన అంతకన్నాలేదు. పని బాగా చేసినవాడూ ఒకటే. చెయ్యని వాడూ ఒకటే. అందరిమీద ఒకటే సామ్య భావం. బంగారాన్ని మట్టిని సమదృష్టితో

మూడగల కర్మయోగి! మొత్తానికి మంచి వాడని చెప్పొచ్చు,

ఎవడు వెళ్ళి ఏం కష్టసుఖాలు చెప్పుకున్నా, ఓపిగ్గా విసుక్కోకుండా మధ్య మధ్య ప్రశ్నలూ అవీ వెయ్యకుండా సావకాశంగా సహృద్ధితో ఆమూలాగ్రంగా, అతిదీక్షతో ప్రశాంతంగా వినేవాడు. 'ఫలితం ఏమిటి?' అని మాత్రం నన్నడక్కండి. చెప్పుకోడం దారి చెప్పుకోడందే. ఎలా అవవలసిన కార్యం అలా జరగడమే. తీర్థం దారి తీర్థందే, ప్రసాదం దారి ప్రసాదందే. ఆఫీసరుగారితో ఖుద్దున చెప్పుకోవడం వల్ల కలిగే ఫలితం మాత్రం శూన్యం. కంఠశోష, వ్యథాప్రయాస, అనవసరాందోళన. సస్పెన్స్‌లో పడి చావడం. అంతే. ఇతడివల్ల జరిగే ఉపకారమూ లేదు; జరిగే అపకారమూ లేదు. 'నన్ను ముట్టుకోకు నామాలకాకి' పాలసీ!

ఇలా అనేక రకాలు. ఇంకొక ఆఫీసరు వచ్చేడు. ఇతను—పాత అధికారులని విమర్శిస్తూ, ఇతగాడిని తగుమోతాదులో ఆకాశానికెత్తే ఎంతెక్కువ ఉబ్బేస్తే— అమందానంద సంరంభ సంభరితాంతరంగ నవ్వుల పువ్వులరంగడు అవుతూ వుండేవాడు. ఇత్యర్థంగా ఎందరో మహానుభావులు. వారందరికీ ఇందుమూలంగానా శతసహస్ర ప్రణామ పరంపరలు.

ఆ తర్వాత ఇంకొక అధికారి దయ చేశాడు. ఇతడు అహంభావ సగర్వితుడూ, అహంకారభూషితుడూ, అధికారమత్తుడు. ఈ సుగుణాలన్నీ ఇతనిలో జీర్ణించి, జీర్ణం కాకుండా మిగిలినవి ఆవేశరూపంగానూ, క్రౌర్యరూపంగానూ బహిర్గతమై దుర్భాషలతో సమాప్తి అవుతూండేది. అవి వర్ణనాతీతాలు. వారి నోటంట వచ్చే భాషణాలకన్న, దూషణాలన్న అతిశయోక్తి లేదు. ఇతడు ముక్కోపిష్టి అని, ధాం ధూం లాడుతుంటాడని, తోక తొక్కిన తాచులాగ బుస్సుమంటూ వుంటాడని, శివమెత్తినవాడివలె ఆఫీసు ఆవరణలోనే రుద్రతాండవం చేస్తాడని, చీటికి మాటికి – కారణం వున్నా లేకపోయినా – తన్నిమిత్తంతో అసలు నిమిత్తం లేకుండా గర్జించడం, ఘీంకరించడంలాంటి మానవాతీత చర్యలు చేస్తూ వుంటాడని వర్ణిస్తూ కథాగమనానికి ఆటంకం కల్గించి పాఠకులని నిరుత్సాహపరిచే బదులుగా— దూర్వాసుడు. యమధర్మరాజు ఈరూపంలో మనుష్యుల్ని ఉద్ధరించడానికి మా పూర్వజన్మ

అనామధేయుడి ...

సంచిత ప్రారబ్ధకర్మ వల్ల దాపరించేరని చెప్తే చాలు.

మాటవరసకి ఇతన్ని దూర్వాసుడని పిలుద్దాం. ఇతనిచేత కాగితాలమీద సంతకాలు పెట్టించడమంటే గుమాస్తాలందరికీ ప్రాణగొడ్డం. సకాలాల్లో సంతకాలు పెట్టించకపోతే పీకలమీద కత్తి.

అల్లుల్లో మల్లు పెద్ద అన్నీ, చెట్లులేనిచోట ఆముదపు చెట్టే మహావృక్ష మన్నీ—నన్ను ముందుకి తోస్తుండేవారు మావాళ్లు! ఒకసారి ఏమైందీ అంటే...

నేను ఏదో కాగితాలు సంతకాల కోసం ఫైళ్లతోసహా వారి ప్రయివేట్ ఆఫీసు రూమ్‌లోకి ప్రవేశించేను. అప్పటికే ఆయన టేబిలునిండా ఫైళ్లూ, కాగితాలూ ఒక చిన్న గుట్టలాగ పడివున్నాయి, వారేదో కాగితం పట్టుకొని దీర్ఘాలోచనా సముద్రంలో వూపిరి ఆడక బహుశా కొట్టుకుంటున్నారు కాబోలు 'ఆఁ' 'వూఁ' అనలేదు. నేను వారిని ఆ యోగ సమాధి మంచి మేల్కొల్పడానికి యిష్టపడక, నేను తెచ్చిన ఫైళ్లూ, కాగితాలూ ఆ టేబిలు మీదే ఒకపక్క జాగా చేసి పెట్టబోతుండగా రెండో పక్కనుంచి ఒక పెద్ద ఫైలు ధఢేలున కిందపడింది. అది పెద్ద తప్పట!

'ఏం, ఫైళ్లు పట్టుకొని కాసేపు నిలబడకూడదా? ఆ ఫైళ్లన్నీ, అన్నెస సరీగా అటూ ఇటూ డిస్టర్బు చెయ్యకపోతే!' అంటూ కేకలేస్తూ నేను తెచ్చిన ఫైళ్లని, కాగితాలని ఈ దూర్వాసుడుగారు ఫర్‌మని నేలకి విసిరికొట్టేరు. నాకు మహాకోపం వచ్చిన మాట వాస్తవమే. కాని వారు అఫీసరుగారు. నేను తాబేదారుని అదీగాక, 'కోపమునను ఘనత కొంచెమై పోవును.' అంచేత కోపాన్ని బాగా చంపుకొని కిందపడిన ఫైళ్లన్నీ అతి జాగ్రత్తగా యేరి ఒక కట్టకట్టి గురిచూసి రోడ్డు మీదికి విసిరేను.

ఇంకా నేనేదో ఆ ఫైళ్లన్నీ యేరి జాగ్రత్తగా పట్టుకొని నిలబడతానని అనుకొన్న దూర్వాసులవారు ఈ హఠాత్సంఘటనతో నిశ్చేష్టుడై దిగ్భ్రమతో నోటమాట రాక 'ప్లాస్టర్ ఆఫ్ పేరిస్' విగ్రహంలాగ నిలబడిపోయేరు.

ఆ దెబ్బతో మళ్లీ మనజోలికి రాలేదు!!

ఏదో అలాగే ఉద్యోగజీవితం గడుస్తోంది...!

సంసార యాత్ర

'సంసారం సాగరం దు:ఖం'


'సంసారం సాగరం దుఃఖం' అని ఏ మహానుభావుడు ఎప్పుడు — ఎక్కడ—ఏ సందర్భంలో అన్నాడో కాని, అది పూర్తిగా నిజం కాదనిపిస్తుంది. నాకు తోచేదేమంటే: 'సంసారం సాగరం తథ్యం సుఖదుఃఖ సమ్మిశ్రితమ్.' వెలుగు నీడలూ, సుఖ దుఃఖాలూ, నీరూ పాలూ అవినాభావ సంబంధం కలవి. ఒకటి లేక ఇంకొకటి లేదు. సంసారంలో అడుగు పెట్టి 'దుఃఖం' అంటే ఏం ప్రయోజనం? సంసారమే దుఃఖసాగరం అయితే ఈ సంసార దుఃఖ సాగరంలో ఎందుకింతమంది పడి మునుగుతున్నారు? మరో గమ్మత్తు: సంసారం దుఃఖసాగరమని గోలపెట్టేవాళ్లే సంసారాన్ని జలగలాగ అంటిపెట్టుకొని వుంటున్నారు. పైగా దాన్ని నిందించడం మానరు. సంసారంలోకి దిగని శంకరాచార్యులవారూ, సంసారాన్ని అర్ధరాత్రప్పుడు విడిచిపెట్టిన తథాగతులవారూ అన్నా అర్థం వుంది కాని ప్రతి సంసారీ సంసారాన్ని సాగరం అనడం వారు చేస్తున్న సంసారానికే తీరని ద్రోహం!'

అలాగని సంసారం సుఖమయమా? కానే కాదు. కంటక శిలావృతం. నిరంతరం యమ యాతన. అప్పు చేయకపోతే దినం గడవదు. అప్పుచేస్తే అది తీర్చేవరకూ అప్పులవాడు గుండెల్లో కుంపటి. 'కౌపీన సంరక్షణార్థమియం పటాటోపః' అని జానెడు పొట్ట కోసం బారెడు అధికారం. మూరెడు అహం ...అన్నీ కావాలి. 'ఉదరనిమిత్తం బహుకృత వేషం' దానికోసం అనేక వేషాలు వేయాలి. ఎప్పుడూ ఎన్నో తీరని సమస్యలుద్భవిస్తూ మనస్సుని అశాంతిలో ముంచెత్తుతాయి.

'ఏమిటయ్యా గొడవ? ఇంతకీ సంసారం దుఃఖమయమా? సుఖమయమా? అది తేల్చక కోనేటిసాక్ష్యం చెబుతున్నావేమయ్యా?' అని అడగలరు. అది మొదటే మనవి చేసుకున్నాను. 'సంసారం సాగరం తథ్యం సుఖదుఃఖ సమ్మిశ్రితం' అని!

ఉద్యోగం లభించిన వెంటనే అట్టే సంసారయాత్ర సాగించడం ప్రారంభించేను. మా గృహస్థజీవితం ఆదర్శప్రాయమైనది. అంటే—మా ఆవిడ సీత, సావిత్రి, దమయంతి, చంద్రమతి లాంటి వాళ్లతో తులతూగుతుందని కాదు. నేను రాముడు, సత్యవంతుడు, నలుడు, హరిశ్చంద్రుడిలా భార్యని అగచాట్లు పెట్టేవాళ్లతో జమా కాదు. నేటి మామూలు సామాన్య సిరలయిన హైందవ కుటుంబాలలో ఒకటిగా వినవచ్చు. పట్నంలో కాపురం. పెత్తనం. కల్తీపాలు, కల్తీనూనె, కల్తీనెయ్యి, కల్తీపప్పు—ఈ కల్తీ సరుకలికి బాగా అల

హరిరామ్



నాటు పడిపోయేం. గోక్షీరం అంటే తెలియదు. ఘృతం అంటే తెలియదు. తైలం అంటే అంతకన్నా తెలీదు. పోనీ అవన్నీ సరే—గాలికి కూడా ఈ గాలి రావాలా ? ఫేక్టరీ పొగలు, రేడియో ధార్మికశక్తి రోడ్డుమీద రొచ్చూ అన్నీ కలిపితే ఆ గంధ విశేషం ద్విగుణీకృతం, త్రిగుణీకృతం, చతుర్గుణీకృతమేగాక పంచగుణీకృతం కూడా కావొచ్చుననడానికి సందేహం అణుమాత్రం ఉండనక్కర్లేదు.

సంసారయాత్ర యెలా అత్యవసరమైన అనర్థమో అలాగే ఉద్యోగం కావాలంటే పట్టణవాసం కూడా అత్యవసరమైన అనర్థమే ?

మా ఆవిడకు 'సంస్కృతి' చాలా వుంది. అంటే 'చదువు' వున్నా అన్నమాట! ఇక్కడ సంస్కృతి అంటే సంస్కృతం అని అర్థం చెప్పుకోవాలి. చదువు అంటే ఇంగ్లీషు చదువు అని అర్థం చేసుకోవాలి.. అని నేను వేరే చెప్పక్కర్లేదనుకుంటాను. ఎందుకంటే— 'చదువు' అంటే ఇంగ్లీషు చదువు తప్ప ఇంకోటి కాదని మనదేశంలో మెజారిటీ అభిప్రాయం. అది కాదనడానికి వీల్లేదు; మా ఆవిడ సంస్కృతజ్ఞానం శతశ్లోక పరిమితం. పంచకావ్యాలూ చదువుకోడానికి ఓపిక లేక నూరుశ్లోకాల్తో పండితురాలయింది. 'నూరు శ్లోకాలు నేర్చుకున్నంత మాత్రాన పండితులవుతారా ?' అన్న కుశంక ఎవరికైనా కలుగుతుందేమో ! 'శత శ్లోకేన పండితః' —అన్న వేదవాక్యం వుండనే వుంది. అంచేత అందులో సందేహం అనవసరం ? ఆవిడకి గీర్వాణభాష వచ్చునని మహాగీర్వాణం...!

నాకు రాదు. నా కింగ్లీషులో పాండిత్యముంది. ఎంతవరకు అని అడగొద్దు. పాండిత్యానికి అవధి యేమిటి ? ఎస్...నో...ఆల్ రైట్...వస్తే చాలదా? అంచేత ఇంగ్లీషు వచ్చునని నాకు గర్వమూ, గోరోజనమూ...!!

ఇక, తెగులు—సారీ, పొరబాటు — తెలుగు ఇద్దరికీ సరిసమానంగా వచ్చు. అందుచేత తెలుగులో ఆమె పండితప్రబుద్ధురాలు; నేను పండితమ్మన్యుడను. కనుక— 'గంతకు తగ్గ బొంత' అని అందరిచేతా పొగడ్త గాంచే ఆదర్శ దాంపత్యం మాది !

ఎన్ని విషయాల్లో ప్రసిద్ధి గాంచినప్పటికీ ఇల్లాలి తెలివితేటలు ఇల్లు దిద్దుకోవడంలోనే కనబడతాయి — అంటారు పెద్దలు. అలాంటి గృహిణిని ఏకంగా గృహలక్ష్మిని చేసేశారు. ఇల్లు దిద్దడం వాడిని. కాని అప్పుడప్పుడు వన్నెకాడా అంటే మాటలుకాదు. మాటలు కోటలు దాటవచ్చు...మా ఆవిడ ఇల్లు దిద్దడంతో సరిపెట్టుకుంటే చాలు...చాలా సంతోషించే దిద్దబోయేది, అప్పుడే పేచీలు వచ్చేవి.

(ఇంకా వుంది)

ప్రశ్నావళి

...కె. రామలక్ష్మి...

ఈ. ఎస్. వి. ఆర్, ఆముదాలవలస

కృషితో నాస్తి దుర్భిక్షం అంటారు. అర్థమేమిటి ?

శ్రమ కరువును పోగొడుతుందని. నిజమే కదా?

పి. జి. ఆర్, కాకినాడ

తనంతట తాను కష్టపడి పైకొచ్చిన వాడు ఎవరిమీదా ఆధారపడడు.

అలాగా? తనంతట తాను పైకొచ్చాడు కనుక తనని తానే ఆరాధించుకుంటాడా?!

డి. ఆర్. ఆర్, విశాఖపట్నం

మీకు భారత రాజ్యం అంటగడితే ?

వద్దు స్వామీ. ఓ రాజ్యం ఏలడం కన్నా—ఓ సంసారం నడపడంలోనే—గొప్ప ఛాలెంజి వుందని—నా నమ్మకం.

ఆర్. పి. యి. డి, అంపలాం

స్త్రీ ధర్మం ఏంతవరకు ? పురుషుడు ఏంతవరకు ధర్మం పాటించాలి ? వీటికి హద్దులు ఏంతవరకు ?

మీరు మూడు ముక్కల్లో అడిగిన ఈ ప్రశ్నే తర తరాల మన ధర్మ సూత్రాల సారం. మగవాడికో ధర్మం ఆడదానికో ధర్మం నిర్దేశించలేదు. కాని కాలక్రమాన తమకనువుగా ఈ భేదాలు సృష్టించుకున్నారు— 'సతియు కల్గిన కల్గు సకల సంపదలు

సతియు కల్గిన కల్గు సకల పుణ్యములు

సతియు కల్గిన కల్గు సత్పుత్రచయము

సతియు కల్గిన కల్గు సద్గతి త్రోవ'

అని. అలాంటప్పుడు నీతి తప్పిన మగవాడూ నీతి తప్పిన ఆడదీ—ఒకటే. ఆ నీతి అన్న పదానికి మీరు ఏ అర్థం యిచ్చుకున్నా సరే.

డా. వి. ఆర్. ఆర్; కె. ఎల్. ఎన్,

ముత్తిరెడ్డిపల్లి

మనిషి ఏ మాత్రం కష్టపడక్కర లేకుండా, హాయిగా, సుఖంగా బ్రతకాలంటే —ఏవైనా మార్గాలున్నాయా ? ఉంటే తెలుపకలరు.

ఒకటే మార్గం— చావడం.

వి. ఆర్. ఎస్, చేబ్రోలు

ఇదివరకు మగవాళ్ళను చూస్తే ఆడవారు సిగ్గుపడడం, తలలు వంచడం, పక్కకు పోవడం అంటూ వుండేది. కాని యిప్పుడు ఆడువారిని చూసి మగవారు సిగ్గుపడిపోతూ బెదిరిపోతున్నారు - కారణం?

చేసిన తప్పులు తెలుసుకున్నారేమో! పూర్వంలో ఆడది మీ కోపానికి ఆహుతి అవుతానని భయపడి చచ్చేది. యిప్పటి ఆడది—తన్ను తాను తెలుసుకున్నది—మీ నీడ చూసి భయపడదు. అలా అని మిమ్మల్ని చిన్న చూపూ చూడదు!!

పి. పి. డి, తిరుపతి

వంటల్లో ఓ కప్పు అంటారు. ఓ చెంచాడు అంటారు, మళ్ళీ పాతిక గ్రాములంటారు. వీటిని సులువుగా గుర్తించే పద్ధతి లేదా ?

లేకేం—పిండి—ఒక చెంచా అంటే దరిదాపు 7 గ్రాములుంటుంది. ఒక కప్పు అంటే 16 చెంచాలుంటుంది. అంచేత ఉజ్జాయింపుగా చేస్తే ఒకప్పు పిండి ఎనిమిది అవున్సులనో 16 చెంచాలనో చెప్పుకోవచ్చు.

కె. ఎమ్. డి, కాకినాడ

బంగాళాదుంపలతో చపాతీలు చేస్తారట. ఎలాగో చెప్పకలరా ? ప్రశ్నావళిలో వంట అడిగానని కోప్పడకండి కె.రా. గారూ.

నేను కోప్పడను. కాని ఉడుక్కునేవాళ్ళు కొందరుంటారు! అయినా—వినండి.

గోధుమపిండి—— 100 గ్రా.

బంగాళా దుంపలు—— 150 గ్రా.

నూనె. —— 1 చెంచా

ఉప్పు—— 1 చెంచా.

పచ్చిమిరప ముక్కలు

ఎండు మిరప ముక్కలు

అల్లం ముక్కలు.

కొంచెం—నెయ్యి గాని డాల్డా గాని.

1. బంగాళదుంప తొక్కలతో ఉడికించాలి.
2. తొక్కలు తీసి మిగిలిన వన్నీ అందులో కలపాలి
3. మొత్తం ముద్ద ఆరుభాగాలుచేసి బాగా మడాయించి రొట్టెలు ఒత్తాలి. చపాతీల్లాగా మడతలు వేసి వత్తాలి
4. బాగా వేడిగా ఉన్న పెనంమీద రెండువైపులా కాల్చాలి. వేడిగానే —రుచి గా వుంటాయి.
5. పిండికలిపేటప్పుడు నీళ్ళు పోయకూడదు.

అన్నంకంటే — బలం కాలరీలు తక్కువ. అంచేత అన్నానికి బదులు తినవచ్చు.

ఎమ్. హెచ్. ఎల్. ఆర్, హోసూరు

ఒకరేమో మనిషికి మనసే తీరని శిక్ష అంటే మరొకరు మనిషికి మనసే ఒక వరము అన్నారు. ఇంతకీ ఏది నిజం ?

రెండూ నిజమే. ఎందుకంటారా? ఇల్లు గడప దాటలేనప్పుడు మనస్సు మహా మేరువును దాటుతోంది. అదొక వరం. మనసులో ఎంత వుంటే పెదిలోకి అంత వస్తుందన్నట్టు మనస్సెరుగని అబద్ధం ఉండదు. అదొక శిక్ష.

జి. ఎస్. కె, కర్నూలు

బాణోచ్ఛిష్టం జగత్త్రయం అంటే ఏమిటండీ ?

బాణోచ్ఛిష్టం జగత్సర్వం అని—బాణుని ఎంగిలే లోకంలోని సాహితీరంగం అంతా అని—అంటే బాణుడంతటి సాహితీపరుడు అని.

కె. పి. ఆర్, ఎర్రగుంట్ల

శ్రద్ధ భక్తి కుదరాలంటే ఏమి చేయాలి?

ఏకాగ్రత అలవాటు చేసుకోవాలి.

సి. హెచ్. బి. కె, ముప్పవరం

ప్రాణాలు పోయినవాడు చితిలో దహనం అవుతాడు. మరి ప్రేమాను రాగాలు పోయినవాడు ?

మనస్సులో.

నేరస్థుని శిక్షించడమా? లేక అతనిని మనిషిగా మార్చి మంచి మార్గములోనికి తీసుకు రావడమా? ఏది ఉత్తమం?

శిక్ష అనుభవించని నేరానికి పశ్చాత్తాపానికి అవకాశం ఎక్కడిది? పశ్చాత్తాప పడ్డాడంటే—చేయూతనిచ్చి మంచి మార్గాన పెట్టే అవకాశాలుంటాయి.

వెంకట్, ఉరవకొండ

మన భావిజీవితపు చిత్రరు మన ఆదర్శాలకు అనుకూలంగా ఉండేటట్టు సాకారంగా చిత్రించుకోగలిగితే ఈ ప్రశ్నలు మూడ్డం దేనికి రామలక్ష్మిగారూ ?

మన ఆదర్శాలేమిటో తెలుసుకొందుకేమోనని అనుమానంగా వుంది వెంకట్‌గారూ!

వి. డి. జి. ఆర్, అనకాపల్లి

మీ నెత్తబుట్టగాడు ఎన్ని కార్డులు మింగాడో చెప్పకలరా?

లెక్కలు పెట్టడంలేదు!

ఎ. వి. ఎస్, నార్సిపట

ధర్మదేవత జంతురూపమా? లేకపోతే చతుష్పాది ఎలా అయింది?

అవును. ధర్మదేవత గోరూపు కదా.

వి. ఎస్. ఎన్, మహబూబ్‌నగరు

నేటి యువతరం సినిమాలు చూసి చెడిపోతున్నారంటారు అదెంతవరకు నిజం?

బాగుపడ్డం ఎంత అసంభవమో—చెడిపోవడమూ అంత అసంభవం, యీ సినిమాలు చూసి!

అన్నీ అయిపోయ్యాయి. ఒక్క భార్య మెడలోని మంగళసూత్రం తప్ప. అదే పట్టుకుని ఆరుగంటలపుడు సేట్ తుకారాం నన్నూమల్, వడ్డీవ్యాపారి దుకాణం వద్దకు వచ్చాడు భావనాఋషి. అటూ ఇటూ చూపి బిడియన్ననిలా లోనికి ప్రవేశించాడు.

'ఆవో భాయ్! ఆవో!' బైటో!' అంటున్నాడు వృద్ధ తుకారాం ఆప్యాయంగా.

ఏందుకనంటే వాళ్ళిద్దరికీ గతంలో అవినాభావ సంబంధం వుంది. భావనా ఋషి అమ్మిన ప్రతి వస్తువూ తుకారాం కొన్నాడు. ధరదేముంది? ఓ పది రూపాయలు సేట్ వైపుకే మొగ్గినా అంత ధర అతను కాబట్టి గుట్టుగా ఇస్తున్నాడు. భావనాఋషి తీసుకుంటున్నాడు. ఇది రెండవ కంటి వాడికి తెలియదు. వాళ్ళిద్దరికే తప్ప.

నన్నూమల్ నవ్వుకుంటూ డేమోనని కందేహిస్తూ 'ఇది...తెచ్చాను.' అన్నాడు భావనాఋషి వినిపించీ వినిపించకుండా భార్యపుస్తె బయటకు తీసి.

సేట్ తుకారాం నవ్వుకోలేదు. అతగాని భావాలు 'ఆ! ఇవి మాకు మామూలే! అయితే నీకు క్రొత్త కావచ్చు!' అన్నట్టున్నాయి. పుస్తె అందుకున్నాడు. ఏదో నల్లరాతిమీద దాన్ని పెట్టి గీశాడు, గీతలు పడ్డాయి. ఆపైన ఓ సీసాలోనుండి ఏదో ద్రావకంతీసి గీతలమీద ఓచుక్క వేశాడు. కొంచెం పొగవచ్చింది. దానికేసి చూస్తున్నాడు పరీక్షగా.

భావన ఋషి అతని ముఖంకేసి చూస్తున్నాడు ఊపిరి బిగపట్టి. ఆతనిచూపు న్యాయాధికారి నిర్ణయంకోసం వేచియున్న అపరాధిని పోలి వుంది. చెవులు వినడంకోసం వేచి వున్నాయి.

ముసలి తుకారాం ముఖంలో రంగులు మారుతూన్నై. పెదవి విరుచుకుంటున్నాడు. రాతిపరీక్ష తరువాత ఆ మంగళసూత్రం అటూ ఇటూ త్రిప్పి చూస్తూ తూకపరీక్షకు దిగాడు.

భావనాఋషికి ఒళ్ళు నన్నగిల్లుతుంది. మనిషి నీరసపడి పోతూన్నాడు. ముందుగా వచ్చినప్పటి తేజం విస్తృజ మైపోయింది.

'దస్ రూపియా. మాల్ అచ్ఛినై!' అంటున్నాడు తుకారాం



'ఇంతే !' ఆశ్చర్యపడి పోతున్నాడు భావనాఋషి.

'దేఖో ! క్యా హై !' నల్ల రాయి చూపిస్తున్నాడు సేట్.

భావనా ఋషికి ఆ రాతిలో ఏముందో ఏం తెలుసు ? చూస్తున్నాడు కాబట్టి ఆ గీతలు తప్ప. నొసటి గీతనే గుర్తించలేని తను ఆ రాతిగీతనేం గుర్తించగలడు ?

ఇద్దరూ గిజిగిజిగా బేరమాడుకున్నారు. తుకారాంనే నమ్ముకున్నట్లు సాష్టాంగాలతో చెప్పుకున్నాడు భావనాఋషి. ఒక్క భావనా ఋషితోనే చాలా లిబరల్‌గా తను వ్యాపారం చేసుకుంటున్నట్లు చెప్పుకున్నాడు తుకారాం. చివరకు బేరం పన్నెండు రూపాయలకు కుదిరిపోయింది. గల్లా తెరచి ఘల్లుమని పించాడు తుకారం.

ఇది జరిగి పది నిముషాలు కాలేదు. భావనాఋషి సారాడిపోలో సాక్షాత్కరించాడు. గ్లాసుమీద గ్లాసు కుత్తుకలవరకూ నింపుకున్నాడు. జేబులో డబ్బు నెమ్మదిగా మాయమవుతూ వుంది. కళ్లు తిరుగుతున్నై. ఏదో రాక్షసి వచ్చి మనిషిమీద కూర్చున్నట్లుంది. మత్తు ఎక్కువయింది. తను గొణుక్కుంటున్నాడు. వళ్లు తెలియడంలేదు. వూడిపోతున్న పంచె సర్దుకోవటంకు యాతనపడిపోతున్నాడు. దారిన పొయ్యే దానయ్య ప్రతివాడు ఓపురుగులా కన్పిస్తున్నాడు. వాళ్లు తప్పుకుంటున్నారే గాని తనకు తప్పుకోవాలన్న భావనే లేదు. పెళ్లాం గుర్తుకొస్తుంది. పిల్లలు గుర్తుకొస్తున్నారు. క్షణంకాలం వాళ్ళకోసం చేతులెత్తి పైకిచూశాడు. అంతే! తరువాత అతనికేం గుర్తులేదు. చుక్క ఎక్కువైనట్లుంది. నడిరోడ్డుమీద పడిపోయ్యాడు.

ఇంటిదగ్గర భారతమ్మ భర్తకోసం ఎదురు చూస్తోంది. చంటిదానికి ఆట అమ్మ. జ్వరం కాలుతూంది. శతగోపాలాచారి వెయ్యిచూసి వెళ్ళాడు. భర్త మందుకోసం పుస్తె తీసుకెళ్ళాడు. కాలం జాలమయింది. నిరీక్షణ నిజాన్ని తెలియజేస్తోంది. అతగాడు తప్పతాగే వుండాలి ఇల్లూ — ఇల్లాలు గుర్తుంటే అనుకోవలసినదేమిటి? పిల్లా — పాపలు జ్ఞప్తికొస్తే కావలసినదేమిటి ? సంసారంలో సామరస్యం లేకుండా ఎలా వుంటుంది ?

చచ్చేందుకు రైల్లేదు

ఆమెకు కాళ్ళాడ్డంలేదు కన్నీరు పారాడ్డం లేదు. పవిటచెంగు తడిసి పోతూంది. ఆర్ద్రమైన కంఠం విషాదాన్ని నింపుకుంటుంది.

ఇప్పటికోగాని తెప్పరిల్లిందికాదు. పిల్లి వాళ్లు నేలమీదనే నిద్రపొయ్యారు. పాపం పిడికెడు తిన్నారు కారు. పెద్దవాడి ముఖం చూస్తే పెల్లున పొంగుతుంది దుఃఖం. దుఃఖం కాదది. దవానలం.

దూరంగా కుక్కలు మొరుగుతూన్నై, గాలివాటుకు ఎవరో పాడుతూన్నపాట జీరగా విన్పిస్తుంది. మధ్యలో ఆగిపోయింది. మళ్ళీ ప్రారంభమయింది.

ఆ గొంతు ఆమెకు తెలుసు. ఆమెకు తెలుసని ఆ గొంతుకు కూడా తెలుసు. అందుకే ఇల్లు దగ్గరవడేకొద్దీ శ్రుతి ఆరునొక్క రాగాని కెడుతూంది. ముఖ్యంగా ఆమె విని ఆనందించాలని, ఆనందించిన తరువాత అభినందించాలని.

'తాగితే తప్పేముంది?' ప్రశ్న పడుతూంది. ఆ తరువాత 'అఫ్‌కోర్సు' పత్తి అనబడుతూంది కూడా. వెంటనే ఇంటి తలుపు ఫుట్‌బాలులా విగిరినంత పని చేస్తోంది. ఒకవేళ ఆమె నిద్రలోవుంటే ఆధ్వని చక్కని సంగీత స్వరానికి హార్మోనియం. కాకపోతే ఫిడేలు. లేదా తబలా. ఏదో ఒకటి !

ఇంట్లోకొచ్చిన భావనాఋషికి ఇల్లాలు కన్పించదు. పిల్లలు కన్పిస్తారు. తృప్తిగా వాళ్ళు నిద్రపోతున్నారుకదాని సంతృప్తి పడిపోతాడు. వండితే తింటాడు. వండకపోతే ఆవేళ రాద్ధాంతం. ఆమె కొప్పుబట్టి బయటికి లాగుతాడు. లేకపోతే తన పిల్లలకు నిద్రాభంగమౌతూంది. తను చేస్తున్న సత్కార్యం ప్రతిదీ వాళ్ళకోసమేగా మరి! ఆమె వళ్ళు హూనమౌతుంది, వళ్ళు రాలిపోతై. కళ్ళు కారిపోతై. ఇది ఆమె పూర్వజన్మలో చేసుకున్న పూజకు దక్కిన పురుష పుంగవుని ప్రతాపం. ఆనాడే కాదు. ప్రతిరోజూ, ఈనాడు కూడా ఇంతే.

ఇంతా అయిన తరవాత భావనా ఋషికి పశ్చాత్తాపం కలుగుతుంది కొట్టినందుకు కుమిలిపోతాడు. తిట్టినందుకు తెమిలి పోతాడు. బయట మూలుగుతూన్న ముత్తైదువుమీద ప్రేమ కట్టలు త్రెంచుకుంటుంది. బత్తెనికి తాను కానీ ఇవ్వలేదని అపుడు గుర్తుకొస్తుంది. మరి వుంటేగా ఇవ్వడానికి. వున్న నాలుగు డబ్బులూ వీళ్ళకే సరిపొయ్యే. మరి చోళ్ళమాటేమిటి ? అందుకే తను బలవంతంగా ఆమె వద్దంటున్నప్పటికీ తీసుకొచ్చి ఆమెతో పాటే పండుకుంటున్నాడు! పస్తు! ఆమె మాత్రం ఊరుకుంటుందా. సంవత్సరం తిరక్కముందే అంతబాధలోనూ తీసుకొస్తుంది సంతతి! మస్తు! ఆరోగ్యం క్షీణించినా ఆమెకుండదు చింత. ఎందుకని? పురుషునివద్ద స్త్రీ బానిస కాబట్టి; కాళ్ళూ చేతులుకట్టి; వినసందుకు కొట్టి; తృప్తితీరకతిట్టి అనుభవిస్తున్నాడు కాబట్టి!

సూర్యుడు తూర్పున పొడుస్తాడు. తూర్పున పొడిస్తేనే సూర్యుడౌతాడు. పడమర అస్తమిస్తాడు. వారానికి ఏడు రోజులు కోడికూస్తేనే తెల్లవార వచ్చేది. తెల్లవారితేనే అతుకుల బతుకులు. బతికితేనే బాకా ఊదగలిగేది. అందుకే ఆశ మానవుని లొంగదీస్తుంది. ఏ ఆశా లేని వారికి క్షణకాలం జీవితం ఘోరవిపత్తు.

భారతమ్మకు రైలు క్రిందకు వెళ్ళడం చాలా ఇష్టం. అయితే ఆమె ఎన్నెన్ని పిల్లలనబడే ప్రతిబంధకాలు ప్రతిసారీ పట్టుకుంటున్నై. వెళ్లకుండా ఆమెను నెట్టుకుంటూన్నై. ప్రతిసారీ ఒకసారి! ఒకసారి మరోసారి! ఇలానే కాలాన్ని గెంటివేయడం. కానీ ఒకసారి ఆమెకు వాయిదా అవకాశం కల్పించడం లేదు. సర్వం నాస్తిగా స్వీకరించుకుంది.

నిద్రలో పిల్లది గొణుక్కుంటుంది. ఆరుబయట వెన్నెల విషాదాన్ని క్రక్కుతూంది. భావనా ఋషి! ఉదహారించాడు. మాయామర్మం తెలియని పిల్లల శ్వాస నిశ్వాసలు అతనిగురకతో మిళితమైనై.

కూడగట్టుకున్న ధైర్యంతో ఆమె లేచింది, పిల్లల తలలు నిమిరింది. మాతృహృదయం కాబట్టి నొసలు ముద్దిడింది, కనిపెంచిన కన్నతల్లి కాబట్టి. మరో జన్మలో నాకదుప్పు పండవద్దని వేడుకుంది. వాళ్ళనుమ్మ తన కడుపున పుట్టవద్దని వేడ్కోంది. పతియే ప్రత్యక్ష దైవంకాబట్టి భర్తపాదాలకు మ్రొక్కకుండా వుండలేకపోయింది. కన్నీళ్లలో కాళ్లు కడిగింది.




బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు
ఎంతో మంచివి పుష్టిగా పెరగడానికి

అమూల్యమైన గోధుమ, పంచదార, వెన్న, పాలు గ్లాక్సోనుండి ఆరోగ్యదాయకమైన పౌష్టిక పదార్థాలతో ఈబి- బిస్కట్లు తయారుచేసాము

తరువాత వీటిసంగతేమిటని ఎంతమందినో పాపలను అడిగాము. చిన్నపాపలు, పెద్దపాపలు అంతకంటె పెద్దవాళ్లు ప్రేమిస్తారు.

వాస్తవానికి అన్ని వయస్సుల పాపలు వీటిని ప్రేమిస్తారు కాబట్టే ఇప్పుడు బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు కుటుంబానికి ఆవశ్యకమైనవి. పుష్టిగా పెరగడానికి ఎంతో మంచివి.



భారతదేశంలో అతి శ్రేష్ఠమైన బిస్కట్లు

* బ్రిటానియా బిస్కట్ కో లిమిటెడ్ వ్యాపారపు గుర్తును ఉపయోగించుకొనటానికి రిజిష్టరు కావింపబడ్డారు.

చేయిజార్నిఅక్కైనా విడనాడకుండా మాత్రే నా భర్త కావాలని. వళ్ళు జలదరించేలా 'శుభం' అని ఓదయ్యాపు పిట్ట క్యారుమని ఇంటిమీదిమండి వెళ్లిపోయింది.

చప్పుడుకాని నిశబ్దంలో ఆమె బయటి కొచ్చింది. ఇంటిమీద ప్రేమ. ఇంట్లో పిల్లలమీద ప్రేమ. పిల్లల్ని కని పెంచిన భర్తమీద ప్రేమ. ఒకటేమిటి ? లక్ష ప్రేమలు. అన్నీ ఒక్కసారే పొంగినై. వరదలై పారినై. ఆమె ఆపురుమంది. ఆమె హృదయం ఆపురుమంది. ముందుకు మూడడుగులే వేసింది, నీకోసమే నే వచ్చానని మార్జాలం 'మ్యావ్' మంది. ఈ శుభ సమయంలోనే అశుభం. అపశకునం. అందు కని ఆమె కాస్త వెనుకాడింది, తరువాత ఇక లక్ష్యపెట్టలేదు.

ఇరుకువీధి చివరికొచ్చింది. మలుపు

చచ్చేందుకు రైలేదు

తిరిగితే మరుగవడి పోతూంది. తాత్కాలి కంగా కాదు. శాశ్వతంగా. కానీ ఎదురుగుండా ఎవరో వస్తున్నారు. ఎవరు చెప్మా ? కావమ్మత్త! తనవైపుకే వస్తుంది. ముత్తైదుకాదు ముండమోపి. అపశకునానికి మరో అపశకునం తోడయింది. దయ్యంలా వంటికి తెల్లగా కప్పుకున్న దుప్పటి కాస్త తొలగించి చూస్తుంది తన్నే.

'ఏందే పిల్లా ? యీవేళప్పు డెక్కడికే?' వస్తూనే విస్తుపోతూ ప్రశ్న వేస్తూంది కావమ్మత్త.

మోముకొస్తున్న దుఃఖాన్ని దుర దృష్టాన్నీ రెంటినీ ఒకేసారి ఆలకబోస్తూ వెక్కివెక్కి ఏడుస్తున్న భారతమ్మ.

'చావుకోసం' అని ముక్తసరిగా జవాబు చెప్పింది.

ఆమె వాక్యంలో చావు విశ్చయం స్పష్టంగా వ్యక్తీకరింప బడింది.

'చచ్చి సాధించేదేమిటే పిచ్చిదానా ?' అందుకుంది కావమ్మత్త.

'నాచావు. కాదు నా మరణం'

'బ్రతికున్నప్పటికీ నువ్వు చావలేదా ఏమిటే ? చచ్చేవున్నావ్.'

'ఆ చావు వేరు. ఇప్పుడు నిజంగా చావ బోతూన్నాను.'

'జనం అబద్ధంగా చస్తారా ఏమిటే?'

'ఏమో ! నాకు తెలియదు.'

'మరెవరికీ తెలుసు ?'

'దేవుడికి.'

'కాదు. నన్ను చెప్పమంటావా ?'

'చెప్పు.'

'కళ్లున్నప్పటికీ గ్రుడ్డివాడై పోయిన పితండ్రికి. నీతండ్రిని ప్రోత్సహించిన నీ తల్లికి'

'పొరపాటు పడుతూన్నావత్తా ! మేక వన్నె పులులుంటాయని ఎవరేం కలలు కవరు.'

'పోన్లేవే ! ఆ వాదన వదిలేద్దాం. మరి ఎలా చావాలనుకుంటున్నావ్ ?'

'రైలు క్రింద.'

'అయ్యో! నా ఖర్మ! కాదు నీఖర్మ !' నొసలు కొట్టుకుంది కావమ్మ.

'ఏమిటాఖర్మ !' విస్తుపోతూ అడి గింది భారతమ్మ.

'దరిద్రుడు తల కడగబోతే...' ఆమె మధ్యలో ఆగిపోయింది.

'ఆ !'

'మల్లెపూల వాన కురిసింది.

'నా కర్థం కావడంలా ?'

'అర్థం కావడానికేముంది. ఎవరో దుండగులు పట్టాలకున్న ఫిష్ప్లేట్లు తొల గించార్ట.'

'అయితే!' ఆమె ఆతృతగా అడిగింది.

'అయితే కాయా గియితేలేదు. వస్తూన్న రైలు కాస్తా పడిపోయిందట. పట్టాలు బాగు చేసేంతవరకూ మరో రైలు రాదు. అందుకే నే తిరిగొస్తున్నా నాగరా !'

భారతమ్మను అడ్డుకుంటూ వెనక్కు తిప్పింది కావమ్మత్త !

మరి చచ్చేందుకు రైల్లేదు !



ఆంధ్రసచిత్రవారపత్రిక

1972 దీపావళి కథల పోటీ!

రు. 3,000 బహుమతులు

ఇంకా రు. 2,250 ప్రత్యేక బహుమతులు

గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథలపోటీని నిర్వహిస్తున్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. పోటీకి వచ్చిన కథలలో ఆరింటిని ఉత్తమ కథలుగా ఎన్నుకుంటాము. ఈ కథలలో ఒక్కొక్కదానికి రు. 500 ల చొప్పున బహుమతి యిస్తాము. ఈ బహుమతుల పంపిణీ బాలట్ నిర్వహణకి ముందే జరుగుతుంది. ఉత్తమంగా ఎన్నికైన ఆరు కథలని దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించడానికి ప్రయత్నిస్తాము.

పాఠకుల నిర్ణయం: బాలట్ పోటీ

దీపావళి ప్రత్యేక సంచికలో అచ్చు అయిన 6 కథలలో ఏవి ఉత్తమమైనవో పాఠకులు నిర్ణయించడానికి ఒక బాలట్‌ని ఏర్పాటు చేస్తాము. పాఠకులకి ఈ బాలట్ ఆసక్తికరంగా ఉండటానికి బాలట్— పోటీని కూడా ఒకదానిని నెలకొల్పుతాము. ఈ పోటీ వివరాలు బాలట్ ప్రకటనతోపాటు దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురిస్తాము. పాఠకులచే నిర్ణయింపబడిన వరుసలో మొదటిదిగా ఎన్నికైన కథకి రు. 500, రెండవదిగా ఎన్నికైన కథకి రు. 450, మూడవదిగా ఎన్నికైన కథకి రు. 400, నాలుగవదిగా ఎన్నికైన కథకి రు. 350, అయిదవదిగా ఎన్నికైన కథకి రు. 300 చివరి కథకి రు. 250 ప్రత్యేక బహుమతులుగా యిస్తాము. రచయితలందరూ సహకరించి ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా దీపావళి కథలపోటీని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

నిబంధనలు

1. కథలు ఇంతకుముందు ప్రచురణ కాని స్వంత రచనలై ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనేనని, దేనికీ అనువాదం కానీ, అనుకరణ కానీ కాదని హామీ రాసి పంపాలి. ఈ హామీలు వేరే కాగితంపై కాకుండా కథ వ్రాత ప్రతి మీదనే రాసి ఉండాలి.

2. కథలు తెలుగు వారి జీవితానికి సంబంధించి ఉండాలి.

3. వ్రాత ప్రతిమీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒక వైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయిత పేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతిమీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్‌సైజ్ నోట్‌బుక్‌కి రెండు రెట్లు) పేజీలకి మించరాదు

4. కవరుమీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, 7, తంబుచెట్టి స్ట్రీట్ మదరాసు — 1'కి పంపాలి.

5. పోటీ గడువు తేది 16—9—1972. ఆ తర్వాత మా కార్యాలయం చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.

6. పోటీలో బహుమతి పొందిన 6 కథలని ఆంధ్రసచిత్రవారపత్రిక 'దీపావళి ప్రత్యేక సంచిక'లోనే ప్రచురించడానికి ప్రయత్నిస్తాము.


7. 6 ఉత్తమ కథల ఎన్నికకి సంబంధించిన తుది నిర్ణయం ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకునిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపటానికి వీలు ఉండదు

8. బాలట్‌తోపాటు ఎటువంటి పోటీ నెలకొల్పబడినా ఆ పోటీకి సంబంధించిన తుది నిర్ణయాలన్నీ ఆంధ్రసచిత్రవారపత్రిక సంపాదకుడివే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపటానికి వీలు ఉండదు.

9. కథల వ్రాత ప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపటానికి సాధ్యం కాదు. (అందుచేత కథల పోటీలో పాల్గొనేవారు తిరుగు స్టాంపులు అతికించిన స్వంత చిరునామా కల కవరు పంపవలసిన అవసరం లేదు)

10. పోటీకి సంబంధించిన ఏ విషయం గురించీ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు. పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణ స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించే ముందు తెలుపుతాము.

విద్యార్థి



జరిగిన కథ

తల్లికి ఇష్టంలేకపోయినా ఎం. ఎ. లో చేరాడు విద్యార్థి. తన అన్నకూతురు లక్ష్మిని విద్యార్థి వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడాలని ఆమె సంకల్పం. కాని, లక్ష్మి ఎవరినో ప్రేమిస్తున్నట్లు తెలుసుకున్న విద్యార్థి, మేనమామతో వాదంపెంచుకుని తిరిగి వచ్చేస్తాడు. మెడిసిన్ చదువుతున్న ఆనంద్ అతని రూమ్మేటు. అతని ద్వారానే సుందరి పరిచయమవుతుంది విద్యార్థికి. మామయ్య అప్పు తీర్చేటప్పటికి బాంకులో డబ్బు అయిపోయింది. ఇక ముందు చదువుగతి ఏమిటని విచారంలో మునిగిపోతాడు విద్యార్థి. గదిలో జరిగిన దొంగతనంవలన వేరే గది తీసుకుంటాడు. సత్యం కథ అతన్ని పాదువరిగా మారుస్తుంది. ప్రైయివేటుగా ఎం. ఏ. చదివే జ్ఞానాంబతో అతని పరిచయం పెరుగుతుంది. లక్ష్మి మోసపోయిందని తెలుస్తుంది.

9

లైబ్రరీలో పని చూసుకుని తిరిగి వస్తుంటే సత్యం, లోకన్ కన్పించారు. 'ఎక్కడినుండిరోయ్ బండిల్ వేసుకొస్తున్నావ్ పుస్తకాలు ?' సత్యం పలుకరించాడు.

'బండిలా?...పాడా? ... నాలుగు పుస్తకాలా...' అంటూ జ్ఞానాంబ విషయం చెప్పాడు విద్యార్థి.

'అదా గురూగారూ...ఇందాక వాళ్లింట్లో వున్నారు? ... అయినా యీ రోజుల్లో అంతా కొడితే దెబ్బకు జంట పిట్టలు— ఒకటి బంగారు పిచికా, రెండోది అందాల పిచికా రాలేట్టు చూస్తుంటే—మీరు చాదస్తంగా యిటువంటివన్నీ తల కెత్తుకుంటారు?' అన్నాడు లోకన్‌బాబు.

'అబ్బే!...యీ అమ్మాయి అలాంటిది కాదండీ...ఆడపిల్లల్లో సహజంగా వుండే బిత్తర చూపులు తత్తర నడకలు యివేవీ వుండవండీ ఆ అమ్మాయిలో...అసలు తను ఆకర్షించాలనే తపనే వున్నట్టు కనబడదు. తను ఒక ఆడపిల్ల అన్న భావం వున్నట్లే మెలగదు ... కానీ దేముడంటే మాత్రం భగ్గున మండిపడుతుంది. ఆ అమ్మాయికి ఆపదలో దేముడెవ్వడూ ఆదుకోలేదుట గానీ, మనుషులే ఆదుకున్నారట. అందుకని దేముడికంటె మనుషులే నయం అంటుంది. పిచ్చి కాకపోతే దేముడు మూడు తలలూ, నాలుగు చేతులతో ప్రత్యక్షమయి సాయం చేస్తాడా ఏక్కడన్నా ?' అన్నాడు.

'పాపం. కష్టాలతో బాగా తల బొప్పి కట్టి వుంటుంది.' అన్నాడు సత్యం.

'కానీ ప్రతిసారీ యీ నోట్సులివ్వడం పుస్తకాలు తెచ్చివ్వడం న్యూసెన్సురా...' అన్నాడు విద్యార్థి.

'ఛా! పాపం...న్యూసెన్సు అనకురా... మనలానే జీవితంతో యుద్ధం సాగిస్తున్న పిల్ల... చేతనయిన సహాయం చెయ్యాలిరా మనం.' అన్నాడు సత్యం...ఆ తర్వాత వాళ్లు వెళ్లిపొయ్యారు.

విద్యార్థి గదికి చేరుకున్నాడు.

మర్నాడు...అతడు లక్ష్మి వివరాలు కనుక్కోవాలనే కుతూహలం చంపుకోలేక పోతున్నాడు... స్నేహితుడి సైకిల్ తీసుకుని ముందు జ్ఞానాంబ గదికి వెళ్ళాడు ... ఇంకా స్కూల్‌నుండి రాలేదని చెప్పారు యింటివాళ్లు...పుస్తకాలు ఆమె కిమ్మని వాళ్ల చేతికిచ్చి, తను లక్ష్మి అడ్రస్ వెతుక్కుంటూ అరండల్‌పేట వెళ్లాడు... అడ్రస్ కనుక్కున్నాడు.

ఆది రెండు గదుల అవుట్‌హౌస్... పాకిట్లో చూస్తే ఎవ్వరూ లేరు... అందుకని సైకిల్‌బెల్ కొట్టాడు.

ఆత్రుతగా పరుగెత్తుకు వచ్చింది లక్ష్మి. రేగినజుట్టు. ఏడ్చిఏడ్చి ఉబ్బించిన ముఖం. ఎర్రబడ్డ కళ్లల్లో ఉత్సాహం మెరుపులా మెరిసి బావను చూడగానే మాయమైంది. అంతలోకే సర్దుకుని:

'ఏం బావా ?... ఏమన్నా విశేషాలు తెలిశాయా ?' అంది దింపుడు కళ్లం ఆశలాగా.

'విశేషాలు ? ... ఏం విశేషాలు లక్ష్మి.'

'అదేబావా ... మధూగారి విశేషాలు... ఉత్తరమేమన్నా వచ్చిందా ?'

'ఓ...మధు నా ?... అతడి విశేషాలు నాకేమి తెలుస్తాయి లక్ష్మి ... ఉత్తరం రాస్తే నీకు రాయాలిగానీ ... నాకెందుకు రాస్తాడు ?... అయినా యింకా ఆశ మిగిలే వుందన్నమాట నీకు !...' అలా అంటున్నప్పుడు ఒక వికృతమైన నవ్వు నవ్వాడు. అందులో ఒకతృప్తి. ఒకహేళన, ఒక దెప్పిపొడుపు అన్నది కలగాపులగంగా వున్న విషపు నవ్వది.

దాన్ని జయలక్ష్మి ఏలా అర్థం చేసుకుందోకాని, అసలే ఎర్రగావున్న కళ్లు మరీ జపాకుసుమాల్లా అయినయి. చూపులు నిశితంగా వున్నయి. మాటలు కటువుదేలాయి.

'ఎందుకు బావా నా జీవితంతో చెలగాట మాడుకున్నావ్ ?... నేను నీకే మపకారం చేశాను ?' తొణుకూ బెణుకూ లేకుండా సిగ్గదీసినట్లుందా ప్రశ్న.

'నేనా ?!... నీ జీవితంతో చెలగాటమాడానా ?...' అయోమయంగా వుంది విద్యార్థికి. 'లేదు లక్ష్మి ... నీ జీవితంతో నువ్వే చెలగాట మాడుకున్నావ్.' అన్నాడు.

'కాదు బావా... నీ జీవితంతో చెలగాటమాడ్డం యిష్టంలేక ఆ రోజు నీతో నిజం చెప్పేశాను. నీతో నిజం చెప్పకుండా నాన్న మాట ప్రకారం నిన్ను పెళ్లిచేసుకుని, నీకు మనసివ్వకుండా, నీ జీవితం నాశనం చేస్తే నువ్వు సంతోషించి వుండి వుండేవాడివా ?...ఆ రోజు మేడమీద ... నువ్వు కసిగా కుర్చీమీద కొట్టి, కుర్చీలోంచి గిరుక్కున లేచిపోయిన నాడే భయపడ్డాను, నువ్వు నా జీవితంమీద దెబ్బతీస్తావని...

'నిజం చెప్పుబావా...మధూతో నామీద

ఏం చెప్పావ్ ?... ఏం చెప్పావో చెప్పుబావా ...అన్ని వాగ్దానాలు చేసిన నా మధూ నన్నొదిలి అర్ధరాత్రివేళ పరారీ కావడానికి ఏం చెప్పి మనసు విరిచేశావ్ ? కనీసం వుత్తరం ముక్కగూడా రాయకుండా ఏం మారిపోశావ్ బావా ?... చెప్పు విని ఆనందిస్తాను.'

అదిరిపడ్డాడు విద్యార్థి ... అనుకోని యీ పిడుగుపాటుకు అతడు క్షణకాలం దిమ్మెరపోయాడు... నోటమాటే రాలేదు. చివరికి ఎలాగో అన్నాడు లక్ష్మి!!...' అని.

ఆ కొద్ది నిముషాల్లో అతడే నిశ్చయాని కొచ్చాడోగానీ, దృఢంగా అన్నాడు. 'లక్ష్మీ! ...ఏదీ అతడి ఫొటో ఒకటివుంటే యివ్వు ...అతడి వివరాలు చెప్పు' అన్నాడు.

'ఏం ఎందుకు?...'


'ఎందుకేమిటి? ఈ అభాండానికి నేనేమి చెప్పినా నువ్వు నమ్మలేవు...లక్ష్మీ...నెల కానీ...రెండు నెల్లు కానీ...ఆర్నెల్లే పట్టనీ... ఏడాదే దాటనీ...అతడ్ని వెతుక్కొచ్చి నీ ముందు పెట్టి...అతడిచేతనే నీ ముందు, నాకూ అతడికి ఏ పరిచయమూ లేదని చెప్పించకపోతే...నాపేరు విద్యార్థి కాదు' అన్నాడు.

ఆ ప్రతిజ్ఞలో ఏ నిజాయితీ ధ్వనించిందో కానీ...లక్ష్మి చలించింది... 'నీ మనసు నొప్పిస్తే క్షమించు బావా... నిజంగా నీ కతడు తెలియనే తెలియదా బావా?' అంది మళ్ళీ ప్రాధేయపడుతున్నట్లు.

'లక్ష్మీ!...అసలు నేను మీ వూరు వచ్చేముందే జీతం కట్టి వచ్చాను...రెండేళ్ళు ఆగమని మామయ్యతో చెబుదామనే వచ్చాను. కానీ నీ అందం చూసి ఆకర్షణలో పడ్డ మాట నిజమే...కొద్దిక్షణాలు నా ఆశయాలకు తిలోదకాలిచ్చేద్దామనిపించిన మాట నిజమే ... కానీ నువ్వు నాకొక విధంగా మహోపకారం చేశావు... మర్చిపోయిన నా ధ్యేయంవైపు నన్ను మళ్ళించావు ... అప్పుడు నీమీద కోపం వచ్చినమాట నిజమే; కానీ యిక్కడికి వచ్చాక నీ ధ్యాసలోపడి నేను మజ్నుని కాలేదు...నా సౌఖ్యం నేను చూసుకున్నాను...నువ్వెక్కడైనా సుఖంగా వుంటే చాలు అనేటంత ఔన్నత్యం నాలో లేకపోవచ్చు... కానీ నీ ఆనందాన్ని చేతులారా ధ్వంసం చేసేంత నీచుణ్ణి మాత్రం కాలేదు లక్ష్మీ...'

'కాదు బావా...' ఏదో అనబోయింది లక్ష్మి;

'ఉండు లక్ష్మీ...నన్ను పొంతం చెప్పనీ



...ఈ ఫ్లాట్స్ కేషు మొదట చేరింది ప్రాక్టీసు పెట్టి యింకోళ్లైను యింకో అద్దె గొడ్డు... అక్కడ మేడమీద మెడిసిన్ చదివే అతనితో బాటున్నాను...ఆ గదిలో వున్నప్పుడే మా బట్టలు పొయ్యాయి — ఆ గదిలో వుండటం యిష్టంలేక అప్పటికప్పుడు గది దొరికితే యీ గది దొరికింది... ఆనంద్... అంటే నా రూమ్మేటుకు యీ గది నచ్చలేదు...అతడు వేరే గది చూసుకున్నాడు... అందుకే నేను ఒక్కడ్నే యీగదిలో వుండాల్సి వచ్చింది...అదీ నేను చేరింది క్రిందటినెల లోనే...యింకా నెల కాలేదు...నువ్వు నమ్మినా...నమ్మకపో...జరిగిందిది,'

లక్ష్మి కొంతసేపు మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయింది...తర్వాత ఒకసారి పెద్దగా నిట్టూర్చి అంది.

'అయితే నేనే పొరబడివుండవచ్చు బావా. ఈ అయోమయంలో ఏదో అన్నాను. అంతగా నమ్మించిన మధూ యింతగా మోసంచేస్తాడంటే యిప్పటికి నమ్మలేకుండా వున్నాను బావా.'

'అసలీ మధూ నీతో పరిచయమయ్యాడు నీకు?...'

'ఇదివరలో...అదిగో ...ఆ కనపడే మేడ మీద గదిలో వుండేవాడు...అతడి చూపులు నన్నెప్పుడూ వెంటాడుతుండేవి...నే నతడి ఆకర్షణలో పడిపోయ్యాను. వార పత్రికల కోసం నే నెప్పుడన్నా కబురు చేస్తే అన్ని పత్రికలూ తనే తెచ్చి యిచ్చేవాడు. ఆ విధంగా స్నేహమయింది ... ఆది...అలా... అలా...అయి మే మిద్దరం పెళ్లి చేసుకోవా లనుకున్నాం...మా విషయం యిక్కడైతే అంతా గొడవవుతుందని ... ఆయన ప్రాక్టీసు మకాం మార్చాడు...ఆ గదికి యిది వరలో నే నెప్పుడూ రాలేదు...ఇద్దరం వేరే చోట...'

'అతకూ అతడేం చేస్తుండేవాడు ?'

'ఏదో బిజినెస్ అనేవాడు ... ఎప్పుడూ చాలా ట్రిమ్ గా... ఆకర్షణీయంగా వుండే వాడు. డబ్బంటే లక్ష్యం లేనట్టే మాట్లాడే వాడు నాకోసం రూపాయిని పైసలా ఖర్చు పెట్టేవాడు... విలాసాలకు అంతగా ఖర్చు పెట్టేవాడు...అందుకే...అద్దె ఇవ్వలేదంటే నేను నమ్మలేకపోయ్యాను...నాకోసం ప్రాణా లైనా యివ్వవాడికి సిద్ధంగా వున్నట్టు కన్పించేవాడు... పెద్ద పెద్ద వాళ్ళందరూ

విద్యార్థి

తనకు తెలుసునని...మానాన్నగారు కూడా తెలుసని చెప్పేవాడు...' అలా చెబుతూ ఏదో ఆలోచనలో పడిపోయింది లక్ష్మి...

కాసేపున్నాక విద్యార్థి. 'లక్ష్మి !...యిలా

సముద్రఘోష

సముద్రుడా
ప్రళయకాల రుద్రుడా!
యుగాలు మారెను
జగాలు మారెను
మారలేదు నీ ఘోష
కారణ మేమిటి?

మారవచ్చు యుగాలు, జగాలు
మారవు మానవుని బుద్ధులు
అని ఘోషిస్తున్నావా
అని విలపిస్తున్నావా?

జ్ఞానసముద్రుడైనా
మానవుడు ఒక్కొక్కసారి
జాలిలేని దానవుడై
తోక తెగిన వానరుడై
నీతిలేని ముష్కరుడై
పనికిరాని నరాధముడై
సంచరిస్తున్నాడని
ఘోషిస్తున్నావా?
దుఃఖిస్తున్నావా?

సాటి మానవుని ద్వేషిస్తూ
తోటి మానవుని హింసిస్తూ
యుద్ధ దేవతను పూజిస్తూ
నెత్తురు టేరులను సృష్టిస్తూ

నరుడే నరజాతికి
ప్రబల విరోధియై
కఠిన కుఠారమై
సంచరిస్తున్నాడని
ఘోషిస్తున్నావా
దుఃఖిస్తున్నావా?

నరుడు వానరుడు కాడు
నారాయణాంశ సంభూతుడు;
మానవుడు దానవుడు కాడు
మహిత విజ్ఞాన ధనుడు
అని ఘోషిస్తున్నావా
అని హెచ్చరిస్తున్నావా
ప్రళయకాల రుద్రుడా
సముద్రుడా!

—వల్లూ రాధాకృష్ణశర్మ

అడుగుతున్నానని ఏమీ అనుకోకు...నువ్వు... నువ్వు...మరే ప్రమాదకరమైన... పరిస్థితి లోనూ చిక్కుకోలేదుగదా...' అని అడిగాడు లక్ష్మిని నఖశిఖపర్యంతం పరిశీలనగా చూస్తూ.

లక్ష్మి ముఖం అభిమానంతో జేవురించింది. పెద్దగా శ్వాస వదిలి ... 'దేవుడి దయవల్ల అలాంటి చిక్కులేమీ లేవు బావా.' అంది తల వంచుకుని.

'వస్తాను లక్ష్మీ...ఏదీ అతడి ఫోటో ఒకటి యివ్వు.' అని అడిగాడు.

'వద్దులే బావా ... నీ కంత శ్రమ ఎందుకు?...ఇప్పటికే నిన్ను చాలా నొప్పించా నేమో' అంది లక్ష్మి గద్గద కంఠంతో.

'లక్ష్మీ...ఒక్క విషయం మర్చిపోకు... నువ్వు నా మేనమామ కూతురివి ... ఏ బంధం ఎలాగున్నా ... మన మధ్య రక్త సంబంధం వుంది. అది తెగిపోనిది...మావయ్యకు నా మీద కోపం వచ్చినంత మాత్రాన నువ్వు పరాయిదానవు కావు.' అన్నాడు.

లక్ష్మి ఫోటో తీసి యిచ్చింది ... అతడే తను సినిమాలో చూసినవాడే ... భద్రంగా జేబులో పెట్టుకుని ధైర్యంగా వుండమని లక్ష్మికి చెప్పి వచ్చేశాడు విద్యార్థి.

రోజులు దొర్లిపోతున్నాయి... ఆది నవంబరు నెల ఆఖరి వారం... విద్యార్థి కాలేజిలో 'లెటర్ బాక్స్'లో వెతుకుతున్నాడు తన కేమన్నా వుత్తరాలున్నాయేమోనని ... 'ఇన్లాండ్ లెటర్' వచ్చింది యింటిమండి... చించి చదువుతూనే మెట్లు దిగి వస్తున్నాడు.. పెళ్ళయిన ఆరేళ్ళకుగనూ అక్కయ్య సౌందర్యనే తనకో మేనల్లుడ్ని యివ్వబోతోందిట... అమ్మ వ్రాసింది ... ఇంకా వూపిరి పోసుకోని ఆ మేనల్లుడ్ని తల్చుకుంటే అతడికిప్పుడే ఎంతో సంతోషంగా వుంది. అలా చదువుతూ ఒక్కో మెట్టే దిగి వస్తున్నాడు.

'ఏ టండీ ఒంత దీక్షగా చదువుతున్నారు? ఎవరినైనా ఢీ కొట్టయ్యగలరు!'

తక్షణం వుత్తరం మడిచేస్తూ తలెత్తాడు విద్యార్థి ... ఎదుట జ్ఞానాంబ... 'ఓహో!...మీరా...ఎప్పుడొచ్చారు ?'

'ఇప్పుడే బస్ లో దిగానండి ... ఇవ్వాళ శనివారం ఒంటిపూట బడి కదండి...అందుకని యిలా వచ్చాను. లెక్చరరుగారిని కొన్ని సందేహాలడగాలి.'



ప్రొద్దుటి తాజాతనము గంటల గంటలకొద్దీ

ఆ ప్రాతః కాలపు అభినవ చైతన్యాన్ని స్నానం అయిన తరువాతకూడా గంటలకొద్ది వుంచుకోండి పాండ్స్ డ్రీమ్ ఫ్లవర్ టాల్క్‌తో

భారతదేశంలో విస్తారంగా అమ్ముడయే టాల్క్ కోమలమైన పరిమళం వస్తూనే వుంటుంది
పాండ్స్ డ్రీమ్ ఫ్లవర్ టాల్క్ చెమ్మని తేమను పీల్చుకుంటుంది సన్నిహితమైన లాలిత్యాన్ని కల్గించి మండు వేసవికాలంలో ఉక్కబెట్టేటప్పుడు కూడా చల్లదనాన్ని నవచైతన్యాన్ని సువాసనను మీకు కలిగిస్తుంది. చలికాలాది అన్ని కాలాలలోను మీకు వుపయోగించగల టాల్క్.

3 సైజులలో లభిస్తుంది
ఫ్యామిలీ — లార్జి — మీడియమ్.



పాండ్స్
డ్రీమ్ ఫ్లవర్ టాల్క్

మీ హోదాకు తగినదైన
లగ్జరీ టాల్క్

చీసెబ్రో పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్
(పరిమిత బాధ్యతతో U.S.A.లో స్థాపితము)

'పాపం మీరు చాలా శ్రమపడి వచ్చారు కానీ...యివ్వాళ ఆయన రాలేదు. అందుకే సెకండవరు తీసుకోవాల్సినాయన ఫస్టవరు తీసుకున్నారు.'

ఒక్కసారిగా నిరాశ పడిపోయింది జ్ఞానాంబ...గోడ కానుకుని మెట్ల మీద నిలబడిపోయింది.

'మధ్యాహ్నం కూడా రారా ?'

'రారనే అనుకుంటాను'

'అక్కడెవర్నన్నా అడిగి రానా ?'

'పోని...మీరిలా ... లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో కూచోండి...నేను వెళ్ళి అక్కడ ప్యూన్‌ను కనుక్కొస్తాను.' అన్నాడు విద్యార్థి.

అతడు వెళ్ళి కనుక్కు వచ్చేసరికి, లయోలా పబ్లిక్ స్కూల్ దాకా వెళ్ళకుండా, అక్కడే టర్న్ తిరిగి వెళ్ళిపోయింది సిటీ బస్...విద్యార్థి వచ్చి లెక్చరర్ మధ్యాహ్నం కూడా రారని చెప్పాడు...సిటీ బస్ మళ్ళీ వచ్చేసరికి ఒక గంటపైనే పడుతుంది... ఆర్. టి. సి. రిక్వెస్ట్ స్టాప్‌వున్నా ఎప్పుడో తప్ప ఆపనే ఆపరు...ఈ గంటసేపు ఏం చెయ్యాలో తోచలేదు జ్ఞానాంబకు.

'పోని...మీ కభ్యంతరం లేకపోతే... అలా వెళదాం రండి...ఇక్కడ...యీ చింత చెట్ల కింద ఎంతసేపని కూర్చుంటాం.' అన్నాడు విద్యార్థి.

'ఎక్కడికి వెళ్దామంటారు ?'

'ఇక్కడికి ఫర్లాంగు దూరంలో, ఒక

విద్యార్థి

తోట; ఒక చిన్న కొండా, కొండ మీద నరసింహస్వామి ఆలయమూ వుంది. మీకేమి అభ్యంతరం లేకపోతే...'

'అభ్యంతరం ఎందుకండీ ... పదండి... నాకా మాత్రం నమ్మకముంది.'

'నమ్మకం... ఎవరిమీద...నా మీదేనా ?' చాలా మెల్లిగా అడిగాడు.

'మీ మీదా నమ్మకముంది...అంతకంటే నా మీదా నాకు నమ్మకముంది...పదండి,' చాలా నిశ్చలంగా అన్నది జ్ఞానాంబ.

'అయితే ఒక్క నిముషం వుండండి...' అంటూ కాంటీన్‌కు వెళ్ళి, అన్ని వడలూ, పకోడీలు 'పాక్' చేయించి తీసుకు వచ్చాడు విద్యార్థి.

ఇద్దరూ బయలుదేరారు... కాలేజినుండి ఒక ఫర్లాంగు దూరం నడిస్తే, ఎండిపోయిన వాగు లాంటిది వస్తుంది ... దాన్ని దాటితే మామిడి చెట్లు...అనంతా నరసింహస్వామి గుడి భూములే... క్రింద అంగుళం మేర ఖాళీ లేకుండా పరిచినట్లున్న 'టచ్ మి నాట్' మొక్కలు ... విరిని పచ్చని రంగులతో వాటికి పూసిన చిన్ని చిన్ని పూలు, కెంపులు, గోమేధికాలూ కలబోసి కళ్ళాపు చల్లినట్లున్నాయి...అదమరిచి అడుగేస్తే గుచ్చుకునేలా పల్లేరు మొక్కలూ వున్నాయి. జీరాడే జ్ఞానాంబ చీర కుచ్చెళ్ళకు చీపురుముళ్ళు గుచ్చుకున్నాయి. అయినా ఏ తోటమాలి కట్టడి లేకుండా, సోయంజార్ల అదుపాజ్ఞలూ లేకుండా పెరిగిన అకతాయి అమ్మాయిలా వుంది ప్రకృతి...

'ఇక్కడ కూచుందామండీ కాస్సేపు.' అంది జ్ఞానాంబ.

'బాబోయ్ పల్లేరు మొక్క లుంటాయండీ.'

అప్పటికప్పుడే జాగ్రత్తగా చూసి అక్కడ కూచుని, ముట్టుకుంటే ముడుచుకు పొయ్యే కొత్త పెళ్ళికూతురులా, తాకితే ముకుళించే 'టచ్‌మినాట్' మొక్కలతో ఆడుకుంటోంది జ్ఞానాంబ...

'ఈ ముళ్ళలో నేను కూచోలేను బాబూ...ఏమండీ మీకంతగా కూచోవాలనుంటే అక్కడ చక్కటి కొండరాయి వుంది పదండి...' అన్నాడు విద్యార్థి...

అయిష్టంగానే లేచింది జ్ఞానాంబ. అక్కడకు కొన్నిగజాల దూరంలో ఒక పెద్ద బావి. దగ్గర్లోనే ఒక పాడుబడ్డ యిల్లూ వున్నాయి...వాటికి దగ్గర్లోనే వూడలు దిగిన పెద్ద మర్రిచెట్టు. దాని ప్రక్కనే కొండ.

ఇద్దరూ మర్రిచెట్టు నీడన, నున్నగా సాపు చేసినట్టున్న కొండరాయిమీద కూర్చున్నారు.


'ఇదివరలో మీరిక్కడి కెప్పుడైనా వచ్చారా ?...'

'బాగుందండోయ్...మా డిపార్టుమెంటు వాళ్ళకు యించుమించు వెయిటింగ్‌రూమ్ లాంటిదిది. ఎప్పుడు వీలు దొరికితే అప్పుడు యిక్కడికి వచ్చి చదువుకుంటుంటాము. మాలో కొందరు టిఫిను తెచ్చుకుని యిక్కడే తీసుకుంటుంటారు.' అన్నాడు.

'అన్నట్లు మీకు టెర్మినల్ ఎగ్జామ్స్ అటగా...పేరడైజ్ లాస్ట్ బుక్ వన్ అయిపోయిందాండీ'

'ఇంచుమించు అయిపోవచ్చింది సెప్టెంబరులో పరీక్షలు. ఇంక యిరవై రోజులే వున్నాయి.'

'అందులో 'శాటన్ కారెక్టరు' అద్భుతంగా వుంది కదూ. రాజు నిరంకుశత్వం మీద ఎదురుతిరిగి విప్లవశంఖం పూరించిన విప్లవవాది మిల్టన్, ఆ పాత్రలో లీనమయి ప్రతి ఒక్కమాటా పలికించాడా అనిపిస్తుందండీ నాకు ఆ మొదటి పుస్తకం చదువుతుంటే.'





ఇవి మీకు శక్తినిచ్చే సంవత్సరాలు....
ఓవల్‌టీన్ సంవత్సరాలు
ఓవల్‌టీన్ తీసుకుంటే మీరు మరింత ఆరోగ్యంగా, ఉల్లాసంగా, బలంగా, ఉత్సాహంగా వుంటారు. ఎందు చేతనంటే ఓవల్‌టీన్ పాలు, మాల్ట్‌లతో తయారైన పానీయం. మీకు ఆరోగ్యం, బలం, ఉత్సాహం ఇచ్చేందుకు దీనినిండా ప్రొటీనులూ, మరిన్ని విటమిన్‌లూ వుంటాయి. ఈ పానీయపు శక్తి-ఇది మీకు నచ్చుతుంది. అందువల్లే ప్రపంచంలో లక్షలాది ప్రజలు ఓవల్‌టీన్ త్రాగుతున్నారు. ఈ వేళే మీరుకూడా వారితో చేరండి.
OVALTINE
The Supreme Food Beverage
ఆరోగ్యానికి, బలానికి, శక్తికి
రుచికరమైన ఓవల్‌టీన్ సేవించండి

'తానే మొదటి పుస్తకం చదువుతుంటే అంత వుత్తమ నాయకుడిలా, సాహసం, సమయస్ఫూర్తి, చాకచక్యం మూర్తీభవించిన మహోన్నతమైన నాయకుడిలా చూపించిన ఆ పాత్రలో క్రమక్రమంగా పతనాన్ని కూడా చూపించాడుగదా. దాన్ని బట్టి చూస్తే, రావణబ్రహ్మను వీరాధి వీరునిగా చిత్రించి తద్వారా అతణ్ని వరి మార్చిన శ్రీరాముని ఔన్నత్యాన్ని చాటిన వాల్మీకిలా షేక్స్పియర్ మిల్టన్ కూడా శాటన్ ను వీరునిగా, నాయకమ్మన్యునిగా చిత్రించి తద్వారా అతడి ప్రత్యర్థి దేముడి గొప్పదనం చాటాలనుకున్నాడేమో...మీరు వాటి మీద క్రిటిసిజమ్ బుక్స్ చదివారుగా.'

'కానీ...అది అన్యాయం కదూ బండీ ?' అంది జ్ఞానాంబ.

'ఏమిటండోయ్ ఆ అన్యాయం ?'

'అదే ... దేముడు చేసిందే...చిరుతలు పట్టుకు తన చుట్టూ భజన చేసేవాళ్లను ఆకాశానికి ఎత్తేసి, వాళ్లందర్నీ దేవత లనడమేమి, ఇదేమిటని నిగ్గదీసి అడిగిన వాళ్లను అలా పతనం చెయ్యడమేమి ?... దేముడి క్కూడా 'అపోజిషన్' అంటే గిట్టదు కాబోలు.' అలా అంటున్నప్పుడు ఆ అమ్మాయి స్వరం కొద్దిగా వొణికింది. ఈ అమ్మాయి ఏందుకిలా ఫీలయి మాట్లాడుతుంది?...అనుకున్నాడు విద్యార్థి.

'మీరు చెప్పండి విద్యార్థిగారూ !... శాటన్ వీరుడు కాడా?... వీరుడు కాకపోతే దేవతా సైన్యంలో మూడోవంతు సైన్యంతో దేముణ్ని ఒక్కపూపు పూపగలడా ?...

విద్యార్థికి నవ్వొచ్చింది.

'జ్ఞానాంబగారూ !... ప్లీజ్ ... మీరు ఆవేశం తగ్గించుకోవాలి. మీరు నాతో పోట్లాడ్డానికి నేను దేముణ్ని కాను. మిల్టన్నూ కాను...అసలు శాటన్ వీరుడు కాడని నేనూ అనటంలేదు. అయితే అతడిలో ఒకపాలు తాను సమర్థుడిననే గర్వం, తన్నెవ్వరూ ఏమీ చెయ్యలేరనే అహంభావం లేదంటారా ?...'

'అది అహంభావ మేరంటారా?... ఆత్మవిశ్వాసమంటారా ?... ఆత్మవిశ్వాసం లేనిదే మనిషి ఏపనీ చెయ్యలేడు.'

'మీరు పొరబడుతున్నారు జ్ఞానాంబ గారూ...ఆత్మవిశ్వాసం వేరు అహంభావం వేరు. అహంభావంవల్ల ధీమా ఎక్కువై ప్రత్యర్థి బలాన్ని తక్కువ అంచనా వేసేట్లు చేస్తుంది. ఆత్మవిశ్వాసం ధైర్యాన్నిస్తుంది. ఆత్మవిశ్వాసం కలవాడు ప్రత్యర్థి బలాన్ని తక్కువ అంచనా వెయ్యడు...తనశక్తినీ, ఎదుటివారి శక్తినీ, సరైన అంచనా వేసుకుని దానికితగ్గ మనో బలాన్నీ, అంగబలాన్నీ కూడగట్టుకునేలా చేస్తుంది.

'మీకింకా క్లియర్‌గా చెబుతాను... దేముణ్నీ శాటన్నూ కేవలం, యిద్దరు మనుష్యులుగా తీసుకుందాం...దేముడు శక్తి సంపన్నుడని శాటన్‌కు తెలుసుగదా...కానీ అతడు తన అహంభావంతో దేముడి బలాబలాల అంచనాన్ని తప్పుగా వేసుకోలేదా? అతడిదగ్గర రహస్యాయుధాలు వుంటాయని అనుకోకపోవడం, శాటన్ ఎత్తుగడలలోనూ యుద్ధనీతి విశారదత్వం లేని లోపం... అమెరికా ఆటంబాంబు వెయ్యబొయ్యేముందు లోకానికంతా చెప్పి వెయ్యలేదుకదా...ఇదీ అంతే ... ఆత్మవిశ్వాసానికి, అహంభావం తోడయితే ఆత్మవినాశనమే అవుతుంది .సరే..యీ 'పేరడైజ్ లాస్ట్' తో మనం పకోడీమాట మర్చిపోతున్నాం... రండి...ఇదుగోండి ... యివి తీసుకోండి మీరు...' అంటూ కొన్ని పకోడీలు, వడలు ముందు పెట్టాడు.

'విద్యార్థిగారూ...ఏదో 'శాటన్' అంటే యిష్టపడ్డానని, నేనేమన్నా పోలేదమ్మ అనుకున్నారా....నా ముందు అంత. కుంపటం పోస్తున్నారు...తియ్యండి.' అంది జ్ఞానాంబ.

'అయ్యయ్యో !... ఎంతమాట !... మీరు గెస్టులండీ...అదేమిటి?...అన్నీవాళ్లీ నాముందే పోస్తున్నారు. నేను మాత్రం భీముణ్ననుకున్నారా సయం...తియ్యండి... తియ్యండి...'

'ఫరవాలేదు . మీరు తినండి...ప్రొద్దున్నెప్పుడో నాల్గు మెతుకులు తిని వచ్చిన వాళ్లు మీరు.. నాకేం...'

'ఏదేం కుదరదు ... ఫీఫ్టీ ... ఫీఫ్టీ...' అంటూ విద్యార్థి...ఆకుల్లో పెరిపాం పెట్టాడు...

(ఇంకా వుంది)

సినిమా



నటి చంద్రకళ

(చిత్రకారుడు : శ్రీ కొండ్యూరు నాగేశ్వరరావు)

మీ అభిమాన హీరోలు నటిస్తున్న చిత్రాలు, వారి సరసన కనిపించే తారామణుల వివరాలను యీ వారం తెలియ చేస్తున్నాను

అక్కినేని నాగేశ్వరరావు

అన్నపూర్ణా ఆర్ట్స్ పిక్చర్స్‌వారి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'విజేత' దాదాపు పూర్తయింది ప్రముఖ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు నిర్మిస్తున్న యీ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు నాగేశ్వరరావు నాయకుడు, వాణిశ్రీ నాయిక. అన్నపూర్ణా విడుదల.

* * *

పద్మశ్రీ పిక్చర్స్ వారు పూర్తి రంగుల్లో నిర్మిస్తున్న చిత్రం మరొక్క షెడ్యూలుతో పూర్తవుతుంది పి పుల్లయ్య దర్శకత్వం నెరపుతున్న యీ చిత్రంలో నాగేశ్వరరావు, వాణిశ్రీ కనిపిస్తారు, వి. వెంకటేశ్వర్లు నిర్మిస్తున్న యీ చిత్రానికి శ్రీఫిలింస్ పంపిణీదారులు.

* * *

పీనస్ కంబైన్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న సాంఘికం మూడవ షెడ్యూల్లో పడింది. వి. మధుసూదనరావు దర్శకుడు అక్కినేని, వాణిశ్రీ, కాంచన ప్రధాన పాత్రధారులు టి. గోవిందరాజన్ నిర్మించే యీ చిత్రం నవయుగ ద్వారా విడుదలవుతుంది.

* * *

జగపతి ఆర్ట్స్ పిక్చర్స్ వారి 'బంగారుబాబు' వర్ణచిత్రంలో అక్కినేని, వాణిశ్రీ నాయకీ, నాయక పాత్రలను పోషిస్తున్నారు. వి బి. రాజేంద్రప్రసాద్ నిర్మిస్తూ, దర్శకత్వం నిర్వహిస్తున్న యీ చిత్రం అన్నపూర్ణా పంపిణీ సంస్థకి యివ్వబడింది.

* * *

విశ్వభారతి ప్రొడక్షన్స్ నిర్మించే కొత్త చిత్రంలో నాగేశ్వరరావుతో లక్ష్మి నాయికగా నటిస్తుంది. జి రాధాకృష్ణమూర్తి నిర్మించే యీ చిత్రానికి వి. మధుసూదనరావు నిర్దేశకుడు నవయుగ విడుదల.

* * *

అంజలీ పిక్చర్స్ కంబైన్స్ వారి పూర్తి రంగుల చిత్రం 'భక్తతుకారాం'లో అక్కినేని, అంజలీదేవి దంపతులుగా నటిస్తున్నారు ఒకనాటి విజయవంతమైన జంట మరలా కలిసి నటించడం యిందులోని ప్రత్యేకత. వి. మధుసూదనరావు దర్శకుడు లక్ష్మి విడుదల

* * *

విజయభట్ పిక్చర్స్ నవంబరులో ప్రారంభించనున్న చిత్రంలో నాగేశ్వరరావుతో మంజులకు నాయిక వేషం దొరికింది. ఎస్. ఎస్ భట్ నిర్మించే యీ చిత్రానికి తాతినేని రామారావు దర్శకుడు.

* * *



'ఊరికి ఉపకారి'లో ఆరతి, చలం.

చిత్రకల్పన నిర్మించబోయే చిత్రంలో నాగేశ్వరరావు నటించడానికి అంగీకరించారు బాపు దర్శకత్వంలో యీ చిత్రం త్వరలో ప్రారంభమవుతుంది

* * *

ప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ అతిత్వరలో ఒక సాంఘిక చిత్రాన్ని ప్రత్యగాత్మ దర్శకత్వంలో ప్రారంభిస్తారు నాగేశ్వరరావు, జయలలిత నటించే యీ చిత్రానికి ఏ ఏ సుబ్బారావు నిర్మాత

ఎన్టీ రామారావు

త్రివేణి ప్రొడక్షన్స్ వారి 'బడిపంతులు' చిత్రములో రామారావు, అంజలీదేవి ముఖ్యభూమికలను నిర్వహించారు షూటింగు పూర్తయింది. పి. పేర్రాజు నిర్మించిన యీ చిత్రం పూర్ణా ద్వారా విడుదలవుతుంది. పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు.

* * *

దీప్తి యింటర్నేషనల్ , ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న 'దేశోద్ధారకులు' దాదాపు పూర్తయింది. వాణిశ్రీ నాయికగా నటించింది వి విశ్వేశ్వరరావు నిర్మించిన యీ చిత్రం విజయా ద్వారా ఆంధ్ర ప్రేక్షకులకు దర్శనమిస్తుంది పి ఎస్ రావ్ దర్శకుడు

* * *

ఎస్ ఏ. టి. సంస్థ నిర్మించే 'కులగౌరవం' విడుదలకు ముస్తాబవుతోంది తాత, తండ్రి, [illegible]



'బంగారు మనసులు' ప్రారంభోత్సవంలో గాయని సుశీల, మీనాకుమారి, జమున, ప్రకాశ్‌రెడ్డి, రామానాయుడు మొదలగువారు.

ప్రకాశ్‌రెడ్డి, రామానాయుడు మొదలగువారు.

సినిమా

నాయికగా జయంతి నటించింది. ఎస్. త్రివిక్రమరావు నిర్మించిన యీ చిత్రం విజయా పంపిణీ సంస్థకి యివ్వబడింది. పేకేటి శివరామ్ దర్శకుడు

* * *

వాసూ స్టుడియోస్ పూర్తి రంగుల్లో నిర్మిస్తున్న చిత్రం త్వరలో విడుదల అవుతుంది. ఏ. భీంసింగ్ దర్శకత్వంలో తయారవుతున్న యీ చిత్రంలో రామారావుతో జమున నాయికగా నటించింది విజయ విడుదల.

* *

ఎస్. వి. ఎస్. ఫిలింస్ నిర్మిస్తున్న 'డబ్బుకు లోకం దాసోహం'లో రామారావు,జమున ప్రధానపాత్రధారులు. మిద్దె జగన్నాథరావు నిర్మిస్తున్న యీచిత్రానికి డి. యోగానంద్ దర్శకుడు.తారకరామ విడుదల.

* * *

డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ తరఫున డి. వి. ఎస్. రాజు నిర్మించనున్న చిత్రంలో రామారావు నాయక పాత్రను పోషిస్తారు. సి. ఎస్. రావ్ దర్శకుడు. విజయ విడుదల

* *

గౌతమీ పిక్చర్స్ నిర్మించబోయే సాంఘికంలో రామారావు నటించడానికి అంగీకరించారు. రామబ్రహ్మం నిర్మించే యీ చిత్రానికి ఆయనే పంపిణీదారుడు.

* *

సినిమా డైరీ

● శక్తిమూవీస్ 'ఇన్‌స్పెక్టర్ భార్య' ఆగస్టు 25 వ తారకరామ ద్వారా విడుదలవుతుంది. సత్యనారాయణరావు దర్శకుడు.

అంజలీ పిక్చర్స్ కంబైన్స్ 'భక్త తుకారాం' మూడవ షెడ్యూలు ఆగస్టు 15 నుండి 22 వరకు జరుగుతుంది. వి. మధుసూదనరావు దర్శకుడు.

● జగపతి ఆర్ట్స్ పిక్చర్స్ 'బంగారు బాబు' నాల్గవ షెడ్యూలు ఆగస్టు 22 వ సారధిలో ప్రారంభమవుతుంది. వి. బి. రాజేంద్రప్రసాద్ దర్శకుడు.

● సారధి అండ్ టి. పి. ఆర్. కంబైన్స్ యొక్క మొదటి షెడ్యూలు ఆగస్టు 11 వ హైద్రాబాదులో ప్రారంభమైంది. టి. ప్రకాశరావు దర్శకుడు.

● కె. ఎస్. ఆర్. పిక్చర్స్ 'బంగారు మనసులు' రెండవ షెడ్యూలు ఆగస్టు 10 వ విక్రంలో ప్రారంభమైంది. కె. ఎస్. రెడ్డి దర్శకుడు.

● డి. బి. ఎస్. గారి 'అబ్బాయిగారు—అమ్మాయిగారు', పూర్ణచంద్రరావుగారి 'పాపం పసివాడు' రీ—రికార్డింగు కార్యక్రమాలు పూర్తయినాయి.

ఆర్ట్ డైరెక్టర్ రాజేంద్రకుమార్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించే 'శ్రీరామాంజనేయ యుద్ధం'లో ఎన్టీరామారావు, హేమమాలిని ముఖ్యపాత్రధారులు. కమలాకర కామేశ్వరరావు దర్శకుడు తారకరామ విడుదల

* *

చిక్కడు—దొరకడు చిత్రాన్ని అందించిన లక్ష్మీనారాయణ కంబైన్స్ అతిత్వరలో ప్రారంభించబోయే చిత్రంలో ఎన్టీరామారావు నాయక పాత్రను పోషిస్తారు నిర్మాత కుదరవల్లి సీతారామస్వామి.

అమృతా ఫిలింస్ నిర్మించనున్న 'నేరము—శిక్ష'లో నాయకుడు. కె. విశ్వనాధ్ దర్శకుడు శ్రీఫిలింస్ రిలీజ్.

*

శ్రీ కృష్ణ కిశోర్ పిక్చర్స్ నిర్మించబోయే, చిత్రంలో కృష్ణ, జమున ముఖ్య పాత్రధారులు. శేఖర్‌బాబు నిర్మించే యీ చిత్రానికి పి. చంద్రశేఖర రెడ్డి దర్శకుడు జ్యోతి విడుదల

* * *

ఎస్. వి. ఎస్ పిక్చర్స్ నిర్మిస్తున్న చిత్రంలో కృష్ణ, విజయనిర్మల జంటగా నటిస్తున్నారు. మిద్దె జగన్నాధరావు నిర్మించే యీ చిత్రానికి, డి. యోగానంద్ దర్శకుడు తారకరామ విడుదల.

నందినీ ఫిలింస్ 'ఇల్లు—ఇల్లాలు' షూటింగు దాదాపు పూర్తయింది. వాణిశ్రీ నాయిక పి చంద్రశేఖరరెడ్డి దర్శకుడు. కుమారస్వామి పిక్చర్స్ విడుదల.

డి. బి. ఎస్. ప్రొడక్షన్స్‌వారి 'అబ్బాయిగారు—అమ్మాయి'గారు విడుదలకు సిద్ధంగా వుంది. కృష్ణ—వాణిశ్రీ ముఖ్యపాత్రధారులు. వి. రామచంద్రరావు దర్శకుడు. శ్రీఫిలింస్ విడుదల

వాణిశ్రీ సమర్పించే రవిరాజ్ ప్రొడక్షన్స్‌వారి 'మరపురాని తల్లి' కూడా పూర్తయ్యే ఘట్టంలో వుంది. వాణిశ్రీ నాయిక. కేశవ జయరాం నిర్మాత. డి. ఎస్. ప్రకాశరావు దర్శకుడు. విజయ విడుదల.

* *

శక్తి మూవీస్‌వారి 'ఇన్‌స్పెక్టర్ భార్య' యీనెల 25న విడుదలవుతుంది. చంద్రకళ భర్తగా కృష్ణ నటించారు. తారకరామ విడుదల చేసే యీ చిత్రానికి సత్యనారాయణరావు దర్శకుడు. జయశేఖరం నిర్మాత.

* * *

శ్రీ మహేశ్వరీ మూవీస్ నిర్మిస్తున్న 'మాయింటి వెలుగు'లో కృష్ణ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. చంద్రకళ, నిర్మల నాయికల వేషాలు వేస్తున్నారు.



ఇది ఒక్కటే
100% TERENE
అల్లిక చొక్కా గుడ్డ-
space king! by Coltex
గాలి ఆడే నేత. 100%
'టెరీన్' అల్లికకు తోడు క్రొత్త
డిజైనులు మరియు మువ్వన్నెలవే సే
రంగులలో దర్శాయైనవి...
'స్పేస్ కింగ్' అల్లిక చొక్కా
గుడ్డలు, సొగసైన దుస్తులు
వేసుకొనే సరసులైన వారికి తగినవి.
కోల్టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్
(యూనివర్సల్ టెక్స్టైల్స్ వారి
ఒక విభాగము)
రేఫల్ రేంజ్, ఎల్.బి.ఎస్. మార్గ్
ఘాట్‌కోపర్, బొంబాయి-86.
వ్యాపార వివరములకు వ్రాయండి:
ఎస్. ఎన్. మాండేల్యా
203, కల్బాదేవి రోడ్, బొంబాయి-2
డిస్ట్రిబ్యూటర్లు: చెల్లారామ్స్, 3/4, గోడౌన్ స్ట్రీట్, మద్రాసు • రాజా మార్కెట్ చిక్ పేట్, బెంగుళూరు • ఆబిద్ రోడ్, హైదరాబాదు.
తుల్సీదాస్ వి. పటేల్, నవీ గల్లీ, స్వదేశీ మార్కెట్, కల్బాదేవి రోడ్, బొంబాయి-2. లాల్ ట్రేడర్స్, 23, కకర్ మార్కెట్, కల్బాదేవి రోడ్, బొంబాయి-2. ద్వారకాదాస్ రామేశ్వర్ గోయెంకా, 259, కల్బాదేవి రోడ్, బొంబాయి-2.
Daltarom-CP-51



'దేశోద్ధారకులు'లో వాణిశ్రీ, రామారావు.

సి ని మా

పైడిమర్రి నిర్మాత, విజయ్ దర్శకుడు. పూర్ణా విడుదల.

శ్రీవెంకటేశ్వర పిక్చర్స్ ఈస్ట్‌మన్‌కలర్‌లో, తయారు చేస్తున్న 'మంచివాళకు మంచివాడు' కూడా పూర్ణా ద్వారా త్వరలో విడుదలవుతుంది విజయనిర్మల నాయిక. ఎస్. భావనారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కె. ఎస్. ఆర్. దాస్ దర్శకుడు.

ఉమా ప్రొడక్షన్స్ 'కత్తుల రత్తయ్య' పూర్తి రంగుల చిత్రం శరవేగంతో సాగిపోతూంది. కృష్ణ— వెన్నిరాడై నిర్మల జంటగా కనిపిస్తారు. ఎస్. ఎస్. భట్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కె. ఎస్. ఆర్. దాస్ దర్శకుడు. రాజశ్రీ విడుదల.

ఆర్. ఎస్. మూవీస్ నిర్మిస్తున్న 'మల్లమ్మకథ' సగం దాకా వచ్చింది. కృష్ణ, శారద నటిస్తున్న మొదటి చిత్రం ఇది. అక్కినేని సంజీవి దర్శకుడు, పి. చెంచురామయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి లక్ష్మీ పంపిణీదారులు.

*

ఏ.వి.ఎమ్. ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'పుట్టినిల్లు — మెట్టినిల్లు' చిత్రంలో చంద్రకళతో నాయకుడిగా నటిస్తున్నారు. పట్టు దర్శకుడు. విజయ విడుదల.

మీకు తెలుసా?

పద్మాలయా(కృష్ణ స్వంతసంస్థ) నిర్మించే మూడవ చిత్రాన్ని ఆదుర్తి సుబ్బారావు డైరెక్ట్ చేస్తారట.

పి. ఆనందరామం వ్రాసిన 'అనిత' నవల సినిమా కాబోతుంది. జమున నాయిక పాత్రను పోషిస్తారట.

'పండంటి కాపురం' హిందీ చిత్రాన్ని ఆదుర్తి సుబ్బారావు నిర్మిస్తారట.

'మావూరి మొనగాళ్ళు' కథను ఆర్. ఆర్. పిక్చర్స్ హిందీలో నిర్మిస్తారట.

ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు త్వరలో దర్శకత్వం నిర్వహిస్తారట.

నటి విజయనిర్మల ఆగస్టు 16 నుండి దర్శకురాలు కూడా అవుతుంది. (మళయాళ చిత్రం.)

శోభన్‌బాబు

శ్రీధర్ ప్రొడక్షన్స్ వారి 'జీవితం' సగం వరకు వచ్చింది. శారదతో నాయకుడిగా, జయంతికి భర్తగా నటిస్తున్నారు. సూర్యచంద్రరావు, గిరిబాబులు నిర్మిస్తున్న ఈ చిత్రానికి కె. ఎస్. ప్రకాశరావు దర్శకుడు. లక్ష్మి విడుదల.

* * *

భానూ మూవీస్‌వారి 'కన్నతల్లి' విడుదల కాబోతూంది. చంద్రకళ నాయిక. వివేకానందరెడ్డి, సీతారామరాజు నిర్మించిన ఈ చిత్రానికి టి. మాధవస్వామి దర్శకుడు. లక్ష్మి విడుదల.

* * *


మమతా ప్రొడక్షన్స్ వారి 'కాలం మారింది' కూడా త్వరలో ప్రేక్షకులకు దర్శనమివ్వబోతుంది.



'వింతదంపతులు'లో జమున, కృష్ణంరాజు.



"జవాని దివాని"లో జయభాదురి



'బడిపంతులు'లో రామారావు, బేబీ మున్ని, కృష్ణంరాజు, రామకృష్ణ.

శోభన్, శారద ముఖ్య జంట. పత్రికా రచయిత రాశిరాజు ప్రకాశం నిర్మిస్తున్న యీ చిత్రానికి కె. విశ్వనాథ్ దర్శకుడు. లక్ష్మి విడుదల.

*


సురేష్ మూవీస్ నిర్మిస్తున్న 'జీవన తరంగాలు' ...రు రీళ్లు తయారైంది. శోభన్, వాణిశ్రీ జంటగా, నటిస్తున్న యీ చిత్రానికి తాతినేని రామారావు

సినిమా

దర్శకుడు. డి. రామానాయుడు నిర్మిస్తున్న చిత్రం నవయుగ ద్వారా విడుదలవుతుంది.

* * *

సాంధీ అండ్ టి. పి. ఆర్. కంబైన్స్ యి... 11న ప్రారంభించే సాంఘిక చిత్రంలో శో...



'పాపం పసివాడు'లో నాగేష్, మాస్టర్ రాము, రంగారావు.

నాయకుడు. నాయిక పాత్రను వాణిశ్రీ పోషిస్తుంది. తాతినేని ప్రకాశరావు దర్శకుడు. నవయుగ విడుదల.

శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్ ఎంటర్‌ప్రైసెస్ వారి ప్రొడక్షన్ నెం. 2 లో శోభన్, కాంచన, ప్రేమ జంటగా కనిపిస్తారు. కె. ఎస్. ప్రకాశరావు దర్శకుడు. చమ్రియా విడుదల.

అన్నపూర్ణా సినీ ఎంటర్ ప్రైసెస్ ప్రారంభించనున్న చిత్రంలో శోభన్, శారదలు ప్రధాన పాత్రధారులు. పి. రాఘవ నిర్మించే యీ చిత్రానికి కె. విశ్వనాథ్ దర్శకుడు. విజయా విడుదల.

* * *

ఏ. వి. ఎమ్. ప్రొడక్షన్స్ నిర్మించే 'పుట్టినిల్లు— మెట్టినిల్లు' చిత్రంలో శోభన్ ప్రక్కన లక్ష్మి నాయికగా నటిస్తుంది. విజయా విడుదల చేసే యీ చిత్రానికి పట్టు దర్శకుడు.

జగ్గయ్య

సౌభాగ్య కళాచిత్రవారి ఈస్ట్‌మన్ కలర్‌చిత్రం 'శభాష్ పాపన్న'లో జగ్గయ్య ద్విపాత్రాభినయం చేశారు. విజయనిర్మల నాయికగా నటించింది. షహీద్‌లాల్ దర్శకుడు. లక్ష్మి ఫిలింస్ ద్వారా త్వరలో విడుదల అవుతుంది.

* * *

శశి ఆర్ట్ థియేటర్స్ వారి 'ప్రజా నాయకుడు' చిత్రంలో జగ్గయ్య నాయకుడి పాత్రను, 'షావుకారు' జానకి భర్తగా నటించారు. నటుడు నాగభూషణం సమర్పించే యీ చిత్రానికి వి. మధుసూదనరావు దర్శకుడు. నవయుగ విడుదల.

రామవిజేతా ఫిలింస్ నిర్మిస్తున్న 'రామరాజ్యం'లో జగ్గయ్య నాయకుడు. నాయికగా సావిత్రి నటిస్తుంది. కె. ఏ. ప్రభాకర్ తయారుచేసే యీ చిత్రానికి కె. బాబురావు దర్శకుడు. లక్ష్మి విడుదల.

* * *


శ్రీ సీతారామాంజనేయ ప్రొడక్షన్స్ వారి 'విందు కుటుంబం' రెండు సెట్లపై షూటింగు జరిగింది. జగ్గయ్య, జమున ప్రధాన జంటగా నటిస్తున్నారు. అమరా రామ సుబ్బారావు నిర్మించే యీ చిత్రానికి పి. సాంబశివరావు దర్శకుడు.

చలం

శ్రీ రమణ చిత్ర యింటర్నేషనల్ నిర్మిస్తున్న 'దేవుడమ్మ' షూటింగు చకచక సాగిపోతూంది. చలంతో జయలలిత నాయికగా నటిస్తూంది. చలం సమర్పిస్తున్న యీ చిత్రానికి కె. వి. నందన రావు దర్శకుడు. శ్రీ ఫిలింస్ రిలీజ్.

* *

సుందరం మూవీస్ 'ఊరికి వుపకారి' షూటింగు


కాల్షియం శాండోజ్ బిడ్డకు ఎందుకు
ఇవ్వాలో హేతువు లెన్ని?
బిడ్డ నోటిలో పళ్లన్ని
ఎముకలు, పళ్లు దృఢంగా పెరగాలంటే కాల్షియం ముఖ్యావసరం. అందువల్ల, పెద్దలకన్న పెరిగే పిల్లలకు రెట్టింపు కాల్షియం కావాలి. కాల్షియమును దేహమునకు తేలికగా లభింప చేస్తుంది కాల్షియం శాండోజ్. కమ్మని రాస్ప్‌బెరీ రుచి గలిగి, చప్పరించుటకనువైన బిళ్లల రూపంలో, పరిశుద్ధమైన కాల్షియమును లభింప చేస్తుంది కాల్షియం శాండోజ్.
రోజుకు 4-6 బిళ్లలు ఇస్తే చాలు. ఎముకలు, పళ్లు దృఢంగా పెరగటమేకాక విటమిన్లు సి, డి, B12 ప్రయోజనం కూడా లభిస్తుంది.
కాల్షియం ఉత్పత్తులలో, యావత్ప్రపంచంలో సిద్ధ హస్తులైన శాండోజ్ వారిచే అది తయారు చేయబడింది.
కాల్షియం-శాండోజ్®
SANDOZ
ప్రతి రోజు ప్రతి వారికి
పెరుగుదలకు కాల్షియం
కాల్షియం తీసుకున్న పిల్లలు కాల్షియం తీసుకోని వారి కన్న 4 నెలల్లో రెట్టింపు బరువు పెరిగారని, 1/4" ఎక్కువ పొడుగు ఎదిగారని శాస్త్రీయ పరిశోధన ఋజువు చేసింది.
dCP/CS/4f tel

సినిమా

పూర్తయింది. ఎం. ఎస్. రెడ్డి సమర్పిస్తున్న యీ చిత్రంలో చలం ప్రక్కన ఆరతి అనే క్రొత్త అమ్మాయి నాయికగా నటించింది. కె. ఎస్. ఆర్. దాస్ దర్శకుడు. విజయా విడుదల.

వాణిశ్రీ పుట్టినరోజు

ప్రముఖనటి వాణిశ్రీ ఆగస్టు 3 న పుట్టింది. పైగా యీ సంవత్సరం ఆమెకు మద్రాసు ఫిలిం ఫాన్స్‌వారు ఉత్తమనటి పట్టాన్ని, తెలుగు, తమిళ భాషల్లో యివ్వడం జరిగింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, తన యింట పాత్రికేయులకు షడ్రసోపేతమైన విందు నిచ్చింది.



'మరపురాని తల్లి'లో కృష్ణ, వాణిశ్రీ.

గీతాదత్ మరణం

జులై 20న, ఒక ప్రయివేటు నర్సింగ్‌హోంలో (బొంబాయి) ప్రముఖ నేపథ్య గాయని గీతాదత్ కాలేయంలో యేర్పడ్డ రణం కారణంగా మరణించారు. చనిపోయినప్పుడు ఆవిడ వయస్సు 49 సంవత్సరాలు.


ఈమెకు ఒక కుమార్తె, యిద్దరు కుమారులు వున్నారు. ఈమె జమిందారీ కుటుంబంలో పుట్టింది. తల్లిదండ్రులు పెట్టిన పేరు గీతారాయ్. ప్రముఖ దర్శకుడు గురుదత్తును పెండ్లాడింది. అప్పట్నుండి గీతాదత్తు అయింది.

గత 20 ఏండ్లలో ఈవిడ 6 వేల పాటలను పాడింది. ఇందులో 5 తెలుగు పాటలు కూడావున్నాయి.

—శ్రీనివాస్


విరహ తాపాన్ని తెచ్చింది దుర్వాసన!
COLGATE
DENTAL CREAM
కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో నోటి
దుర్వాసనను ఆపండి... రోజంతా
దంతక్షయాన్ని నివారించండి!
కాల్గేట్ 10 మందిలో 7 గురికి వెంటనే నోటి దుర్వాసనను నివారించినదని, భోజనము అయిన వెంటనే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొంటే ఎక్కువ దంత క్షయమును, ఎక్కువ మందికి అరికట్టినదని దంతశాస్త్ర చరిత్రలో పూర్వము ఎప్పుడూ ప్రకటించబడనట్లు శాస్త్ర పరీక్షలు నిరూపించేయి. ఎందుకంటే: కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో ఒకసారి పళ్లు తోముకొంటేనే 85% వరకు నోటి దుర్వాసన మరియు దంతక్షయమును కలిగించే సూక్ష్మ క్రిములు పోతాయి. ఎంత చక్కని పెప్పర్‌మెంట్ రుచి కూడ ఉంది—కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో రోజూ పళ్లు తోముకొనుటకు పిల్లలు ఇష్టపడతారు!
పూర్తి దంత రక్షణకు
కాల్గేట్ టూత్ బ్రష్
వాడండి
15 రకములలో ప్రతివారికి
అనువైనది లభించును.
శుభ్రమైన, తాజా శ్వాసకు మరియు తెల్లగా
మెరిసే పళ్లకు...
ఎక్కువ మంది జనులు ప్రపంచములో
ఏ యితర టూత్‌పేస్ట్ కంటే
కాల్గేట్‌నే కొంటారు!

"ప్రస్తుతం దేశానికి కావలసినది గుండె మార్పిడి కాదు"



డాక్టర్ కె. వెంకటేశ్వరరావు.

మన దేశంలోని జనాభాలో 80 శాతం పల్లె ప్రాంతాలలోనే ఉన్నది. ప్రజారోగ్యానికి సంబంధించిన ఏ పథకం అయినా పల్లెలలో నివసించే ప్రజలకి పూర్తిగా వినియోగ పడినప్పుడే అది ఫలప్రదం అయిందని చెప్పవచ్చు.

లక్ష మందికి ఒక డాక్టరు:

ప్రభుత్వం నెలకొల్పిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఒక్కొక్క దానికింద మొత్తం లక్ష జనాభా ఉంటుంది. అంటే వివిధ గ్రామాలు ఒకే కేంద్రం క్రిందికి వస్తాయి. ఆ కేంద్రంలో ఉండే డాక్టరు, ఇతర ఆరోగ్యశాఖకి సంబంధించిన ఉద్యోగులు ఇంతమందికి సహాయపడగలరన్నది పెద్ద విషయం. అసలు పల్లెప్రాంతాలలో పనిచెయ్యడానికి ఇష్టాన్ని, ఉత్సాహాన్ని చూపే డాక్టర్లు చాలా అరుదుగా ఉంటారు.

ఉత్సాహం ప్రతిభ ఉన్న డాక్టరు

అలా అరుదుగా కనిపించే వైద్యులలో ఒకరు డాక్టర్ కె. వెంకటేశ్వరరావు. ఆయన విజయవాడలో జన్మించారు. మదరాసులో విద్యాభ్యాసం చేశారు. కిల్పాక్ మెడికల్ కాలేజిలో మెరిట్ స్కాలర్‌షిప్‌తో చదివి, ఎం. బి., బి. ఎస్., పాసై అదే కాలేజిలో అనాటమీ ట్యూటర్‌గా మూడేళ్ళు పని చేశారు. ఉద్యోగం చేస్తూనే స్టాన్లీ మెడికల్ కాలేజిలో డి. సి. హెచ్., చేసి మదరాసు విశ్వవిద్యాలయంలో ప్రథములుగా ఉత్తీర్ణులైనారు. తర్వాత ప్రభుత్వోద్యోగానికి రాజీనామా యిచ్చి పల్లెప్రాంతాలలోని ప్రజలకి సేవచెయ్యాలనే సంకల్పంతో వాలంటరీ హెల్త్ సర్వీసెస్‌లో చేరారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకి వైద్య సహాయాన్ని, ఆరోగ్యానికి సంబంధించిన సూచనలని, సలహాలని యివ్వడానికి నెలకొల్పబడిన సంస్థ యిది. డాక్టర్ కె. ఎస్. సంజీవి దీనికి డైరెక్టరుగా ఉన్నారు. తమిళనాడు ప్రభుత్వం సహాయ సహకారాలని ఈ సంస్థకి అందిస్తున్నది. ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫామ్ సంస్థకూడా దీనికి సహాయపడుతున్నది.

గ్రామాల్లో వైద్యసహాయం

ఈ సంస్థ నిర్వహిస్తున్న పథకాలలో ఒక ముఖ్యమైన దానిని డాక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. ఈ పథకంలో డాక్టర్ రావు పర్యవేక్షణకింద పదిమంది డాక్టర్లు, 60 మంది ఆరోగ్యానికి సంబంధించిన యితర ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా ప్రతినిత్యం తమ విభాగంక్రింద ఉన్న గ్రామాలకి వెళ్ళి అక్కడ ప్రజలకి వైద్యసహాయం చేస్తూ ఉంటారు.

'ప్రస్తుతం మనదేశంలో ప్రజలకి ముఖ్యంగా కావల్సినది వ్యాధినిరోధం, పౌష్టికాహారలోపం లేకుండా ఉండటం కానీ గుండె మార్పిడి లాంటి అత్యాధునిక శస్త్ర వైద్య చికిత్సా విధానాలు కావు' అంటారు డాక్టర్ వెంకటేశ్వరరావు.

'పిల్లలకీ, గర్భవతులకీ, తల్లులకీ మంచి పౌష్టికాహారం అందేలా చూడటం, వ్యాధులు సోకకుండా రోగనిరోధక ఔషధాలు సమయానికి సమకూర్చడం జరిగితే మనం ఆరోగ్యం విషయంలో ఎంతో అభివృద్ధి సాధించినట్టే' అన్నారు డాక్టర్ రావు.

ప్రస్తుత అవసరం

వ్యాధినిరోధం పౌష్టికాహారంలోపంలేకుండా చూడటం, కుటుంబ నియంత్రణని అమలు పరచడంలో శ్రద్ధ తీసుకుని పౌష్టికాహార నిపుణుల్ని, లేబరేటరీ టెక్నీషియన్‌లన్నీ, పబ్లిక్ హెల్త్ నర్సులని తర్ఫీదు చెయ్యాల్సిన అవసరం ఎంతో ఉందని డాక్టర్ రావు అభిప్రాయం.

డాక్టర్ వెంకటేశ్వరరావు నిర్వహిస్తున్న ఈ పథకంలో ఒక్కొక్క విభాగంకింద 2000 కుటుంబాలు ఉంటాయి. ఒక్కో విభాగానికి ఒక్కో డాక్టరు, పౌష్టికాహార నిపుణుడు, పబ్లిక్ హెల్త్ నర్సు, లేబరేటరీ అసిస్టెంట్, ఆక్సిలరీ నర్సు మిడ్‌వైఫ్ ఉంటారు. ఈ విభాగాన్ని మినీప్రైమరీ హెల్త్ సెంటర్ అంటారు. ప్రభుత్వం వారి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకి సహాయంగా ఉండి వాటి బరువు బాధ్యతలని చాలా వరకూ తగ్గిస్తాయి యివి. ఇందులో వైద్య సహాయం పొందేవారు బీదవారైతే నెలకి ఒక కుటుంబానికి 50 పైసలు. మధ్య తరగతి వారైతే ఒకరూపాయి, ధనవంతు



పౌష్టికాహారం, కుటుంబనియంత్రణల గురించి గ్రామీణ స్త్రీలకి తెలియజెప్తున్న ఒక పౌష్టికాహార నిపుణురాలు

కైతే వారి సంవత్సర ఆదాయంలో నూటికి అర్ధరూపాయి వంతున చెల్లిస్తారు. రెండు వేల కుటుంబాలకీగల ఒక్కో మినీ ప్రైమరీ హెల్త్ సెంటర్ పల్లెప్రాంతాలలోని ప్రజలకి వైద్యసహాయాన్ని అందించడం, ఆరోగ్య రక్షణని గురించి వారికి తెలియజెప్పడం, సాధారణంగా ఒక్కోతరుణంలో వచ్చే వ్యాధులని నిరోధించడం చేస్తూ గ్రామీణ ఆరోగ్యాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నది.

తమిళనాడు ప్రభుత్వం ప్రోత్సహించి ఆదరిస్తున్నట్లే ఇలాంటి పథకాలని మన ప్రభుత్వంకూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

—ఎం. ఆర్.



సీరియల్

ఆకాశదీపాలు

పాలకోడేటి సత్యనారాయణరావు

జరిగిన కథ

కాలేజీ ఎలక్షనులో పోటీచేస్తుంది శారద. మోహనరావును ప్రేమిస్తుంది. తను వ్రాసిన కథ చదవమని శారదకు ఇస్తుంది తల్లి. రామచంద్రయ్య కూతురు ఇందిర రిటైర్డు జడ్జీగారబ్బాయి రాంబాబును ప్రేమిస్తుంది. ఇందిరతో స్నేహం తగ్గించుకోమని రాంబాబు తండ్రి చెప్తాడు. కానీ, అప్పటికే వాళ్ళిద్దరూ ఒకటయ్యారన్న సంగతి ఆయనకు తెలియదు.

4

ఆవేశమనేది ప్రపంచంలో ఉన్న చాల చాల చెడ్డగుణాలలో ఒకటి. ఆవేశమావహిస్తే చాలు, మనిషి తనలోని మానవత్వాన్ని చంపుకొని దానవుడిగ మారడానికి కూడ వెనుదీయడు — ఆ తర్వాత ఎంత పశ్చాత్తాపం చెందినా, చెందకపోయినా ఒకటే — అందుకే ఆవేశమనేది హద్దు దాటకూడదు — ఆవేశంలో తను చేసిన పని వల్ల ఎంతమంది మానసికంగ, ఎంతమంది శారీరకంగ, మరెంతమంది మరెన్నివిధాలుగ బాధపడ్డారో గ్రహించగలిగే — కనీసం యోచించుకోగలిగే — స్థోమత, శక్తి నిగూడ ఆవేశం హరిస్తుంది. అంతే! ఆ తర్వాత ఆకులు పట్టుకున్నా లాభం ఉండని స్థితి ఏర్పడుతుంది జీవితంలో.

ఖచ్చితంగ ఇందిరకు ఇదే అనిపించింది, సుందరి వచ్చి ఆమాట చెప్పాక — ఎంతపని చేశాడు రాంబాబు?

అయినా సుందరి చెప్పింది నిజమో కాదోననే సందేహం తనలో తనకే తెలియక ఒకపక్కనుండి తలెత్తుతుంటే — ప్రాణ స్నేహితురాలు ఏ విషయంలోనైనా — ముఖ్యంగ ఇలాటి విషయాలలో — పరాచికాలాడ గలిగే స్థితిలో ఉంటుందనుకోవడం తెలివితక్కువపని —

సుందరి తెల్లవారగనే వచ్చింది — తనింకా నిద్రనుండి లేవనైనా లేవలేదు — బద్ధకంగ పడుకొని ఉంది పక్కమీద, అది నిద్రా కాదు, పూర్తిగా లేచి ఉన్నట్టూ కాదు. అపుడు వినిపించింది సుందరిమాట — 'ఇందిరా' అంటూ.

అమ్మ ఏమంటుందో వినక్కర్లేదు — 'ఇంకా ఏడవ్వా కాలేదుగా సుందరీ — రాచబిడ్డకు మేలుకొలుపు పాడాలి ముందు —'

అమ్మ ఆవిధంగా అనడంలో తనపట్ల ఆప్యాయత గోచరిస్తుందేగానీ మరేవిధమైన భావనా కలగదు ఇందిరలో.

ఆ అవస్థలోనే నవ్వుకుంది ఇందిర అమ్మమాటలకు.

ఆ తర్వాత సుందరి వచ్చి లేపుతుంటే మెలకువ వచ్చింది — 'అబ్బ, ఏమిటే, తెల్లారకుండానే —'

'ఇందిరా — చూడు, రాంబాబు ఏం చేశాడో? —'

ఇందిర గతుక్కుమంది — రాంబాబు చేసింది సుందరికెలా తెలిసింది?

నిద్రమత్తు క్షణంలో విడిపోయింది — తనలో కలిగిన ఆ సంచలనాన్ని బహుకష్టం మీద ఆపుకుంటూ అంది ఇందిర: 'ఏం చేశాడేమిటే? —'

'ఏం చేశాడా? — ఈ నోటితోనే చెప్పమంటావా? —'

'అసలేం జరిగిందో చెప్పక...'

'ఇంట్లోంచి పారిపోయాడు —'

ఇందిర దీర్ఘంగ నిట్టూర్చింది.

'ఎవరూ? రాంబాబా? —'

'ఆ — మీ బాబ్జియే —' అంది సుందరి —

'నేను నమ్మను —'

'నమ్మకపోతే నీ ఖర్మ — కానీ అది మాత్రం నిజం —'

'ఒసే సుందరీ — కారణం ఏమిటే — ?'

'కారణమా...' సుందరి ఏదో అనబోయేసరికి సుమతి ఆగదిలోకి రావటంతో తక్కున ఆపేసింది.!

'ఏడయినా ఇంకా ఏమిటే ఈవడకా? లేస్తావా లేదా? — '

'ఉండవే అమ్మా, సుందరి ఏదో చెబుతోంటే...'

'సుందరికేం? ఎన్నయినా చెబుతుంది — సుందరీ. క్షణం ఆగమ్మా, దీన్నిలేచి కాస్త ముఖం కడుక్కోనీ! కాఫీతాగాక మీ ఇష్టం, మధ్యాహ్నందాక ఎన్నికబుర్లైనా సరే...'

సుందరి నవ్వింది — 'నేను చెబుతూనే ఉన్నానండీ, లేచి ముఖం కడుక్కో, అని!

అంటూ...'

'లేవటం లేదూ తంతేగా — నవ్వుతావేం పాచిముఖమా! లే—లేమరి!' అమ్మ ఆఖరికి బతిమాలే స్థితికి వచ్చేవరికి, దుప్పటి పక్కకు తోసి లేచింది ఇందిర.

'అమ్మా, కాస్త పక్క ఎత్తేస్తే...' ఇందిర మెల్లిగ అంది—

'ఊఁ, వెళ్లమ్మా—చెప్పాలేమిటి? రోజూ ఏదో ఎత్తేస్తున్నట్లు...'అంటూనే దుప్పటి మడత పెట్ట నారంభించింది సుమతి.

ఇందిర సుందరికేసి చూసి 'కూర్చోవే ఒక్కక్షణం—' అంటూ దొడ్లోకి వెళ్లింది.

దాదాపు అయిదు నిమిషాల తర్వాత—ఇందిర తిరిగి వచ్చింది. అమ్మ కాఫీ తెచ్చే లోపుంతవరకూ అక్కడే ఉండి, కాఫీ గ్లాసులు అందుకొని మళ్లీ గదిలోకి దారి తీసింది సుందరితో సహా.

'ఆ—ఇప్పుడు చెప్పు—' అంది ఇందిర.

'ఏమిటి?—'

'అదే, కారణం లేకుండానే రాంబాబు ఎందుకు వెళ్లిపోతాడు?—'

'కారణం లేదని ఎవరన్నారు?—' సుందరి అంది తీవ్రంగా.

'ఏమిటే—కారణం ఉందా? చెప్పు మరి!—'

'మా నాన్నను కొట్టేడు—'

'సుందరీ-' ఇందిర ఆశ్చర్యపోయింది — 'పొద్దున్నే అబద్ధాలెందుకే—'

'ఇక నీ ఇష్టం — నిజాన్ని నమ్మినా నమ్మకపోయినా అబద్ధం మాత్రం కాదు. తెలిసిందా?—బాబ్జీ మా నాన్నను కొట్టాడు—'


ఇందిర కొంతసేపు ఏమీ మాట్లాడ లేదు.

'ఎప్పుడు?—' చాలసేపు తర్వాత అడిగింది. ఆ అడగడంలో, తను ఎంతో ఉన్నతంగా భావించుకునే వ్యక్తి, హఠాత్తుగా అధఃపాతాళానికి వెళ్లిపోయాడని తెలిస్తే కలిగే బాధకు ప్రతిబింబం ఉంది!

'నిన్న రాత్రి—'

'ఎందుకు?—' నిర్జీవంగా అడిగింది ఇందిర.

'ఎందుకా?—నీకు ఏదో సాయం చేయ



పోదామనుకునేసరికి, ఇదీ...'

ఇందిరకేమీ అర్థం కాలేదు — వెంకటపంతులు తనకేదో సాయంచేయాలనుకోవటం ఏమిటి? దానికి రాంబాబుకు ఉన్న అభ్యంతరం ఏమిటి? — కొట్టాల్సినంత అగత్యం ఏమిటి?—ఏమీ తెలీటం లేదు ఇందిరకు.

'ఏమిటి సుందరీ, సరిగ చెప్పు ప్లీజ్ —'

'ఏముందే — ఏదో తెలిసినవాళ్ళు కదా, సాయం చేయాలనుకోవటం బుద్ధితక్కువని మా నాన్నకు తెలీలేదు. అందుకనే ఒక పాఠం నేర్చుకున్నాడు.' సుందరి నిష్ఠూరంగా అంది.

'నువ్వలా అంటే నేనేం చెప్పను?— అసలు ఏం జరిగిందో అర్థం కావటంలేదు నాకు. పైగా ఈ నిష్ఠూరాలు కూడా అయితే, ఇంక అడగక్కర్లేదు నా పరిస్థితి...' ఇందిరా అలాగే అంది.

'అదికాదే ఇందిరా — నువ్వు, రాంబాబు చాల చనువుగ ఉంటున్నారు గదా...'

ఇందిర మళ్ళీ గతుక్కుమంది —

'...అనకో—'

'అందుకని, ఈ చనువు చాల అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉందని, చనువు అరికట్టటం అవశ్యమనే దృష్టితో మా నాన్న మీ నాన్నగారితో చెప్పారుట—'

'ఏమనీ?—' ఇందిర ఆశ్చర్యపోయింది.

'ఏమనా?—ఊర్లో ఓ పదిమంది అనుకునే విషయం ఇది అని—బాబ్జీ, ఇందిరలు చాల చనువుతో ఉంటున్నారు. కొంచెం జాగ్రత్త అని చెప్పారుట — అంతే—' సుందరి ఆగిపోయింది.

అంతే!— చాలదా ఏం?

అయినా ఈ లోకానికి దిక్కులేదా! ఏ తనకే కావాలి? — ఏ ఇద్దరు కొంచెం చనువుగ తిరిగితే తనకేం. తిరగకపోతే తనకేం?

అయినా ఈ వెంకటపంతులుగారెందుకిలా చేయాలి?— పనిగట్టుకుని, మరీ— ఏదో చదరంగం ఆడుకొనేటందుకు వస్తాడనుకుంటోందిగానీ తను — ఇలాటి విషయాలు చెప్పటానికా రావటం?

పెద్దవాళ్ళసలు ఇలాటి విషయాలు చెప్పటానికి ఎందుకు సంకోచించరో అర్థం కాదు. ఈ విషయం చెబితే, ఎదుటివాళ్ళు ఏమనుకుంటారో, ఏం మనసులో బాధ


లావణ్యం చిందే రూపం కోసం
శ్రేష్ఠమైన టాల్క్—
బినేలా
బినేలా స్టార్‌డస్ట్ టాల్క్‌లో మత్తెక్కించే సుగంధం
ఉంది. రోజంతా వంటిని అంటి పెట్టుకుని ఉంటుంది.
తో మంచి సెంటు రాసుకున్నట్టుగా, బినేలా టాల్క్
వంటికి రాసుకుంటే అత్తరూ, సెంటూ రాసుకున్నట్టే.
బినేలా మీ లావణ్యాన్ని చిందించగల ఒకే ఒక టాల్క్.
Binella
బినేలా
స్టార్‌డస్ట్ టాల్క్
CBIT-1 TEL

ఆకాశ దీపాలు

పడతారో, ఆ తర్వాత వీటి పరిణామాలు ఎలా ఉంటాయో అనే విషయం బొత్తిగా పట్టించుకోక, సావకాశంగ వచ్చి, ఏదో ఉబుసుపోక కబుర్లు చెబుతున్నట్లు చెప్పి, ఎదురింట్లోవాళ్ళ మనసుల్లో అగ్ని గుండాలు వెదజల్లిపోవాలంటే అసలు వీళ్ళకు మనసెలా ఒప్పుతుంది?

అయినా—

తనగురించి తండ్రి ఏమనుకుంటాడో?

ఛ—

తన్ను ఏంతగ నమ్మకపోతే రాంబాబుతో అంత చనువుగ మసలనిస్తున్నారు? — అయినా కన్న తల్లితండ్రులకు తమ కూతురిని, కూతురి నడతను సరిదిద్దుకోమని మరొకరు ఇవ్వాల్సిన సలహా యేరా ఇది?—

ఈ పెద్దవాళ్ళకు ముసలితనం వచ్చే కొద్దీ బుద్ధి ఉండదన్నది, ఇదిగో, ఈ విషయంవల్ల స్పష్టంగా తెలిసిపోతోంది.

అందుకే—

వెంకవంతులు మళ్లీ ఇలాటిపని చేయకుండా బుద్ధిచెప్పి ఉంటాడు రాంబాబు— కానీ సుందరి రాంబాబు వెంకుపంతుల్ని కొట్టాడు, ఇంట్లోంచి పారిపోయాడని అంటోంది— ఛీ- ఛీ— ఇపుడందరికీ ఈ విషయం తెలిసిపోతుంది— ఖర్మ— అనుకొంది ఇందిర.

'నమ్ముతున్నావా ఇందిరా?—'

ఇందిర నమ్మలేదు— అందుకే మౌనంగ ఉండిపోయింది.

'ఎందుకు నమ్ముతావులే! —...'

చాల జాలిగ చూసింది సుందరికేసి ఇందిర.

'సుందరీ; ప్లీజ్ —...'

'కాదే, ఇందిరా— వీళ్ళిద్దరు అతి చనువుగ ఉన్నారు అందుకే ..' ఆగిపోయిన సుందరికేసి దీనంగ చూసింది ఇందిర, చెప్పమన్నట్లు.

'అందుకే, మీరనుకునేటట్లయితే పెళ్లి చేసేయండి, అని అందామనుకున్నారట మా నాన్న. కానీ ... ఒక్కొక్కసారి మనం మేలు తలపెట్టినా కీడే జరుగుతుంది. అందుకే అసలు మేలు తలపెట్టటం కూడ తప్పన్నమాట—...'

ఇందిర చాలసేపు మౌనంగ ఊరుకొంది. చాల ప్రయత్నంమీద అడిగింది చివరకు — 'ఇంతకూ పారిపోవట మెందుకూ?—'

'నువ్వొత్త ఫూల్‌వే— మానాన్న వయసెంత? బాబ్జీ వయసెంత? — మా నాన్నను కొట్టి, మళ్లీ ఆ మొఖాన్ని వాళ్ళ నాన్నకుగానీ, నాకుగానీ— ఆఖరికి, నీకైనా చూపించగలడనే నీ ఊహ? మొహం చెల్లక...'

ఇందిర బాధపడింది ఆ చెప్పే విధానానికి.

సుందరికేం తెలుసు? — తను బాబ్జీ ఏంచేసినా సమర్థిస్తుందని.

అది బహుశా తన తప్పుగాదేమో—

ప్రేమ గుడ్డిది అన్నారు ఎవరో ఎప్పుడో. ఎపుడన్నదోగానీ అదీ ఈమాటకి నిజం. లేకపోతే — లేకపోతే బాబ్జీ ఏంచేసినా తను ఎలా సమర్థించగలదు? బాబ్జీ చేసేది, చేసినది ఎంత తప్పు పనైనాగానీ, అందులోని మంచినిమా తమే — మంచనేది లేకపోయినా, కనీసం ఉన్నట్లనుకొని అయినా — గ్రహించగలుగుతోంది తను.

నిజమే—

రాంబాబు వెంకుపంతుల్ని కొట్టటం తప్పే!

కానీ—

నిజంగా రాంబాబు చేసింది తప్పా? అని మళ్లీ మరొకసారి ప్రశ్నించుకుంటే చాలు. రాంబాబు చేయటంలో తప్పులేదు సరిగదా, అతను చేసినది మంచేననిపిస్తోంది—

నిజమేమరి-వెంకుపంతులు పని కల్పించుకొని వచ్చి, రాంబాబుమీద, తనమీద పెద్దవాళ్లకి దురభిప్రాయాన్ని కలగజేసి వెళ్ళటం తప్పేగదా! తప్పు చేసినవాడు శిక్ష అనుభవించాలి — కానీ రాంబాబు వెంకుపంతుల్ని కొట్టకుండా ఉండాల్సింది.

'ఏమిటే ఆలోచిస్తున్నావు?—' అంది సుందరి,

'ఏముందే...' అందేకానీ ఇందిర ఆలోచిస్తున్నదేంతో ఉంది. ఆ సంగతి సుందరికీ తెలుసు.

ఎదుటివాళ్లు చెప్పేది అబద్ధమని మనకు స్పష్టంగ తెలిసినా, ఒక్కొక్కప్పుడు తప్పనిసరిగా, ఆ అబద్ధాన్ని నిజమనుకున్నట్లు నటించాలి. సుందరీ అదే

చేసింది.

'వెళతానే-' అంది సుందరి లేస్తూ—

'కూచో కాసేపు, ఇప్పుడే ఇంటికెళ్లి ఏం చేయాలి? —'

'ఏం చేయనక్కర్లేదనుకో—కానీ...'

'మరయితే కూచోవే—' ఇందిర బలవంతపెట్టటంతో సుందరి ఇంకేమీ అనకుండా కూర్చుంది.

చాలసేపు ఇద్దరికీ మాట్లాడటానికి విషయాలే లేకపోయాయి.

ఇంతవరకు జరిగిన సంగతి సుందరికి చెబుదామని ఉంది.

ఈ పరిస్థితిలో- అంటే సుందరి అప్పుడే నిజమైతే — రాంబాబు పారిపోయాడన్నది నిజమే అయితే — ఎలా?

ఏం చేయాలి?—

పైగా వెంకుపంతులు తన తండ్రికి చెప్పినదాన్నిబట్టి చూస్తే, తన తండ్రి ఇక తనకు వివాహం చేసేయ్యాలనుకొని, ఆ ప్రయత్నాలు చేసినా ఆశ్చర్యపడాల్సిన అవశ్యకత ఏం లేదు. ఒకవేళ అదే జరిగితే— ఎలా చెప్పాలి తన తండ్రికి?

రాంబాబుకు తన శరీరం — మనసుతో బాటుగనే— అంకితం చేసేసిందనీ, ఈ పరిస్థితిలో మరొకరిని వివాహం చేసుకోవాలనుకోవటం అపచారమే గాదు. అది అవతలి వ్యక్తికి తీరని అన్యాయం చేసినట్లవుతుందనీ, అంతఘోరమైన పాపం చేయడానికి తనకు మనస్కరించడం లేదని ... ఎలా చెప్పాలి?

కానీ; చెప్పకపోతే — తండ్రి తను ప్రయత్నం చేసి, ఏదైనా సంబంధంతెస్తే, అపుడు ఈ సంగతి చెప్పడం...


అందుకే అంత్యనిష్ఠూరంకన్న ఆది నిష్ఠూరమే మేలు అనిపించింది ఇందిరకు.

కానీ — ఈ విషయాన్ని తను స్వయంగ చెప్పటం ఎంత బావ్యంగ ఉంటుంది? తను చెప్పేదానికన్న ఈవిషయం సుందరి చెపితే, వాళ్ళు బాగా అర్థం చేసుకొనే అవకాశం ఉంటుంది. సుందరికి ఈ విషయం తన తల్లి దండ్రులకు చెప్పేధైర్యం, ఆ చనువు ఉందనే ఉన్నాయి. కాని ఈ విషయం చెప్పటానికి సుందరి పూనుకోవాలి—

కానీ—

సుందరిలో ఈ క్షణంలో రాంబాబు అంటే పగే ఉంటుంది కానీ—అతన్ని—

దేవాలయాలు బిచ్చగాళ్ళు



బులుసు వెంకటరమణయ్య — ధర్మపథం

దేవాలయాలకు వెళ్ళేవారికి దేవదర్శనానికి ముందు మార్గానికి రెండు ప్రక్కలా వరుసగా కూర్చున్న బిచ్చగాళ్ళ దర్శనం అవుతుంది. ఆ విధంగానే మసీదుల ముందుకూడా బిచ్చగాళ్ళు కాన వస్తారు. ఇది అందరికీ తెలుసును.

ఈమధ్య ఒక విప్లవకవితా సంకలనానికి ముందుమాట రాస్తూ ఒక సుప్రసిద్ధ కమ్యూనిస్టుకవి దేవుడు లేడని చెప్పడానికి దేవాలయాల ముందు వుండే బిచ్చగాళ్ళే ప్రబల సాక్ష్యమనీ. ఎప్పుడైతే దేవాలయాలు మ్యూజియాలుగా మారుతాయో —అంటే గుళ్ళలో వుండే దేవుళ్ళు పూజా నమస్కారాలు లేక బూజుపట్టిపోతారో అప్పుడే దేశంలోని దారిద్ర్యం నశిస్తుందని చెప్పారు. వారి ఊహ ఆయనకు సబబుగా తోచ వచ్చును. కాని చాలామందికి ఇది ఊహా భాస గానే తోస్తుంది.

మన చర్మచక్షువులకు కానరానంత మాత్రాన దేవుడు లేడని అనుకోవడం సరికాదు, వ్యయాపరహితుడైన పరాత్పరుని ఉనికిని మహామేధావులు ఎన్నడో సప్రమాణంగా నిర్ణయించారు. నమ్మనివాళ్ళవిపశ్చిమంచడం బ్రహ్మతరం కాదు. అది అలా ఉండనీండి. దేవాలయాల తలుపులు మూతపడితే దేశంలో దారిద్ర్యం నశిస్తుందనుకోవడం ఉత్త భ్రాంతి, అవిచార మూలం.

దేవునిపై నమ్మకం ఉన్నవాళ్ళు గుడులకు వెళ్తారు, అట్టివారికి పాప, పుణ్య, విచక్షణ, జీవకారుణ్యం ఉండడం సహజం. అందుచల్ల దేవాలయానికి వెళ్ళున్నప్పుడు బిచ్చగాళ్ళకు తమకు తోచినది యిస్తారు. భక్తుల యీ మనస్తత్వాన్ని కనిపెట్టే భిక్షకులు అక్కడ చేరుతారు. చీమలు బెల్లం వున్నచోట చేరుతాయిగాని, నిప్పు దగ్గిరికి వెళ్ళవు.

దేవాలయాలు ప్రజాసామాన్యానికే కాని దేవుడికోసం కాదు. దాని నిర్మాణంలోనూ, విగ్రహ శిల్పంలోనూ ఎందరో శిల్పులకు జీవనోపాధి కలుగుతుంది నైవేద్యం పెట్టిన ప్రసాదం ప్రజలే తింటున్నారు. దాన్ని సక్రమంగా నిర్వహించడంలో ఎన్నో కుటుంబాలు జీవిస్తున్నవి. గుడికి వచ్చే ఆదాయం వల్ల ఇతర సంస్థలకున్నూ ఎంతో ఉపకారం జరుగుతున్నది.

అవి మ్యూజియాలుగా మారితే ఆ మ్యూజియాల దగ్గర బిచ్చగాళ్ళు ఉండకపోవచ్చు. నిరుద్యోగుల సంఖ్య ఎక్కువయి; ఎందరో తిండికి లేక బాధపడడం జరుగుతుంది.

దేవాలయందగ్గరే కాదు. జీతాలిచ్చే రోజున ఫాక్టరీలదగ్గర వరుసలు తీరి బిచ్చగాళ్ళు కూర్చోవడం ఎన్నోచోట్ల ఉన్నది. శ్రమజీవులైన కార్మికులు ఋణమో, పణమో ఇచ్చి తృప్తిపరచడమున్నూ ఉన్నది.

దేవాలయాలు మూతపడితే దారిద్ర్యం దేశంలో నశిస్తుందని అనుకోవడంలో అర్థం లేదు. ●

ఆకాశ దీపాలు

అతనుచేసిన దాన్ని...

ఇది కేవలం అతనొక్కడివల్లే జరిగిందనుకోవటం ఆత్మవంచనే!

చేతులు రెండూ కలిస్తేనే చప్పట్లు అవుతాయనటం నిజం.

ఈ తప్పులో తన పాలు తనకూ ఉంది—

అందుకే—

ఇద్దరు సమష్టిగ ఈ తప్పు చేశారు; కానీ సుందరి ఈ విషయాన్ని తనతండ్రికి, తన తల్లికి చెపుతుందా అనేది సందేహం.

సుందరికేసి చూసింది ఇందిర.

దిగులుగా కూర్చుంది సుందరి ఏదో ఆలోచిస్తూ — ఏం ఆలోచిస్తుంటుంది — బాబ్జి ఇలా చేశాడు అని, అంతే!

'సుందరీ—'

సుందరి ఉలికిపడింది.

'పిలిచావా?—'

'మరే—'

'ఏమిటే?—'

ఇందిరకు భయం వేసింది — చెప్పాలనుకున్న విషయాన్ని ఎలా చెప్పాలో అర్థం కాలేదు తనకు. అందుకే మౌనంగా ఊరుకొంది.

'చెప్పవే—' అంది సుందరి.

'ఏంలేదు, ఏమిటాలోచిస్తున్నావ్?—' అంది ఇందిర తనకు చెప్పటానికేమీ లేనట్లు.

సుందరి ఏమీ మాట్లాడలేదు—క్షణం ఆగి లేచినిలబడింది 'ఇక నేను వెడతా' అంటూ.

ఇందిరా లేచి నిలబడింది — సుందరి ఇంట్లోకి వెళ్ళి సుమతిలో చెప్పింది వెడుతున్నానంటూ—

'అప్పట్నుంచి సుందరీ, ఆ సంగతేమయింది?—' అంది సుమతి సుందరితో.

ఇందిరకు గుండెలొక్కసారిగ ఆగిపోయాయి — సుందరి తన తల్లితో ఈ సంగతి చెప్పేసిందా?

'ఏం సంగతండీ?—'

'అదేనమ్మా — నిన్న మీ యింట్లో...'

'అదా. తర్వాత తెలియజేస్తామన్నారు—' అంది సుందరి.

ఇందిరకు అంతా అర్థమయింది!

8—9—72

'ఏమిటే అమ్మా అది?—' —అంటూ అడిగింది తల్లిని.

'నీకు చెప్పలేదే ఆ సంగతి సుందరి?—'

'అసలే సంగతో నువ్వు చెబితే, సుందరి చెప్పిందో లేదో చెబుతాను నేను—'

సుందరి నవ్వింది.

'అదేనే— సుందరిని చూడడానికి నిన్న పెళ్లివారు వచ్చారు—'

'ఛ— నా కసలు ఇది చెప్పనే లేదు చూశావమ్మా— నేనెక్కడ అతన్ని చూసి దిష్టి కొడతానో అని భయం దీనికి!'

'ఇందిరా, నా భయం అదికాదే— అతన్ని నువ్వెక్కడ ఎగరేసుకుపోతావో అని!' అంటూ నవ్వింది సుందరి.

'నిజమేనమ్మా — బాగ గుర్తు చేశావు. దీనికీ చూడాలి ఇంక —' అంది సుమతి తనకు సుందరి ఈ విషయం గుర్తుచేసే దాక గుర్తు లేనట్లు.

'ఇంకేమే, చాల?—' అంది సుందరి నవ్వుతూ.

'ఛ— ఊర్కోవే-'

'అది కాదండీ, మీరున్నారని ఇలా అంటోంది కానీ, రోజూ నాతో ఒకటే గొడవండీ — నాకు పెళ్లిచేయమని మా ఇంట్లో వాళ్లకు గుర్తుచెయ్యవే అని!' అంది సుందరి నవ్వుతూ.

'నీది మరీ చోద్యమే-' అంది సుమతి, తనూ నవ్వులో శ్రుతి కలుపుతూ.

'నేను వెడతానండీ మరి—' సుందరి కదిలింది.

వసారా దాటాక అంది సుందరే — 'సారీ ఇందూ, నిన్నటిదాక మాకే తెలీదు. అనుకోకుండా వారొస్తున్నట్లు తెలిసింది. నీదగ్గరకొచ్చి చెప్పేంత టైంకూడ లేక పోయింది—'

'పర్వాలేదులే — కనీసం పెళ్ళికైనా పిలిస్తే—' అంది ఇందిర నిష్ఠూరంగ.

'అపుడే అంతదూరం వెళ్ళకు— ఇందాక తమాషాకు అన్నానే మీ అమ్మగారితోటి — అంతేగానీ అతన్ని నువ్వెక్కడ ఎత్తుకు పోతావో అనే భయం లేదు—' అంది గట్టిగనే సుందరి— 'అయినా నీకు బాబ్జీ ఉన్నాడుగా?—' అంది ఏదో రహస్యం చెబుతున్నట్లుగ.

ఇందిర నవ్వింది.

'వెడతా మరి—'

'సుందరీ, మాట,'

'ఏమిటే మళ్లీ?—'

'సాయంత్రం గుడికెడదాం రావే —'

'రాలేను ఇందూ— ఇంట్లో పనుంటుంది—'

'ప్లీజ్ —నీకు అతి ముఖ్యమైన సంగతి చెప్పాలి—రాకపోతే నామీద ఒట్టు—' అంది ఇందిర బుంగమూతి పెడుతూ.

'వీలైతే వస్తా—'

'అదేం కుదరదు. ముందే చెబుతున్నాను—'

'సర్లే వస్తాను—' అంది సుందరి వెడుతూ.

సుందరి వెళిపోయాక గేటువేసి నెమ్మదిగా ఇంట్లోకి అడుగువేసింది'

(ఇంకా ఉంది)

ఒక వారం విపరీతం — శాలాక్షుడు

గోడ కూలి స్త్రీ మరణం

ఆగస్టు ఆరవ తేదీన మానేపల్లి అనే వూరుకు చెందిన కొలిమిపేటలో వో గుడిశ గోడవారగా యిద్దరు ముస్లిమ్ స్త్రీలు పడుకుని నిద్రపోతూంటే ఆ గుడిశగోడ కూలి వారిద్దరిమీదా పడ్డదట. ఆ పాటుకు యిద్దర్లో ఒకామె మాత్రం చనిపోయిందట.

లారీ కింద కానిస్టేబులు

నల్లగొండలో వో సినిమా హాలు ముందు నరసింహం అనే వో కానిస్టేబుల్‌ను వో లారీ (10వ తేదీ) గుద్దిందట. ఆయన అక్కడికక్కడే రక్తపు మడుగులో విలవిలా తన్నుకుని చనిపోయాడట.

అమ్మాయిల దొంగలు

కర్నూలు జిల్లాకు చెందిన వో వూరిలో వో 5 ఏళ్ళ అమ్మాయిని ఒకాయన ఎత్తుకుపోతూ పట్టుబడ్డాడట. కదిరూర్‌లో మరో వ్యక్తి కూడా యిదే పని చేస్తూ పట్టుబడ్డాడట.



జీతాలు లేని టీచర్లు

తాడిపత్రి మునిసిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు గత ఏప్రిల్ నెలనుంచి జీతపురాళ్ళు ముట్టనే లేదట. జీతాలొచ్చినా వచ్చేజీతాలను నొల్లలేని వారికి ఆ జీతాలే రాకపోతే ఎలాగ! ఆగస్టు 15 నుంచి ఆ ఉపాధ్యాయులు నిరాహారదీక్ష ప్రారంభించాలని నిర్ణయించుకున్నారట.

దైవోపహతుడు

కావేరిపట్టణానికి చెందిన ధర్మనీతి అనే గ్రామ పంచాయతీ ప్రెసిడెంటుగారబ్బాయి మోహన్ ఓచ్చేరి అనే వూరికి సినిమా చూడ్డానికెళ్ళి హాలు ముందు నించునుండగా వో లారీవచ్చి, అతన్ని గుద్దిందట. మోహన్ నలిగి, నచ్చడై చనిపోయాడట —మరణం మనని వెతుక్కుంటూ రాదని మనమే వెతుక్కుంటూ దానివద్దకు వెళ్తామనీ చెప్పలేటారు —ఇదే!

దొంగ చుట్టాలు

బొంబాయి శాంతాక్రజ్‌లో వున్న వీరేంద్ర కుమార్ అనే సినిమానటుని యింటికి వో యిద్దరు సిక్కులు ఆయన లేనప్పుడు వెళ్ళి, వంటరిగా వున్న ఆయన భార్యతో, చెల్లెలుతో తాము వీరేంద్ర కుమార్ స్నేహితులమని చెప్పారట. వారికి ఆ యిద్దరాడవారూ అతిథి మర్యాద చెయ్యబోయేలోగానే ఆ సిక్కులు కత్తులు చూపి, వారిని బయపెట్టి, రెడరెక్కలు విరిచికట్టి, నోట్లో గుడ్డలు కుక్కి, ఇల్లంతా భీభత్సం చేసి, చేతికందిన నగానట్రా నగదు పట్టుకుపోయారట. పోతూ పోతూ బయట తలుపు తాళంవేసి మరీపోయారట. ఆనక పోస్టుమాన్ వచ్చి, యిల్లు తాళం వేసుండడం చూసి, వుత్తరాలు కిటికీలోంచి వైబోయేసరికి లోపల వెల్లాచెదురుగా వున్న వస్తువులూ అవీ కనుపించాయట. అతనెళ్ళి పోలీసులను పిలిస్తే, వారొచ్చి (యీకేసు) విచారిస్తున్నారట.

టిక్కెట్టు లేకుండా విమానయానం

మే 27వ తేదీన కలకత్తా బొంబాయి కారవెళ్లే విమానంలో టిక్కెట్టులేని ప్రయాణికులు ఇద్దరు దొరికారట. అనగా టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసే వారి శక్తిసామర్థ్యాలు భువి నుండి దివికికూడా పెరాయన్నమాట.



చిల్లుపడిన గుండె

తిరుచ్చి రేడియో స్టేషనులో పనిచేస్తున్న నాగరాజు అనే ఆయన కూతురు 15 ఏళ్ళ ఉషకు అస్తమానూ కాళ్ళూ, చేతులూ దిగలాగడం, లేవలేకపోడం జరుగుతుంటే, ఆమెను వేలూరు సి.యమ్.సి. ఆసుపత్రిలో చేర్చారట. డాక్టర్లు ఆమెను పరీక్షించి ఆమె గుండెలో చిల్లు పడిందనీ, దానివల్ల చెడు రక్తం మంచి రక్తం కలిసిపోతున్నాయని కనుక్కొని, ఆపరేషనుచేసి, ఆ గుండె చిల్లును నైలాను గుడ్డతో మూసి, కుట్టి, ఆ ఆపరేషనును జయప్రదంగా ముగించారట.

షేవింగ్‌కి చిట్కా!

లేచీలేవడంతోనే కొందరు తీరుబడిగా కూర్చుని గడ్డం గీసుకోడం (పురుషులే) ప్రారంభిస్తారని, కానీ యిది తప్పని, అలాగాకుండా కాస్త ఆలస్యంగా



కనుక గడ్డం గీసుకుంటే అంత నొప్పి ఉండదు ప్రత్యేకంగా చెరగకని వో బ్రిటిష్‌మెడికల్ జర్నల్ అభిప్రాయ పడ్డది. నిద్ర లేవాక, నో గంటలపాటు కాలంలోనే ముఖంపై వెంట్రుకలు చాలా తీవ్రంగా పెరుగుతాయని, ఆపైన వాటి తీవ్రత తగ్గిపోతుందని ఆ పత్రిక అన్నదట. కనుక తీవ్రత తగ్గాక గడ్డంగీసుకుంటే సుఖం అని అన్నదమ్మ పత్రిక. లేస్తూనే నిద్దర పక్కనుంచే ఆఫీసుకు పరిగెత్తే వారు ఏం చేయాలి— రేజరు, సెబ్బు ఆఫీసుకు పట్టుకెళ్ళాలా!

కూలిపోయిన విమానం

బొంబాయి నుంచి ఇండోర్, గ్వాలియర్, భోపాల్ మీదుగా ఢిల్లీ పోవాల్సిన ఓ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫకర్ విమానం 11వ తేదీరాత్రి పాలం విమానాశ్రయం ప్రాంతంలో కూలిపోయిందట. ఆ విమానంలో 14 మంది ప్రయాణీకులు, నలుగురు విమాన దళం వారూ వున్నారట.

పి హెచ్ డి గార్డులు

రైల్వేగార్డులలో పి.హెచ్.డి., చదివిన వారు కూడా వున్నట్లు బొంబాయి వెల్లడించింది. 18 వేల మంది గార్డులలో 8 వేల మందికి పైగా పట్టభద్రులున్నారట. అంతేగాక, 'మాలో యల్.యల్. యం. చదివిన వారుకూడా వున్నారోచ్' అని ఆలిండియా గార్డుల కౌన్సిలు యల్. యం. సింగ్వె అన్నారట.

చప్పట్లు కొట్టడంలో రికార్డు

ఇల్లినాయస్‌లో స్ట్యువర్ట్ (స్కెచర్ అనే అతనూ, అతని స్నేహితుడు 12 ఏళ్ళ (కెయిగ్‌కారల్‌సన్ అనే అతనూ కలిసి ఏక బిగిన 18 గంటలు చప్పట్లు కొట్టి ప్రపంచ రికార్డు స్థాపించారట. ఈ ఈ యిద్దరు స్నేహితులు తమ ఇళ్ళముందు నించుని నిముషానికి 140 చప్పట్లు చొప్పున 10 వతేదీన వుదయం 9.01కి ప్రారంభించి, రాత్రి 3.01 కి ఆపారట.

హోటెల్లో ఆరు శవాలు

బొంబాయిలో ఓ హోటలులోని ఓ రూములో ఆరు శవాలు దొరికాయట. భార్యా, భర్తా, 25, 25 ఏళ్ళ యిద్దరు కొడుకులు, 17, 14 ఏళ్ళ కూతుళ్ళు—అంతా చనిపోయి వున్నారట. ఆ కుటుంబపెద్ద, తన పేరు రాజ్ అనీ, నరసారావు పేట నుంచి వచ్చినట్టు హోటలు రిజిస్టర్లో రాశాడట.

పందేలకి దిగిన బస్సులు!

విజయవాడలో గోరీలదొడ్డి ప్రాంతం ఏలూరు రోడ్డువిూద నెం. 14, నెం. 1 సిటీ బస్సులు సరదాపడి పందెంలో దిగాయట. ఈ పందెంలో నెం. 14 కు బ్రేకులు ఫెయిలయిన కారణాన్న అది ఓ ఎలక్ట్రిక్ స్తంభానికి గుద్దుకుందట. ఈ మధ్యలో ఓ 18 ఏళ్ళ అన్వర్ భాషా అనే యువకుడిని ఆ బస్సు తన క్రిందకు లాక్కుని చితక్కగా నలిపి, చంపేసిందట. ●

అవీ — ఇవీ . . .

ఏకాంకిల పోటీలు

మదరాసు చెన్నపురి ఆంధ్ర మహాసభవారు తెలుగులో ఏకాంకికల పోటీలని నిర్వహిస్తారు. ఈ పోటీలు అక్టోబరు 2 వ వారంలో జరుగుతాయి. ఈ పోటీలలో నగరంలోని, ఇతర ప్రాంతాల సంస్థలు పాల్గొన వచ్చు. వివరాలకి గౌరవ కార్యదర్శి, చెన్నపురి ఆంధ్ర మహాసభ, నీ. పి. హాల్ రోడ్డు, మదరాసు—3 కి రాయాలి. ●

ఆంధ్రసచిత్రవారపత్రిక

డిటెక్టివ్ నవలల పోటీ!

ఉత్తమ రచనకి

రు. 1,116 బహుమతి

డిటెక్టివ్ నవలా రచయిత(త్రు)లకి మంచి అవకాశాన్ని, ప్రోత్సాహాన్ని కలిగించడానికి ఈపోటీ నిర్వహిస్తున్నాము. పోటీలో ఉత్తమ నవలగా ఎన్నికైన రచనకి రు. 1,116 లు బహుమతి యిస్తాము. రచయిత(త్రు)లందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని పోటీలో పాల్గొని దీనిని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

నిబంధనలు

1. పోటీకి పంపే నవలలు 75 అరతావు (ఎక్సర్‌సైజు నోట్‌బుక్ పేజీకి రెట్టింపు) పేజీలకి మించి ఉండరాదు. కాగితానికి ఒకవైపునే సిరాతో రాయాలి.

2. రచనలు వాస్తవానికి దగ్గరగా ఉండి, తెలుగుదనం నిండి ఉండాలి. స్వంతరచనలు తప్ప అనువాదాలు, అనుసరణలు అయి ఉండకూడదు. ఇంతకుముందు ప్రచురణ అయి ఉండకూడదు.

3. నవల తమ స్వంత రచనేనని దేనికీ అనుసరణకాని, అనువాదం కాని కాదని రచయిత(త్రి) హామీ రాసి పంపాలి. ఈ హామీలు నవల వ్రాత ప్రతిమీదే రాసి ఉండాలి. హామీలేని రచనలు పోటీకి అంగీకరింపబడవు.

4. నవల వ్రాతప్రతిమీద, కవరుమీద, 'డిటెక్టివ్ నవలలపోటీకి' అని స్పష్టంగా రాయాలి. రచయిత (త్రి) పేరు, చిరునామా కూడా వ్రాతప్రతిమీద స్పష్టంగా రాయాలి.

5. రచనలని 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టి స్ట్రీట్, మదరాసు—1కి' పంపాలి. వ్యక్తులపేర పంపరాదు.

6. ఉత్తమ రచనకి సంబంధించిన తుది నిర్ణయం ఆంధ్ర సచిత్ర వారపత్రిక సంపాదకునిదే. ఈ విషయమై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపడానికి వీలులేదు. పోటీకి సంబంధించిన ఏ విషయం గురించీ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం లేదు.

7. బహుమతి పొందని నవలల వ్రాత ప్రతులని మేమే తిప్పి పంపే ఏర్పాటు చేస్తాము. కాని వాటివిషయంలో మేము ఎలాంటి బాధ్యతనీ స్వీకరింపలేము. రచయిత(త్రు)లు తమరచనలతో పాటు, తగినన్ని స్టాంపులు అతికించిన స్వంత చిరునామా కల కవర్ని జతపరచనవసరం లేదు.


8. పోటీకి గడువు తేదీ 30—9—1972. ఆ తర్వాత మా కార్యాలయం చేరిన రచనలని పరిశీలించడం జరుగదు.

9. పోటీలో బహుమతి పొందిన డిటెక్టివ్ నవల ప్రచురణ 1973 సంక్రాంతి సంచికలో ప్రారంభిస్తాము.

ముగింపు తేదీ 30-9-1972

రచయిత(త్రు)లందరూ మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చెయ్యవలసిందిగా కోరుతున్నాము.

అసమర్థుడు



కుమారి ఆలేటి నాగమణి

'బస్సు గంట లేటు' ఈ వార్త వినడంతోనే నేను 'హతోస్మి...వెళ్ళిన పని అయినట్టే' అని అనుకుంటూ, బంగా బస్సు షెల్టరుకు కొంచెం దూరంలో వున్న బెంచి మీద కూర్చున్నాను.

'కాఫీ తీసుకుంటున్నారా బాబూ ?' అంటూ వచ్చాడు హోటల్ కుర్రాడు.

'ఇప్పుడే వద్దు.' అంటూ చేతిలోని పేపరు విప్పాను.

'ఇంత ప్రొద్దున్నే ఎక్కడికిరా ?' అంటూ వచ్చాడు చక్రం. వాణ్ణి చూస్తూనే గతుక్కుమంటూ, వెంటనే సమాధానం చెప్పలేదు, నేను. అంత ప్రొద్దున నేనెక్కడికో అని అడిగే వీడు. నాకెందుకు తటస్థ పడ్డాడా ? అన్పించింది. నిజం చెప్పొద్దూ ...చిరాకేసి వాడి మీద బోల్డంత కోపం వచ్చింది. కాని నా కోపం కాదు గదా చిరాకును సైతం వాడి ముందు ప్రదర్శించే ధైర్యం, కనీసం నాకు చిరాకేసిందన్న సత్యం వాడు గ్రహించేలా చేసే తెగువ నలో లేవు. అందుకే మౌనంగా వుండిపోయాను.

'నువ్వేమిటి ఇలా వచ్చావ్ ?' అన్నాను. 'ఎందుకొచ్చావ్' అని అడగలేక.

'నీ కోసమే!' అన్నాడు తక్కున. గతుక్కుమన్నాను నేను. నేను పట్నం వెడుతున్నట్లు వీడికెలా తెలిసింది ? సరాసరి బస్సు స్టేజీకే వచ్చేసాడు. అంతగా నాతో అవసరం ఏమిటి వీడికి ? యింటికి వెళ్ళి అడిగాడేమో!! ఇంత ప్రొద్దున వెళ్ళి వుంటాడా ? అయినా బస్సు టైము దాటిపోయిందిగా! లేటయింది కాబట్టి తాను కనిపించాడు...బస్సు లేటవుతుందని వీడికెలా తెలుసు ? అని అనుకుంటూ—

'నా కోసమా ?' అన్నాను ఆశ్చర్యపోతున్నట్లు.

'ఊఁ...'

'ఎందుకు ?'

'ఎందుకేమిటి ? కలుసుకోవాలని. కలుసుకొని—చూడాలని. చూసి—మాట్లాడాలని. మాట్లాడి'...అంటూ నా ప్రక్కనే కూర్చున్నాడు. వాడి వాలకం చూసి, బహుశా అప్పు కావాలేమో...అనుకున్నాను.

'నే నిక్కడున్నానని ఎవరు చెప్పార్రా ?' అన్నాను. నా ప్రశ్నకు వాడు పక పకా నవ్వేసాడు. ఎందుకు నవ్వాడో అర్థం కాక తెల్లబోయి చూసాను.

'నా కళ్ళు...కాకపోతే ఏమిటూ వెధవ ప్రశ్న ? వెధవ అనుమానం ?' అన్నాడు. వాడి వైపు క్షణంసేపు చూసి తల త్రిప్పేసుకున్నాను.

'ఇంటాకా నువ్వు మా యింటి ముందు

ించి రాలేదూ ?' అన్నాడు.

'ఊహూఁ'... అన్నాను. తల అడ్డంగా ఆడిస్తూ.

'నిజంగా...'

'ఊఁ.'

'ఓహో...నే నిందాక నిద్ర లేచి కిటికీలో నుండి బయటకు చూసానురా! అచ్చం నీలాగే...ఎవరో వెడుతుంటే...నువ్వే వను కున్నాను.' అంటూ నవ్వాడు. 'ఏడ్వలేక పోయావ్' అని అనాలనిపించి ఆగిపోయాను.

'ఇంతకి ఎక్కడికి ప్రయాణం ?' వాడి ప్రశ్నకు మరోసారి ఉలిక్కిపడుతూ,

'హైద్రాబాద్‌కు వెడుతున్నారా,' అన్నాను.

'ఎందుకూ ?' వాడి ప్రశ్నకు సమాధానం చెప్పడం నాకు ససేమిరా యిష్టం లేదు. అందుకే 'కాస్త పనుందిరా' అన్నాను క్లుప్తంగా.


'మళ్లీ ఎప్పుడు వస్తావ్ ?'

'రేపు సాయంత్రం వరకు వచ్చేస్తారా' అంటూ, వాడి మొహంలోకి చూసి 'ఏం ?' అన్నాను. రెండు నిమిషాలు వాడు మౌనంగా వుండిపోయాడు. [illegible] తరువాత జేబులు తడుముకొని, హఠాత్తుగా 'పద నేను వస్తున్నాను' అన్నాడు.

'గో...విందా!' అనుకున్నాను మనసులో. వాడు నా వెంట రావడం నాకు బొత్తిగా యిష్టం లేదు. 'ఎందుకు ?' అన్నాను అసహనాన్ని అణచుకుంటూ.'

'కాస్త పనుంది' అంటూ, నా ప్రశ్నకు సమాధానం, నేను చెప్పినట్టే చెప్పి హోటల్ వైపు లాక్కెళ్ళాడు 'టిఫిన్ చేద్దాం పద' అంటూ. బిల్లు వాడే చెల్లించాడు. మళ్ళీ వచ్చి బెంచి మీదే కూర్చున్నాం.

'వారం రోజులుగా వెళ్దామనుకుంటు



everest/364a/ACW Tel

స్నారా హైదరాబాద్ వెళ్ళాలని. వీలు కాలేదు. ఇవాళ్టికి కాని' అంటూ ఆలోచన్లో మునిగి పోయాడు.

ఇంతకు వాడికి పట్నంలో పనేమిటో నాకు తెలియదు. అడగాలని వుంది. కాని వాడు మళ్ళీ అదే ప్రశ్న అడిగితే నేను జవాబు చెప్పలేను. అందుకే నేనేమి అడగ లేదు. మౌనంగా వున్న నన్ను చూసి, 'మాట్లాడవేంరా ?' అన్నాడు.

'బస్సు గంట లేటు'—అన్నాను నేను. నా మాటలకు వాడు నవ్వి, 'నాకు తెలుసు లేరా ఆ సంగతి. హైదరాబాద్ కెందు కేమిటి ?' అన్నాడు. నేను వాడి ప్రశ్న విన నట్టు పేపరు విప్పాను.

'ఎందుకో గాని చలంవేసే ఆ ప్రశ్నకు

అసమర్థుడు

నాకు సమాధానం చెప్పాలనిపించలేదు. చెబితే నాకు వచ్చే నష్టం ఏం లేదు కాని... నన్ను నేనే కించపరచుకున్నట్టుగా ఫీలయ్యి, అసమర్థుడిగా తల వాల్చాల్సి వస్తుంది. చలం నవ్వితే—వాడి నవ్వు. నాకు భయాన్ని పెంచుతుంది ...ఏమిటో పిరికివాడిలా నిలే స్తుంది.

చలం, నేను బి. ఏ. లో క్లాస్‌మేట్సం. వాడు క్లాస్‌మెట్ అయినా వాడితో నాకంత పరిచయం లేదు. స్నేహం అంతకన్నా వుండేది కాదు. ఒకే ఊరివాళ్ళం, మా మధ్య స్నేహం, పరిచయం పెరగకపోవటం ఆశ్చర్యమే !

హాస్టల్‌లో కూడా వాడు క్రింది గదిలో, నేను మేడపైని గదిలో వుండేవాళ్ళం. అయితే మా మధ్య స్నేహం పెరగటానికి అదేమంత పెద్ద అడ్డుగోడ కాదు. కాని వాడంటే మొదటినుండి నాకంత ఇష్టంగా వుండేది కాదు. ముఖ్యంగా వాడితో స్నేహం పెంచుకోవడం, నాకే ఇష్టంగా వుండేది కాదు. అందుకే వాడు పలకరించినా ముభావంగా సమాధానాలు చెప్పేవాణ్ని. దానిక్కారణం చలం వొట్టి రౌడీనేధనని. కాలేజి ఎగేసి తిరిగే రకమని కాదు, నేనో బుద్ధిమంతుడినని, రెగ్యులర్‌గా కాలేజికి వెళ్ళే వాడినని కాదు, వాడంటే నాకు భయం అంతే—

చలం చాలా బుద్ధిమంతుడు. తెలివిగల వాడు. ఈ మాట నేనే కాదు; ఇటు కాలేజిలో, అటు హాస్టల్‌లో, ఇంటిదగ్గర తల్లి, స్నేహితులు అనుకునేవారు. అందరిలో వాడికున్న మంచిపేరు అంతా ఇంతని కాదు.

పోతే— చలానికున్న చురుకుతనం, తెలివి చలాకీతనం వగైరాలు నాకులేవు. నిజంగా వాడిగురించి చెప్పాలంటే చాలా వుంది. ప్రతి విషయంలో చలానికి, నాకు చాలా తేడా వుంది. క్లాసులో పుస్తకాల్లోని పాఠాల నుండి, ఆటలవరకు, అటు డిబేట్సులో, ఇటు అమ్మాయిల పరిచయాలు మొదలుకొని స్నేహంవరకు వాడికున్న తెలివి, చొరవ, అపారం. అటు కాలేజీలో, ఇటు హాస్టల్‌లో వాడిపేరు తెలియని స్టూడెంటులేడు. ఇక లెక్చరర్ల సంగతి చెప్పొద్దు. చలం చదివేది బి. ఏనే అయినా, అటు సైన్సు లెక్చరర్లందరికి వీడు తెలుసు. వాడంటే మంచి అభిప్రాయం ఇష్టంకూడా.

నా గురించి చెప్పాలంటే ఏం లేదు. నాలుగేళ్ళు కాలేజిలో చదివినా, నలుగురికైనా నా పేరు తెలుసో తెలియదో నాకు తెలియదు. ప్రతిసారి అత్తెసరు మార్కులతో ప్యాసయ్యేవాణ్ని. నాలో చెప్పుకోదగ్గ ప్రత్యేకత.. వొట్టి పిరికితనం మాత్రమే. అంతే—

ఈ పిరికితనమే ఫైనలియర్‌లో వుండగా నా ప్రాణం మీదకెంత పనిచేసింది. సమయానికి చలం ఆదుకున్నాడనే చెప్పాలి మరి. ఆ తరువాత మామధ్య 'ఒరే' అనుకునేలా సన్నిహితత్వం ఏర్పడింది. అయితే — అది కేవలం మాటలవరకే వుండిపోయింది నాలో.

భారతీయ చిత్రకారులు


రచన, చిత్రాలు: కాళిపు సోమరాజు

శ్యావక్ష చావడా (జననం 1914)

శ్యావక్ష ధాన్జీభాయీ చావడా ఒకానొక మధ్యతరగతి కుటుంబంలో జన్మించేరు. బొంబాయి, లండన్, ప్యారిస్‌లలో చిత్రకళాభ్యాసం చేసేరు.

నృత్యభంగిమలో వీరు చిత్రించిన నర్తకిని చూసి వీరిపై ఫ్రెంచి చిత్రకారుడైన లాత్రెక్ ప్రభావం ఉందనే అభిప్రాయం చాలామంది చిత్రకారులకు కలిగింది. కాని వీరు తమ ప్రత్యేకతను సాధికారంగా నిలబెట్టుకొన్నారు. అయితే ఒక్కవిషయం మాత్రం నిజం. వీరు కూడా లాత్రిక్‌లాగే నృత్య స్కెచ్‌లు చాలా గీసేరు.

రష్యాలో ప్రసిద్ధ చిత్రకారుడైన బొఖ్త శిష్యుడు పోలిన్‌తో కలిసి కొన్నాళ్ళు వీరు అధ్యయనం చేసేరు.



ఈనాడు వీరి చిత్రాల్ని చూసి చిత్రకారులు ఈర్ష్య పడతారు. అదే వీరి చిత్రకళా ప్రతిభకు నిదర్శనం. వీరి రేఖలలో లయ, స్పందన, ప్రాణం ఉంటాయి.

వింధ్యకెరటే అనాటి సరిహాటనతో, చలం అంటే నాకు గౌరవంతోపాటు మరి కాస్త భయం, పెరిగిపోయాయి.

సుజాతఅంటే నాకు చచ్చేంతఇష్టం. మీరు ప్రేమ అని అనుకుంటే నాకేం అభ్యంతరం లేదు. నేనుమాత్రం ప్రేమ అని అనను. విషయం తెలిస్తే మీరు అనరేమొ. సుజాత అంటే నాకు ప్రేమే అయితే పెళ్ళిచేసుకునే వాణ్ణి. కాని నేను చేసుకోలేదు మరి. అందుకే అంటున్నాను ఆవిడంటే నాకిష్టం. అంతే —ఈ విషయం నాకు తప్ప మరెవ్వరికి తెలీదు. సుజాత అందంగా వుండదు. సామాన్యంగా వుంటుంది. ప్రత్యేకంగా ఆమెలో నన్ను ఆకర్షించింది ఆమె మూగస్వభావం. ఎవ్వరితో ఎక్కువ మాట్లాడేది కాదు. ఎప్పుడో కాని నవ్వేదికాదు. కాని ... చాలా తెలివిగల అమ్మాయి. టర్మ్ పరీక్షలన్నిటిలో చలం తరువాత మంచిమార్కులు సంపాదించేది ఒక్క సుజాతే. వాళ్ళ మార్కులు చూస్తుంటే బహుశా ఇద్దరు పోటీపడి చదువుతారేమొ అన్పించేది.

సుజాత అంటే నాకు మరీ ఇష్టం కావడానికి మరోకారణం ఏమిటంటే — సుజాత ఎప్పుడూ మల్లెపువ్వులాంటి తెల్లటి బట్టలు కట్టుకునేది. అయితే 'టినోపాల్ సుందరి' అని పిలిచేవారంతా. అయినా సుజాత పట్టించుకునేదికాదు. బి. ఏ లో మూడుసంవత్సరాలు ఆవిడను ఎప్పుడూ తెల్లటి బట్టలలోనే చూశాను నేను.

'పోనీ...వేరే రంగువి వేసుకోరాదూ?' అని అనాలనిపించేది నాకు. కాని సుజాత ఎవ్వరితో మాట్లాడేదికాదు. ఎప్పుడైనా మాట్లాడినట్టు కనిపిస్తే ప్రక్కనే కూర్చున్న అరుణ, అమలతో.

ఓసారి చలంతో మాట్లాడ్డం చూసిన నేను, చొరవగా, చలంతో, 'ఆవిడలా తెల్ల బట్టలు వేసుకు రాకపోతేనేం?' అన్నాను.

'ఏం?' అన్నాడు చలం నావంక అర్థం కానట్టు చూస్తూ.

'అందరు ఆవిడ్ని అంటుంటారుకదూ!' అన్నాను కొంచెం బాధగా.

'ఆవిడకు లేని బాధ నీకెందుకు? అయినా ఆవిడ ఇష్టం ఆవిడది. ఎవరో ఏదో అన్నారని, తెల్లబట్టలు కట్టుకోవటం మానాలా?' అన్నాడు నవ్వుతూ.

'అది కాదు చలం! అందరు అలా అనుకుంటుంటే బావుండదుకదూ!' అన్నాను నసుగుతూ.

కొన్ని సామాన్య వ్యాధులకు పథ్యాపథ్యములు

కామిల రోగులకు

కండ్లు, శరీరం పసుపుపచ్చ లేక ఆకు పచ్చ వర్ణము కలిగి తంద్ర, అగ్నిమాంద్యం, నీరసం మొదలగు లక్షణాలు కలిగి ఉండే రోగానికి 'కామెల' 'జాండిస్' లేక 'కామెర్ల' రోగమని అంటారు.

పథ్యములు.— ఈ వ్యాధి గల వారు మంచి పాత బియ్యపు అన్నం, గోధుమ అన్నం బార్లీ అన్నం తినవచ్చును కంది, పెసర, మసర వీని పప్పుల, — కట్టు అన్నంలో కలుపు కొని తగుమాత్రం నెయ్యి వేసుకొని తిన వచ్చును. చేదుపొట్ల కాయకూర, మామూలు పొట కాయకూర, బీరకాయకూర, బూడిద గుమ్మడికాయకూర, లేత అరటికాయకూర, పొన్నకూర, పొన్నగంటికూర, చిర్రికూర, తెల్లగలిజేరుకూర, తుమ్మికూర, తినవచ్చును ఉసిరిక పచ్చడి అన్నం తినవచ్చును నీరుల్లి, కొత్తిమీర యాలు తినవచ్చును గోయ్యాలు తినవచ్చును. వెన్నలో పంచదార కలుపుకొని తినవచ్చును. మేకమాంసం, అడవి జంతువుల మాంసం తినవచ్చును. చీనీ పంచదార తినడం మంచిది చెరకుపానకం త్రాగవచ్చును పగరుగల పదార్థాలు తినవచ్చును మరిగించి చల్లార్చిన నీరు త్రాగుతూండాలి ఈ రోగం గలవారు కన్నె లేడిపిట్ట లేదా కారండపిట్ట లేదా కామిలిపిట్ట మాంసాన్ని తిన్నట్లయితే యీ రోగం శీఘ్రంగా తగ్గుతుంది

అపథ్యములు — చల్లన్నం, క్రొత్త బియ్యపు అన్నం, గురుత్వకర విదాహకర పదార్థాలు తినకూడదు నువ్వులపప్పు, వేరు సెనగపప్పులతో చేసే పదార్థాలు తినకూడదు. నూనె పిండి వంటలు తినకూడదు ఆకు కూరలు, ఆవకాయ మారగాయ తినరాదు. ఊరుపిండి, తెలకపిండి తినకూడదు సారా, బ్రాంది, కల్లు మొదలగు మత్తుపానీయాలు త్రాగకూడదు మలమూత్రముల వేగాన్ని నిరోధించ కూడదు జబ్బు బాగా తగ్గేటంత వరకూ మైథునం మానెయ్యాలి. అమితంగా స్నానాలు చేయకూడదు. తాంబూలం వేసుకో కూడదు.

విసర్పి రోగులకు

ఎర్రగా గాని తెల్లగా గాని పొక్కులు శరీరంపై ఒకచోట గుంపుగా లేచి వ్యధతో కూడిన చర్మరోగానికి 'విసర్పి' అనిగాని 'సర్పి' అనిగాని అంటారు

పథ్యములు:— ఈ రోగం గలవారు మంచి ప్రాత బియ్యపు అన్నం, గోధుమ అన్నం, బార్లీ అన్నం తినవచ్చును కొర్ర అన్నం, వెదురు బియ్యపు అన్నం కూడా తినవచ్చును. పెసరపప్పు, కందిపప్పు, సెనగపప్పు, మసరపప్పు— వీని కట్టు అన్నంలో కలుపుకొని నెయ్యి వేసుకొని తినవచ్చును. వెన్న తినవచ్చును కాకరకాయకూర, తుమ్మికూర తినవచ్చును ఉసిరిక పచ్చడి తినవచ్చును ఉసిరిక, దానిమ్మ, ద్రాక్ష, ఆపిల్ పళ్ళు తినవచ్చును శరీరానికి చందనం పూసుకోడం వల్ల బాధ తగ్గుతుంది అరణ్య ప్రదేశములలో సంచరించు జింక, కుందేలు మొదలగు వాని మాంసములు తినవచ్చును

అపథ్యములు:— క్రొత్త బియ్యపు అన్నం చల్లన్నం యీ వ్యాధి గలవారు తినకూడదు. మినుగులతో చేసే పదార్థాలను, ఉలవలతో చేసే పదార్థాలను తినకూడదు నువ్వుల పప్పుతోచేసే పదార్థాలు తినకూడదు. అన్నంలో నూనె వేసుకో కూడదు వేరుసెనగకాయలు తినకూడదు నూనె పిండి వంటలు తిన కూడదు తినే పదార్థాలలో ఉప్పు, పులుపు, కారం బాగా తగ్గించెయ్యాలి విదాహకర పదార్థాలు తినకూడదు. మద్యపానం, ధూమపానం మానెయ్యాలి ఎండలోను, గాలిలోను తిరగ కూడదు మలమూత్రముల వేగాన్ని నిరోధించ కూడదు అతిగా నడవ కూడదు పగటివేళ నిద్రపోకూడదు రోగం బాగా తగ్గేటంతవరకూ మైథునం మానెయ్యాలి దుఃఖం, క్రోధం యిటువంటి మానసికమైన బాధలకు, ఉద్రేకాలకు లోను కాకూడదు.

సేకరణ: ఆకుండి నారాయణమూర్తి

'ఆవిడకు బ్భావున్నప్పుడు ఏవరేమను కుంటే "ం? అంతెందుకు? నువ్విలా క్రాపు దువ్వుకోవటం బావులేదని, పిలక తగిలించుకోమని ఎవరన్నా అంటే చేయగలవా?' అన్నాడు చలం.

అసమర్థుడు

విశ్రాంతయ్యాను నేను.

'మవ్వు చేయగలవు. అవునా!' అన్నాడు చలం నవ్వుతూ, వాడలా నవ్వుతుంటే నాకు

పెగ్గేసేరిదీ— కారణం కాలేజిలోని వాళ్ళంతా నా వాలకం చూసి, నవ్వుతూ,

'తాతయ్యలా ఆ ప్యాంటేమిట్రా? ఆ నిండువేతుల షర్టేమిటి?' అంటూ వెక్కిరించడం, హాయిగా తిరిగే నేను, కూర్చోవడానికే ఇబ్బందిపడే ప్యాంట్లు కుట్టించుకొని, పొట్టి చేతులతో, బిగుతుగా ఆడవాళ్ళ జాకెట్లులాంటి చొక్కాలు కుట్టించుకొని వేసుకోవడం మొదలుపెట్టాను. అందరికి ఏం బాగుందో కాని, నా వరకు మాత్రం ఇబ్బంది పడాల్సివచ్చేది ఆ బట్టలు వొంటిమీద వున్నంతసేపు.

'రాజా! చాలామంది మరొకరి కోసం బ్రతుకుతుంటారు. కొంతమంది తమ కోసం మాత్రమే బ్రతుకుతుంటార్రా! పదిమంది మెప్పుకోసం తమ ఇష్టాన్ని చంపుకొని బ్రతకడం చాలామందికి అలవాటు' అన్నాడు.

నిజం చెప్పొద్దూ. చలంమీద బోల్డంత కోపం వచ్చింది. 'ఏడనంటే వీడిలా పరోక్షంగా నన్ను అనడందేనికి?' అనుకున్నాను.

'నువ్వేలా బ్రతుకుతున్నావురా చలం? ఏడనంటే నువ్విలా అందర్ని దుయ్యబట్టడం...బావులేదు' అన్నాను. వొళ్ళు మండిపోయి, అసలు నా బాధ అర్థం చేసుకోడేం అన్న కోపంతో.

నామాటలకు చలం పకపకా నవ్వాడు. 'నేను నేనుగా బ్రతుకుతున్నారా! నాకోసం బ్రతుకుతున్నాను. నా కోవకు చెందింది సుజాత. అందుకే అంటున్నాను. నేనెవ్వర్ని దుయ్యపట్టడంలేదు కేవలం నా అభిప్రాయం చెప్పానంతే—అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు' అంటూ నా భుజంతట్టాడు, నేనో తెలివితక్కువ వాడినన్నంత జాలిగా. వాడితో ఎందుకు అన్నానా సుజాత విషయం అంటూ నన్ను తిట్టుకున్నాను.

ఆనాటినుండే చలం అంటే ఓవిధమైన బెరుకులాంటిది ఏర్పడింది అది భయంగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు.

ఫైనలియర్ పరీక్షలు యింకా రెండు నెలలున్నాయ్. సుజాత అంటే నాకు ఇష్టం అనినా రూమ్‌మెట్ ప్రకాశం ఎలా కనిపెట్టాడో కాని, 'ఓ ఉత్తరం రాయకూడదురా రాజా! ఇలా ఆవిడ నామ స్మరణ చేయకపోతే' అన్నాడు.

'ఛ...' అన్నాను నేను నా అభిప్రాయం వాడు కనిపెట్టకూడదని జాగ్రత్తపడుతూ.

'ఛ...ఏమిట్రా నీ బొంద, రాత్రిళ్ళు


అతనంటే నాకు ప్రాణం. అతన్తో ఎట్లా చెప్పేది?
''అతనంటే నాకు ప్రాణం. అతన్తో ఎట్లా చెప్పేది?''
Binaca
Binaca Green
C I B A Cosmetics

అసమర్థుడు

కలవరిస్తున్నావ్ కూడా' అన్నాడు. పిరికితనానికి తోడు. వాడిమాటలు నమ్మే బలహీనత నాలో వుండడంవల్ల వాడిమాటలు నిజమని నమ్మేసాను. వాడి పోరు భరించలేక, ఓరోజు ఉత్తరం రాయడానికి ఒప్పుకున్నాను.

'రేయ్...ఆవిడకు ఇష్టంలేకపోతే నానా రభస...' భయంగా అన్నాను.

'ఛ.... ఎందుకు అవుతుంది. నువ్వే రాసావన్న గ్యారంటి ఏమిటి? క్రింద నీపేరు సగం వుండగానే సరిపోతుందా? బోల్డుమంది రాజాలున్న ఈ కాలేజీలో ఆ రాజావు నువ్వేనని ఎలా తెలుస్తుందిరా?'

'నా పేరు అసలు రాజే కదురా!'

'అయితే—రాసేవాళ్ళు పూర్తి పేరు రాస్తార్రటా! రాయరు! అందుకని నువ్వు నీ పూర్తి పేరు రాసినా సగం పేరను కొని ఆవిడ నిన్నేం అనదు.'

'అసలు పేరే రాయకపోతేనేం?' అన్నాను నా మాటలకు ప్రకాశం విసుక్కున్నాడు.

'నీ కిష్టం అంటూ ఉత్తరం రాస్తున్నావా! మరి ఆవిడకు నువ్వంటే ఇష్టం అనుకో! ఆవిడ జవాబు రాయాలంటే ఎవరికిస్తుంది ఇంతమంది రాజాలు...' అంటూ నా మొహంలోకి చూసి, 'ఒరే రాజా! నీ ప్రాణానికి నా ప్రాణం. ఉత్తరం రాసావన్న సంగతి, ఆవిడకు రాసిందే నువ్వేనని తెలీదురా! నేను హామీ ఇస్తున్నాగా! అంతగా అడిగితే తెలీదని చెప్పొచ్చు'అన్నాడు.

'కాని ప్రకాశం! ఆవిడ వాళ్ళనువ్మాత్రం ఊరికే...'

'ఛస్! ఊరుకో! రాసినవాడివి నువ్వే ఒప్పుకోనప్పుడు, అసలు ఉత్తరం రాయని వాళ్ళెలా ఒప్పుకుంటార్రా? అసలు ఎవరో తెలీక ఆవిడే ఊరుకుంటుంది' అన్నాడు ప్రకాశం ధైర్యం చెబుతూ.

నేను 'సరే' నన్నాను అతిస్వార్థంగా. వాడు చెప్పినట్లే ఉత్తరం రాసి పోస్టు చేసాను. భయంతో, కత్తివాటుకు నెత్తురు చుక్కలేకుండా పాలిపోయిన నా మొహం చూసి.

'ఒరేయ్! గుండె వుందికదురా!' అన్నాడు ప్రకాశం ఉత్తరం పోస్టు చేసాకా. వాడా మాట అన్నక్షణంలో, 'నాకు గుండె అనేది వుందా' అన్న భయం, వుంటే దిక్కు

4 లేబిల్లకు మీకు




ఉచితముగా
ఒక జార్ రికరి

ఇప్పటినుండి మీ రికరి జార్ మీదనున్న లేబిళ్లను
భద్ర పరచండి. కప్పు, సాసరు చినగకుండా
4 లేబిళ్లు యిచ్చి మీకు దగ్గరగా నున్న డీలరునుండి
ఉచితముగా ఒక 50 గ్రాముల జారును పొందండి.
మీ ప్రత్యేకమైన కాఫీ —రికరి ఇన్‌స్టెంట్.


చిక్కనైన విలువైన, సంతృప్తి కలుగ చేసే
మీకు ఇష్టమైన కాఫీని సేవించండి.

ఈ అవకాశము ఆంధ్రప్రదేశ్, తమిళనాడు,
మరియు ఒరిస్సా రాష్ట్రములోని కొన్ని ప్రత్యేక
పట్టణములలో మాత్రమే.

కొత్తది! అధికస్ట్రాంగ్
రికరి®
ఇన్‌స్టెంట్



ప్రత్యేక రుచిలో ప్రత్యేక కాఫీ



అసమర్థుడు

డుందీ?' అనే అనుమానం వచ్చి, సమాధానం తెలియక, నిలువునా వొణికిపోయాను.

మూడు రోజులు చాలా భారంగా, భయంగా గడిచిపోయాయి.

ఆ రోజు ప్రొద్దున కాలేజి కెళ్ళగానే, ఏనాడూ లేనిది. సుజాత నన్ను చూడగానే నవ్వింది. ఒక్కసారిగా గుండె ఝల్లుమంది. ఏమీ తెలియని సందిగ్ధావస్థలోపడి కొట్టుకుంటుంది. ప్రకాశం నామానాటికి నన్ను వొదిలి మధ్యాహ్నంనుండి కాలేజి ఎగ్గొట్టి మ్యాట్నీ కెళ్ళాడు.

ఆఖరు పిరియడ్ క్లాసు లేదనడంతో గుండె గుప్పిట్లో పెట్టుకొని, హాస్టల్‌కు గబగబా అడుగులేస్తూ బయలుదేరాను. ఇంతలో చలం పిలిచాడు నన్ను. వెనుతిరిగి చూసిన నా ప్రాణాలు ఎగిరిపోయాయి. దూరాన చెట్టుక్రింద నిలబడి నన్ను పిలిచిన చలం ప్రక్కనే సుజాతను చూస్తూనే భయపడిపోయాను. నిలబడ్డ చోటునుండి కదలలేనేమో. కదిలితే ప్రాణాలు పోతాయేమో నన్నంత భయంవేసి నిలుచున్నచోటే బిగుసుకుపోయాను.

చలం నా దగ్గరికివచ్చి చెట్టు క్రిందికి తీసుకుపోయాడు.

'ఈ ఉత్తరం రాసింది మీరేనా?' అంది సుజాత, నేను రాసిన వుత్తరాన్ని నాకు చూపిస్తూ. అవునని కాని, కాదని కాని, అనడానికి నా పెదవులు సంసిద్ధంగా లేవు. నోట్లో తడారి పోయింది.

'రాజా! నువ్వేనా రాసింది?' ఆనందయిస్తూ అడిగాడు చలం. చివరికి తలూపాను. సుజాత నమ్మలేనట్టుగా నావైపు చూసింది.

'ఎందుకు రాసారూ?' సుజాత ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో తోచలేదు నాకు.

'రాజా! నువ్వు ... నువ్వు రాసావా? నిజంగానా?' అన్నాడు చలం. నేను మాట్లాడలేక పోయాను.

'ఒక అమ్మాయికి ఉత్తరం రాయగానే సరిపోదు. ఎదురు పడ్డప్పుడు సమాధానం చెప్పాలి' అన్నాడు కటువుగా — చలం మాటలకు మౌనమే సమాధానమైంది. కాని సుజాత కళ్ళల్లో లీలగా తిరిగిన కన్నీటిని చూస్తూనే నా పిరికి

గుండె చలించిపోయింది!

'క్షమించండి సుజాతగారూ! యింకెప్పుడు యిలాంటిది జరుగదు' అన్నాను. నా మాటలకు ఇద్దరు ఉలిక్కిపడ్డారు.

'నేను చాలా సిల్లీగా ప్రవర్తించాను. క్షమించండి. మీ రంటే నా కుండే ఇష్టాన్ని నాలోనే దాచుకున్నాను. కాని... ప్రకాశం ధైర్యం ... మన్నించండి!' అన్నాను.

'అయితే ప్రకాశం రాయమంటే రాసావా!' అన్నాడు చలం సుజాత వెళ్ళిపోయాకా.

'ఊఁ...'

'ఏం? ఆ ఆలోచన నీకు రాలేదూ?'

'వచ్చినా రాసే ధైర్యం లేదు.'

'ఒకవేళ సుజాత నీ ఉత్తరానికి జవాబిస్తే మళ్ళీ రాసేవాడివా?'

'ఊఁ...'

'ఎంతవరకు? ఈ ఫైనలియర్ పరీక్షలు అయిపోయేవరకు అవునా? ఆ తరువాత?' నేను మౌనంగా వుండిపోయాను.

'సుజాతను ప్రేమిస్తున్నావా?' చలం ప్రశ్నకు సరియైన సమాధానం నా దగ్గిర లేదు. ఆలోచించసాగాను.

'మరి పెళ్ళిచేసుకోవా?' చలం ప్రశ్నకు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను నేను. సమాధానం చెప్పేలోగానే, 'మీ అమ్మ నాన్న వాళ్ళు ఒప్పుకుంటారా?' అన్నాడు చలం.

'ఎందుకు ఒప్పుకోరూ?'

'ఎందుకంటే ... సుజాత మీ కులం కాదు. కట్నాలు యివ్వుకోలేదు' ఉలిక్కిపడ్డ నాకు, ఒక్కసారిగా, పాతికవేల కట్నంతో, నాకోసం రిజర్వు చేయబడ్డ మామయ్య కూతురు కమల గుర్తొచ్చింది. నాన్న రూపం గుర్తుకొచ్చి వణికి పోయాను.

'వాళ్ళు ఒప్పుకోకున్నా నువ్వు పెళ్ళి చేసుకోగలవా?'

'ఎలా?' అన్నాను అవమానకంగా.

'ఆ ధైర్యం లేని వాడివి ఉత్తరం ఎందుకు రాసావ్? ప్రకాశం ఏదో అన్నాడని ఉత్తరం రాయడం, అమ్మ నాన్న ఒప్పుకోరని పెళ్ళి చేసుకోక పోవడం ... పైగా సుజాతను ప్రేమించానంటున్నావ్.' అన్నాడు. నేను తల వాల్చుకున్నాను.

'నువ్వొట్టి పిరికి వాడివి రాజా!, వొట్టి చేతకాని వాడివి. కోసం నువ్వు ఏనాడు బ్రతకలేని వాడివి నువ్వు'... అంటూ ఆగి,—

'నీ ఉత్తరం చూసి సుజాత ఎంత బాధ పడిందో తెలుసా? రెండు రోజులుగా నీ బెరుకుతనం. భయం కనిపెట్టి ముందుగా ఉత్తరం రాసింది నువ్వని నమ్మలేసి సుజాత, చివరికి నమ్మి నాతో చెప్పింది. నీ పిరికితనం నాకే కాదు, సుజాతకు తెలుసు కాబోలు! అందుకే ఏమందో తెలుసా?' 'చలం, రాజా వొట్టి పిరికివాడు... ఏమి అనకు' అంది జాలిగా, కాని రాజా!

నువ్వు వినాడరా [ప్రేమించి పెళ్ళి చేసుకోవా? అందుకే పెళ్ళి చేసుకొని ప్రేమించడం నేర్చుకో' అన్నాడు. నేను తలవాల్చుకున్నాను.

అనాటి నుండీ ఈనాటి వరకు చలం ముందు నేను తలవాల్చుకునే వున్నాను. కాని ఆనాటికి ఈనాటికి నాకు అర్థం కాని దొక్కటే — సుజాతకు చలం అంటే చాలా ఇష్టం. వాళ్ళిద్దరు పెళ్ళి చేసుకుంటారనుకున్నాను. కాని అలాంటిదేం జరగలేదు. సుజాత ఏమయ్యిందో తెలీదు కాని; చలం మాత్రం మా ఊళ్ళోనే, కలెక్టరాఫీసులో గుమస్తాగా చేరాడు. మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. నేను...నేను మాత్రం నాకోసం బ్రతకడం నిజంగా మానుకున్నాను.

మామయ్యకు వ్యాపారంలో నష్టం రావడంవల్ల, కట్నం విషయంలో నాన్నగారు మరీ నిక్కచ్చిగా వుండడంతో; కమల మరొకరి భార్య అయ్యింది. నే నింకా నాన్నగారి వ్యాపారంలో అమ్ముడుపోనివాడిగానే మిగిలిపోయాను.

ఇప్పుడు నేను వెళ్ళేది, నాకు తగిన ధర వస్తుందా, రాదా అని తెలుసుకోవడానికే. నా బి. ఏ. డిగ్రీకి, ఉన్న ఆస్తికి, పాతికవేలకు తక్కువకాని కట్నంతో వచ్చే అమ్మాయి వుందిట హైదరాబాద్‌లో. నాన్నగారు రెండు రోజులు ముందుగానే వెళ్ళారు.

* * *

'ఒరేయ్! రాజా! బస్సు వచ్చేసిందిరా పద పద' అన్నాడు చలం. నేను ఉలిక్కిపడుతూ లేచాను. బస్సులో కూడా నేను చలంతో సరిగ్గా మాట్లాడలేదు. మాటల్లో నా విషయం పసికట్టేస్తే, వాడి ముందు తల వంచాల్సి వస్తుందని...

'రాజా! రేపు సాయంత్రం యిక్కడే కలుసుకుందాం' అంటూ బస్సు దిగగనే వెళ్ళిపోయాడు చలం.

'హమ్మయ్య' అని అనుకుంటూ నాన్నగారిని కలుసుకోవడానికి వెళ్ళాను.

ఆ సాయంత్రం నాన్నగారితోపాటు అమ్మాయిని చూడ్డానికి వెళ్ళాననుకున్నాను. కాని నాన్నగారేం మాట్లాడలేదు. మర్నాడు కూడా పలకలేదు.

'సాయంత్రం వెళ్ళాను నాన్నా!' అన్నాను.

'అలాగే వెళ్ళు' అన్నాడు నాన్న. నాకేం అర్థం కాలేదు. నన్నెందుకు రమ్మన్నారో తెలియలేదు.

'ఆ అమ్మాయి అంతగా బావుండదురా' అన్నాడు నాన్న నా అనుమానం కనిపెట్టి.

'ఏదేమిటి ఫోటోలో అంత అందంగా వుంది కదూ?' అనుకున్నాను. నా ఆలోచనలకు స్వస్తి వాక్యం పలుకుతూ.

'సింగినాదం! ఫోటోలో బాగానే వుంది కాని...నాకేం నచ్చలేదు. కట్నం కూడా అంతగా యిచ్చుకోలేరని తెలిసింది, నేనింకా నాలుగు రోజులుండి వస్తాను కాని నువ్వు వెళ్ళు' అన్నాడు. ఏమి అనలేక బయలుదేరాను నేను.

బస్సు స్టేజిలో చలం కలిసాడు.

'వెళ్ళిన పని అయ్యిందిట్రా' అన్నాడు.

'ఊఁ...' అన్నాను నేను ముభావంగా ఎందుకో నా పిరికితనం నేనే ఒప్పుకోలేక; 'నాన్నగారిదగ్గరికి వచ్చాన్రా! నాకేం వస్తుందంటాయ్' అన్నాను.

'నేను వచ్చినపని అయిపోయిందిరా రాజా! వచ్చేనెలలో నా పెళ్ళి' అన్నాడు.

'పెళ్ళా?' అన్నాను నేను.

'ఊఁ..సుజాత గుర్తుంది కదూ! నిన్న సుజాత నేను రిజిస్ట్రారు ఆఫీసులో అప్లికేషన్‌లు పడేసాం.'

'ఏదేం?' అన్నాను నేను.

'మామూలే! వాళ్ళ నాన్న, మా అమ్మ ఒప్పుకోవడం లేదు. సుజాతే యింటికి పెద్దమ్మాయి. ఆ తరువాత అబ్బాయికి ఈ మధ్యే ఉద్యోగం దొరికింది. ఆ అబ్బాయికోసమే యిన్నాళ్ళు ఆగాల్సి వచ్చింది. ఇక వాళ్ళ కుటుంబానికి సుజాత అవసరం అంత వుండదు.'

'మరి...నీ అమ్మ...'

'అమ్మకెంతో నచ్చ చెప్పాన్రా వినలేదు. వింటుందని నేను ఓర్పుగా చూసాను యిన్నాళ్ళు. యిక లాభం లేదు. అమ్మ అన్నయ్య దగ్గరికి వెళ్ళిపోతానంది. అనడం ఏమిటి వెళ్ళిపోయింది. అందుకే...' అంటూ తేలిగ్గా నవ్వేసాడు.

చలం కొద్దిగా అర్థమయ్యాడు.

ఎంత ధైర్యం? అని అనుకుంటూ, 'కట్నం లేకుంటే ఏమిటి నాన్నా' అని అనేందుకు తెగువలేని నేను, చలం ముందు మరోసారి నాన్న వ్యాపారంలో ధర రాని సరుకులా, పిరికితనాన్ని నింపుకొని; నా అసమర్థతను నిరూపించుకుంటూ తల వంచాను.

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు:

ప్రచురణకి స్వీకరించబడని తమ వ్రాత ప్రతులని తిప్పిపంపవగోరే రచయితలు వ్రాత ప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులుమాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాతప్రతులతోగాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాత ప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు:

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాతప్రతులు మేమే తిప్పిపంపిస్తాము. వ్రాతప్రతులతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంపవలసిన అవసరం లేదు. 100 అరఠావు పేజీల పైన ఉన్న వ్రాతప్రతులే నవలల క్రింద పరిగణింప బడుతాయి.

కార్టూన్‌లు:

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్‌ల తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము. కాని, వాటి విషయమై ఎటువంటి బాధ్యతనీ స్వీకరించ లేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్లు పంపగలరు.

సంపాదకుడు
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

పుస్తకాలు

ది ఇండియన్ ప్రెస్ ప్రొఫెషన్ టు ఇన్‌డస్ట్రీ

రచన: శ్రీ అనుల్ భట్టాచార్‌జీ (ప్రెస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా), ప్రచురణ: వికాస్ పబ్లికేషన్స్, ఢిల్లీ, బొంబాయి, బెంగుళూరు, కాన్పూర్, లండన్, వెల: రు. 25.

1969 ఆగస్టు నుంచి విడివిడిగా 'దర్యాప్తులు' జరిపి ఈ మంచి పుస్తకం వ్రాశారు భట్టాచార్‌జీ. 216 పుటలున్న పుస్తకమిది. ఎ, బి, సి అనే మూడు ప్రధాన విభాగాలున్నయ్. వీటిలో మళ్ళీ కొన్ని ఉపఖండాలున్నాయ్.

ప్రెష్షర్ ఆన్ మాస్ మీడియా అనేది చాలా ముఖ్యమయిన ఉపఖండం. చదివి, విజ్ఞులు ఆలోచించ దగిన అంశాలున్నాయ్. ప్రచార, ప్రసార సాధనాలకు రాజ్యాంగంలో ఎంత స్వేచ్ఛ ఉన్నది—రాజ్యాంగ సభ నాటినుంచీ యీ అంశాన్ని వివరంగా పరిశీలించారు రచయిత. అయిర్‌లెండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలెండ్, ఫిలిప్పైన్స్, మెక్సికో, బెల్‌జియమ్, డెన్‌మార్క్ వంటి రాజ్యాలలో పత్రికలకు ఎంత స్వేచ్ఛ ఉన్నదీ సూచించారు ఈ రచయిత. పత్రికల స్వాతంత్ర్యం గురించి మాత్రమే కాక, రేడియో, వార్తా చిత్రాల వంటి వాటికి గల స్వేచ్ఛను కూడా చర్చించారు. పత్రికల మీద సాధారణంగా ఎటువంటి ఒత్తిడి వస్తూంటుందని—ప్రభుత్వం నుంచి మాత్రమేకాదు. ఆర్థిక, రాజకీయ, సాంఘికమయిన ఒత్తిళ్ళు కూడా ఉంటయ్. పత్రికల మీద దాడి ఇటీవల మనదేశంలో కూడా ఎక్కువయింది. 1964 లో కెనడాలో పత్రికల మీద రాజకీయవాదులు దాడి చేశారట. కారణం— కెనడా పత్రికల స్వభావం. ఈ అంశాన్ని చర్చిస్తూ 66వ పుటలో యీ రచయిత యిట్లా వ్రాశారు:

'... వుయ్ హావ్ సీన్ అర్‌లియర్ హ్వైల్ డిస్కసింగ్ ది ప్రెష్షర్స్ బేస్‌డ్ ఆన్ కన్‌స్టిట్యూషనల్ అండ్ లాస్ ఎగైన్‌స్ట్ ది ప్రెస్, ఫ్రీడమ్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ ఈజ్ కాన్‌స్టెంట్‌లీ‌స్‌డ్ విత్ ది పాసిబిలిటి ఆఫ్ ఇంటర్‌వెన్‌షన్ బై ది స్టేట్' నిజమే. కానీ ఏమిచెయ్యాలి? ఈ ప్రమాదాన్ని ఎట్లా నిరోధించాలి? ఎవరు నిరోధించాలి? కండబలం గలవాడిదే రాజ్యమనే సూత్రం ఒకానొకప్పుడు చలామణి అయింది. అధికారం చెలాయించేవాడు చేసేదే ఒప్పు అనే సూత్రం యీ రోజులలో చలామణి అవుతోంది. ఈ ధాటికి, దాప్ కానికీ ఇంగ్లీష్ పత్రికల సంగతే మోగానీ తెలుగు పత్రికలు తట్టుకొని నిలబడగలవా?

న్యూస్‌ప్రింట్ కొటాలు సంగతిని కూడా ఈ రచయిత చర్చించి, కొరతల పరిష్కారానికి కొన్ని సూచనలు చేశారు. కనీసం పత్రికా రచయిత అయినా చదివి, గ్రహించి, 'క్షాంతలో కొంతగానయినా కృషి చెయ్యవలసిన అంశాలున్నయ్ ఈ గ్రంధంలో. ఇదే పద్ధతిలో తెలుగు పత్రికలను గురించీ తెలుగు పత్రికలకు పరిశ్రమ అండను గురించీ ఎవరయినా ఒక గ్రంథం వ్రాస్తే బాగుంటుంది. పత్రికలకు పరిశ్రమల అండదండలు ఉండవచ్చునా? ఉండవచ్చునంటే ఎంతవరకూ ఉండవచ్చు? అందునా వర్తమానంలో తెలుగు పత్రికలకు పరిశ్రమల అండదండలున్నవా? ఉండే అవకాశం ఉన్నదా?

—వి. ఎస్. అవధాని

మూడు నవలలు :

(1) రాగోదయం

కె. వసుంధరాదేవి, 259 పేజీలు — వెల: 5—00

(2) గాలి-వాన

కె. వసుంధరాదేవి—శ్రీముఖి : 176 పేజీలు వెల 3—50.

(3) సాగరి

కె. వసుంధరాదేవి—శ్రీముఖి : 178 పేజీలు వెల: 3—50.

ప్రాప్తిస్థానం, నవజ్యోతి పబ్లికేషన్సు, ఏలూరు రోడ్, విజయవాడ—2.

జానకి పెరుగుతున్నది మేనత్తగారింట్లో. బావ రఘుని అత్త కోరిక తీర్చేందుకని పెళ్ళాడుతుంది. భర్తంటే అరంకానంత పసిమనసామెది. జానకి ఆదరణ లభించని రఘు యుద్ధంలో చేరి బిడిపగలగొట్టే ప్రయత్నంలో కనిపించకుండా పోతాడు. ఇంటిల్లిపాదీ క్రుంగిపోతారు. రఘు స్నేహితుడు కుమార్ ఉద్యోగం వదులుకొని వీరి ఊరిలో, మంచి ఉద్యోగంలో చేరి వీరింటనే వుంటాడు. ఒక శుభ దినాన రఘు బతికేవున్నాడన్న వార్త వీరికందుతుంది. అతన్ని గురించి పేపర్లలో చదివి సంతోషిస్తారు. రఘు తమ ఊరిలో ఘనంగా సత్కరించబడతాడు. తను ప్రోగుచేసిన ధనాన్ని దేశానికిచ్చేస్తాడు. జానకి జబ్బులో సేవ చేస్తాడు. జానకిలో స్థానం సంపాదిస్తాడు. పేరోజు జరిగిన విందులో జానకి తల్లిదండ్రుల గురించిన రహస్యం చెప్తారు దశరథరామయ్యగారు. జానకిలో పశ్చాత్తాపం కలుగుతుంది. ఆరాత్రి విందులో కుమార్‌కి, శాంతికీ పెళ్ళి మాటలు జరుగుతాయి. ఆరాత్రికి రఘుని కనికరిస్తుంది జానకి.

ఈ కథలో దేశసేవ తాలూకు త్యాగాలు కోకొల్లలు. అవన్నీ సినిమాల్లో జరిగే విడ్డూరాలు. మామూలు నవల్లో పాఠకుల బుర్రల్ని ఉత్తేజపరచవు.

*   *   *

గాలి వానలో కారు డ్రైవ్ చేస్తున్న విష్ణుకిరణ్ అచేతనుడైనప్పుడు నో గోడని 'ఢీ' కొని ఆగిపోతుంది కారు. అదే ఇంటి వరండాలో నిలబడ్డ అతనికి మరో స్త్రీ ఆకారం కనిపిస్తుంది. ఉరుములకి భయపడి దగ్గరవుతారు. దూరంగా జరిగిన ఆమెను 'రండి' ఎన్నిజన్మల అనుబంధమో, ఈ క్షణం దాటితే తిరిగిరాదు. ఒకసారి ముద్దుపెట్టుకుందాం' అని ఆహ్వానిస్తాడతను (?) ఆమె ముందుకొస్తుంది! మరొకసారి మెరిసినప్పుడు పేర్లు చెప్పుకుంటారు. విడిపోతారు. అప్పుడు రాత్రి రెండవుతుంది.

మరణ సమయంలో తల్లికి సేవచేస్తున్న కరుణ తన మేనమామకూతురన్న సంగతి విని— పైగా కరుణనే తాను పెళ్ళాడవలసిన వుందని తెలిసి తల్లిని మందలిస్తాడు. తనతల్లికి మేనమామ చేసిన అన్యాయాన్ని మర్చిపోలేనంటాడు. తల్లి కోరికకి తలవంచి అంగీకరిస్తాడు చివరికి. తల్లి చనిపోయేక. కరుణ వెళ్ళిపోయేముందు తన చిన్ననాటి కోరికల్ని చెప్పుకుంటుంది. ఆమె వెళ్ళిపోయేకకాని తన తప్పు తెలిసి రాదతనికి. కరుణ పెళ్ళి సంగతి విని నిరాశతో వెనక్కి తిరుగుతాడు.

ఉద్యోగంలో ప్రవేశించి నిజాయితీలో విరోధాలు కొనక్కుంటాడు. మరొక ఊరిలో 'సీతను ప్రేమించి— పెద్దచిన్నల తారతమ్యానికి తలవంచి —మరచిపోటానికి కళ్ళవెంట బయలుదేరాడు దారిలో సుమతి అనే సినీనటుడి భార్యను అన్న ఆదుకుంటాడు. ఆమె చావుతో—అతని యాత్ర ముగుస్తుంది. దారిలో 'బాలయోగిని అమ్మని దర్శించాలని ఆగుతాడు. సరిగా మొదటిరోజు గాలివానలో— అర్ధరాత్రిలో పరిచయమయిన 'మనసిజని' తిరిగి అక్కడ చూస్తాడు. ఆనాటి తన ముద్దు గుర్తొస్తుంది. సుమతి చెప్పిన స్నేహితురాలు మనసిజగా గుర్తిస్తాడతను. 'బాలయోగిని అమ్మ' వార్ని దీవిస్తుంది. అర్ధరాత్రిలో ఆడపిల్లలు ఒంటరిగా కారు డ్రైవు చేసుకోవడం—ఈ కాలానికి కాస ముందడుగేననుకోవాలి! ఇలాగే వారి ప్రథమ పరిచయంలోని ముద్దుకథ (?) స్టీరింగ్‌వీల్ పట్టుదప్పిన కారు దెబ్బతిని ఆగిపోయికూడ డ్రైవు చెయ్యగానే పరిగెట్టటం, ఇవన్నీ రంగుల బొమ్మల్లో అందంగా అమురుతాయి.

*   *   *

సాగరిని వ్యామోహపరచి అనుభవించిన రవి— ధనవంతుల ఇంటికి మేనల్లుడి హోదాలో వెళ్ళిపోయేక, తల్లిదండ్రి లేని సాగరి గర్భవతిగా శ్రీధర్‌కి తారసిల్లుతుంది. అతనితల్లి ఆమెను కూతురుగా ఆదరిస్తుంది. రవిని, అనసూయను ఏకాంతం కోసం పల్లెకు పంపిస్తారు రావుగారు. అక్కడ ప్రజలను లసహ్యించుకున్న అనసూయకి రకరకాల గుణపాఠాలు చెప్తాడు శ్రీధర్. రవితో మాట్లాడిన 'మధు' సాగరి కొడుకని ఆమె శ్రీధర్‌కి భార్యకావచ్చని భ్రాంతి చెందిన 'రవి మనసు' వికలమవుతుంది. పట్నం వెళ్ళిపోయేక సిస్టర్లు తెచ్చిన శ్రీధర్ రవి జ్వరంలోని కలవరింతలు గమనించి 'మధు'ని సాగరిని తీసుకువస్తాడు. రవి అనుమానాలు పిచ్చిపోతాయి. అనసూయ ఇష్టాను సారం శ్రీధర్‌కిచ్చి వివాహం జరిపించాలనుకుంటారు రావుగారు.

ఈ కథలో 'కలిమికి—లేమికి' కలయికను సృష్టించి సఫలీకృతమయ్యారు రచయిత్రులు— పల్లెవాతావరణం బాగున్నది. శ్రీధర్ పాత్రచిత్రణ బాగుంది. మిగిలిన కథకి ప్రాముఖ్యం లేకపోయినా— కథ సాగిపోతుంది. పేజీలకి తగినన్ని పదాల కూర్పు లేనందున—ఇట్టే అయిపోతుంది నవల. అచ్చు తప్పులు అడుగడుగునా సిలేస్తాయి పాఠకుడ్ని.

— కృష్ణ

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press: 6 & 9, Thambu Chetty Street, Madras-1, and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada 3.
Editor : S. Radhakrishna.


వెంకన్న కోట
15
పొగ పీల్చకు! త్వరగా ఇక్కడ్నుంచి పద!
బైటికొచ్చి భూగృహం తలుపు వేసి గడియపెట్టి వెంకట్రమణని పట్టుకొని లాక్కెళ్ళాడు పంతులు
ఎక్కడికయ్యా ఎక్కడికి?
మాట్లాడకుండా రా!
ఓ గదిలో దూరి తలుపు గడియ పెట్టాడు
నువ్వేం భయపడకు! నా పేరు జేమ్స్ బాండ్! డిటెక్టివ్ ని!
మరైతే ఎందుకు సార్ అలా భయపడి పోతారు....
నేను పొరపాట్న ఇంగ్లీషు మాట్లాడాను - వెధవ ఆ గుండు కనిపెట్టేశాడు నన్ను - అందుకే నీకు ఇచ్చి మరో మందు కింద చల్లా!
(ఇంకా ఉంది)

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

